


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 267

బుధవారం 18-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**చౌక కాల్స్, డేటాకు చెల్లు!!**

కనీస చార్జీల విధింపుపై
ట్రాయ్ చర్చాపత్రం
-బిజినెస్‌లో



**ప్రపంచ ఉత్తమ జూ. రెజ్లర్ దీపక్**

యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్
వార్షిక అవార్డుల ప్రకటన
– స్పోర్ట్స్‌లో

# 3 ఆంధ్రప్రదేశ్‌కు రాజధానులు!

| అమరావతి | విశాఖ | కర్నూలు |
| --- | --- | --- |
| చట్ట సభలు శాసన రాజధాని | సచివాలయం కార్యనిర్వాహక రాజధాని | హైకోర్టు న్యాయ రాజధాని |




- 7–10 రోజుల్లో నిపుణుల కమిటీ నివేదిక..
- ఆ తర్వాత ఉత్తమ నిర్ణయం
- దక్షిణాఫ్రికాలాంటి దేశాల్లో మూడు రాజధానులున్నాయి
- చంద్రబాబు లెక్కల ప్రకారం రాజధానికి రూ.1.06 లక్షల కోట్లు కావాలి
- ఆయన ఐదేళ్లలో అప్పు తెచ్చి ఖర్చు చేసింది కేవలం రూ.5,800 కోట్లు మాత్రమే
- మిగతా రూ.లక్ష కోట్లకు పైగా ఎక్కడ నుంచి తేవాలి?
- ఈ డబ్బు కేవలం మౌలిక సదుపాయాలకు మాత్రమే..
- తాగు, సాగు నీరు.. స్కూళ్లు, ఆస్పత్రులు, మిగతా పనుల మాటేంటి?
- అందుకే ఏపీ సమగ్ర ప్రగతి, సంక్షేమం దృష్ట్యా అధికార వికేంద్రీకరణే మేలు

“ గత సీఎం చంద్రబాబు రాజధానిని డిసైడ్ చేశారు. ఆయన లెక్క ప్రకారం 53 వేల ఎకరాల్లో రాజధాని కట్టాలంటే.. ఎకరాకు కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.2 కోట్ల లెక్కన రూ.లక్షా ఆరు వేల కోట్లవుతుందని తేల్చారు. ఇది కనీస మౌలిక వసతుల ఏర్పాటుకు మాత్రమే. రాష్ట్రంలో ఇతరత్రా అభివృద్ధి పనులు, ఖర్చుల మాటేమిటి?

రాజధాని కోసం లక్ష కోట్లకు పైగా ఎక్కడ నుంచి తేవాలి? అప్పు తెస్తే వడ్డీ ఎంత అవుతుంది? వడ్డీ అయినా కట్టే పరిస్థితిలో రాష్ట్రం ఉందా? నాకు కూడా రాజధాని కట్టాలనే ఉంది. కానీ లక్ష కోట్లు ఎక్కడ నుంచి తేవాలి? లక్ష కోట్లు తెచ్చినా దానిని ఎక్కడ ఖర్చు పెట్టాలని కూడా ఆలోచించాలి.

ఈ పరిస్థితిలో వికేంద్రీకరణే మేలు. పెద్దగా ఖర్చు పెట్టకుండానే రాజధాని సమస్యలు కొలిక్కి వస్తాయి. విశాఖపట్నం ఇప్పటికే అభివృద్ధి చెందిన నగరం. అడ్మినిస్ట్రేటివ్ రాజధానిగా సరిపోతుంది. రోడ్లు వెడల్పు చేసి మెట్రో రైలు తెస్తే చాలు. అటు కర్నూలులో జ్యుడీషియరీ క్యాపిటల్ ఉంటుంది. లెజిస్లేటివ్ క్యాపిటల్ ఇక్కడే (అమరావతి) ఉంటుంది. ”

- వివరాలు 2లో



మంగళవారం యాదాద్రి ప్రధాన ఆలయం వద్ద నిర్మాణ పనులపై సూచనలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# పనుల్లో తొందరొద్దు

## యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్

- ఈ పనులు డెడ్‌లైన్ పెట్టుకొని చేసేవికావు
- ఆగమశాస్త్రం ప్రకారం పకడ్బందీగా నిర్మాణాలు జరగాలి
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడటమే లక్ష్యం కావాలి
- చిన్నజీయర్ అనుమతితో స్వయంభూల దర్శనానికి త్వరలో ముహూర్తం..
- ఆరున్నర గంటలపాటు సాగిన సీఎం పర్యటన
- తొలుత ప్రత్యేక పూజలు, ఆపై పనుల పరిశీలన
- నిర్మాణాలపై అధికారులు, స్తపతులకు పలు సూచనలు
- రాతి శిలలను అద్భుత కళాఖండాలుగా మలిచారంటూ శిల్పులకు ప్రశంసలు

**సాక్షి యాదాద్రి:** యాదాద్రిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు శాశ్వతంగా నిలిచిపోయేవి కాబట్టి ఎలాంటి తొందరపాటు ఆత్రుత అవసరం లేదని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆగమశాస్త్ర నియమాల ప్రకారం పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అత్యంత పకడ్బందీగా నిర్మాణాలు జరగాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులు ఒక డెడ్‌లైన్ పెట్టుకొని చేసేవి కావని, శాశ్వతంగా ఉండాల్సిన నిర్మాణాలు కాబట్టి ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 17న యాదాద్రి సందర్శించి డిసెంబర్‌లో మళ్లీ వస్తానన్న సీఎం కేసీఆర్... చెప్పిన విధంగా సరిగ్గా నాలుగు నెలలకు యాదాద్రి పర్యటనకు వచ్చారు. మంగళవారం ఉదయం రోడ్డు మార్గాన యాదాద్రి చేరుకున్న కేసీఆర్ తొలుత బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు ఆశీర్వాదం అందజేశారు. అనంతరం సీఎం ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి

మిగతా 2వ పేజీలో ▶



## నిర్భయ కేసులో మరో మలుపు

- నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషి అక్షయ్ కుమార్ సింగ్ తనకు విధించిన మరణ శిక్షపై సుప్రీం కోర్టులో వేసిన రివ్యూ పిటిషన్ విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే తప్పుకున్నారు.

- వివరాలు 5లో



## ముషార్రఫ్‌కు మరణ శిక్ష

- రాజ్యాంగాన్ని తాత్కాలికంగా రద్దు చేసి, సైనిక పాలన విధించి తీవ్ర దేశద్రోహానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై పాకిస్తాన్ మాజీ సైనికాధ్యక్షుడు పర్వేజ్ ముషార్రఫ్‌కు పాకిస్తాన్ ప్రత్యేక కోర్టు మరణశిక్ష విధించింది.

- వివరాలు 5లో

## మన మహిళలే టాప్

- ఉద్యోగార్హ నైపుణ్యాలున్న వారిలో తెలంగాణ మహిళలదే అగ్రస్థానం
- ప్రతిభావంతులైన మహిళలు ఎక్కువున్న నగరాల్లో హైదరాబాద్‌కు తొలిస్థానం
- ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆరోస్థానంలో తెలంగాణ
- ఇండియా స్కిల్ రిపోర్టు–2020లో వెల్లడి

- వివరాలు 4లో











పౌరసత్వ సవరణ చట్టానికి నిరసనగా మంగళవారం ఢిల్లీలో ప్రభుత్వ ఆస్తులకు నిప్పుపెట్టి పోలీసులపై రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

# రణరంగంగా ఈశాన్య ఢిల్లీ

- పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సీలంపూర్‌లో భారీ ర్యాలీ
- లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించిన పోలీసులు
- కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల్లోనూ ఆందోళనలు
- సోనియా గాంధీ నేతృత్వంలో రాష్ట్రపతిని కలిసిన విపక్షం

5లో

## కొత్త వార్డులు వచ్చేశాయి

- డివిజన్లు/వార్డుల విభజన తుది ప్రకటన విడుదల
- 10 కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు కొత్త రూపం
- త్వరలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రకటన
- ఆ వెంటనే రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియకు శ్రీకారం.. జనవరిలో మున్సి'పోల్స్'కు చకచకా ఏర్పాట్లు

- వివరాలు 3లో

## 'మార్గదర్శి' కేసు.. హైకోర్టు తీర్పుపై అప్పీల్

- సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి స్పెషల్ లీవ్ పిటిషన్
- ఈ కేసులో రెండు రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేయాలని విజ్ఞప్తి

- వివరాలు 2లో



.. తాగి పడిపోలేద్సార్! మన బిల్లును చూసి!!




## తొమ్మిది రైల్వేస్టేషన్‌లకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ గుర్తింపు

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 9 రైల్వేస్టేషన్‌లకు ప్రతిష్టాత్మక ఐఎస్‌ఓ–14001:2015 సర్టిఫికేషన్ గుర్తింపు లభించింది. రైల్వే స్టేషన్‌లలో పరిశుభ్రత, పర్యావరణ అనుకూల విధానాల ఆధారంగా ఈ గుర్తింపు లభిస్తుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ ప్రాంతంలో ఉన్న హైదరాబాద్ (నాంపల్లి), సికింద్రాబాద్, కాచిగూడ, నిజామాబాద్, బాసర, వికారాబాద్, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని విజయవాడ, కర్నూలు సిటీ, నాందేడ్ డివిజన్ పరిధిలోని పర్లి వైద్యనాథ్ స్టేషన్లు ఈ ఘనతను సాధించాయి. నీరు–ఇంధన పొదుపు, సౌర విద్యుత్ వినియోగం, పచ్చదనం–పర్యావరణ పరిరక్షణ చర్యలు, వాడిన బాటిళ్ల క్రషింగ్, చెత్త తొలగింపు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వీటిని సర్టిఫికేషన్ కోసం గుర్తించారు.

## హీరో రాజశేఖర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!



**సాక్షి, హైదరాబాద్:** ప్రముఖ సినీ హీరో రాజశేఖర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దయింది. తెలంగాణ రవాణా శాఖ ఆయన డ్రైవింగ్ లైసెన్స్‌ను 6 నెలలపాటు రద్దు చేసింది. గత నెల 12వ తేదీన ఔటర్ రింగ్ రోడ్డు పెద్ద గోల్కొండ వద్ద ఆయన కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఆ సమయంలో రాజశేఖరే స్వయంగా కారు నడిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కొద్దిపాటి గాయాలతో ఆయన బయటపడగలిగారు. ఈ కేసులోనే రాజశేఖర్ డ్రైవింగ్ లైసెన్స్‌ను అధికారులు రద్దు చేసినట్లుగా సమాచారం. 2017 అక్టోబర్‌లోనూ పీవీ ఎక్స్‌ప్రెస్ హైవేపై ఓ కారును రాజశేఖర్ వాహనం ఢీకొట్టిన సంగతి తెలిసిందే. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాజశేఖర్ డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితి 2017 లోనే ముగిసింది. అయినా, ఆయన దాన్ని రెన్యువల్ చేసుకోలేదు. దీనికితోడు నిర్లక్ష్యంగా కారు నడుపుతూ వరుసగా ప్రమాదాలకు కారణమవుతుండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

## వాల్టా కమిటీలు ఏర్పాటు చేయండి

### కలెక్టర్లకు పీఆర్ కమిషనర్ రఘునందన్‌రావు లేఖ

**సాక్షి, హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన నీరు, భూమి, చెట్టు చట్టం (వాల్టా) కమిటీలను ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో వాల్టా కమిటీలను నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆ శాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు లేఖ రాశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ సారథ్యంలోని ఈ కమిటీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో నాయకత్వంలో, మండల స్థాయిలో తహసీల్దార్ సారథ్యంలో వాల్టా కమిటీలు పనిచేయనున్నాయి. ప్రకృతి వనరుల సంరక్షణలో ఈ కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి.

## ఎన్‌కౌంటర్‌పై పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



**సాక్షి, న్యూఢిల్లీ:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై కె.సజయ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం తోసిపుచ్చింది. పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని, మృతదేహాలు పాడవకుండా ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది బృందా గ్రోవర్ అభ్యర్థించగా.. ఎన్‌కౌంటర్‌పై ఇప్పటికే న్యాయ విచారణ కమిషన్‌ను నియమించామని ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. అయితే పిటిషనర్ అభ్యర్థన మేరకు హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛను ధర్మాసనం కల్పించింది.

## మహేశ్వర్‌రెడ్డిని ఎందుకు సస్పెండ్ చేశారు?: క్యాట్

**సాక్షి, హైదరాబాద్:** ఐపీఎస్ ట్రైనీ కేవీ మహేశ్వర్‌రెడ్డిని ఎందుకు సస్పెండ్ చేశారో బుధవారం తెలియజేయాలని కేంద్ర హోం శాఖను కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశించింది. తనను అన్యాయంగా సస్పెండ్ చేశారని పేర్కొంటూ మహేశ్వర్‌రెడ్డి క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ కేసును మంగళవారం క్యాట్ అడ్మినిస్ట్రేటివ్ మెంబర్ బీవీ సుధాకర్ విచారించి హోం శాఖకు నోటీసులు జారీ చేశారు. అఖిల భారత సర్వీస్ రూల్స్ (డీఅండ్ఏ)–1969 ప్రకారం సస్పెండ్ చేయడానికి వీల్లేదని, కేంద్రం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని మహేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. నిబంధనల ప్రకారం ఓ క్రిమినల్ కేసు పెండింగ్ ఉందని చెప్పి సర్వీస్ నుంచి సస్పెండ్ చేయడానికి వీల్లేదని, అలాంటి కేసుల్లో 48 గంటల పాటు రిమాండ్‌లో ఉన్నప్పుడు మాత్రమే సస్పెండ్ చేయొచ్చని చట్టంలో ఉందన్నారు. భువన అనే యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మహేశ్వర్‌రెడ్డి మోసం చేశారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఆయనను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.



మంగళవారం యాదాద్రి ఆలయం, పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



యాదాద్రి ఆలయంలో పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్ తదితరులు

# పనుల్లో తొందరొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సలహాలు, సూచనలు అందించారు. ''గర్భగుడి ఆకారం, ప్రాశస్త్యం చెక్కు చెదరకుండా నిర్మాణాలు సాగాలి. ఏమాత్రం తొందరపాటు అవసరం లేదు. జాగ్రత్త, నాణ్యత పాటించాలి. నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి. ప్రతిదీ నియమాలను అనుసరించి సాగాలి. ఇది సనాతన ఆలయం. ఇక్కడ పూజలు చేయడం చాలా మందికి వారసత్వంగా వస్తున్న సంప్రదాయం. దేశ, విదేశాల్లో స్వామికి భక్తులున్నారు. రాబోయే కాలంలో యాదాద్రికి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. భక్తులకు దైవ దర్శనం, వసతి సౌకర్యాలు, పుణ్యస్నానాలు, తలనీలాల సమర్పణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడమే లక్ష్యం కావాలి''అని సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### ఉద్యానవనాలు పెంచాలి...

ఆలయ ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా, ఆహ్లాదం పంచేలా ఉద్యానవనాలు పెంచాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో దేవాలయ ప్రాశస్త్యం, లక్ష్మీ నరసింహస్వామి చరిత్ర, స్థల పురాణం ప్రస్ఫుటించే విధంగా తైలవర్ణ చిత్రాలను వేయించాలని ఆదేశించారు. అనంతరం యాదాద్రిలో జరుగుతున్న రింగురోడ్డు పనులను పరిశీలించారు. సకల సౌకర్యాలతో కూడిన 15 వీవీఐపీ కాటేజీలతో నిర్మిస్తున్న ప్రెసిడెన్షియల్ సూట్‌ను పరిశీలించి కొన్ని మార్పులు సూచించారు. రాష్ట్రపతి, ప్రధాని లాంటివారు వచ్చినప్పుడు వారికి సౌకర్యవంతంగా ఉండేలా ప్రెసిడెన్షియల్ సూట్ ఉండాలన్నారు. బస్వాపురం రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా మారుస్తున్న విధంగా ప్రెసిడెన్షియల్ సూట్‌కు సమీపంలో ఉన్న మైలార్‌గూడెం, యాదగిరిపల్లి చెరువులను కూడా సుందరీకరించాలని సీఎం ఆదేశించారు. ప్రధాన దేవాలయం ఉండే గుట్ట నుంచి రింగ్‌రోడ్డు మధ్య భాగంలో గతంలో అనుకున్న ప్రకారం నిర్మాణాలన్నీ సాగాలన్నారు. కోనేరు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.



వీవీఐపీ కాటేజీల నమూనా

### స్వయంభూల దర్శనానికి ముహూర్తం పెట్టుకుందాం...

''అమెరికాలో పర్యటిస్తున్న శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి అక్కడి నుంచి రాగానే అందరం కూర్చొని స్వయంభూల దర్శనానికి ముహూర్తం పెట్టుకుందాం. లోకోత్తర స్థాయిలో మహాయాగం జరగాలని 3 వేల మంది యజ్ఞం చేసే వాళ్లు, 3 వేల మంది సహాయకులు, 3 వేల మంది ప్రచారకులను సిద్ధం చేస్తున్నాం. యాగానికి ప్రతిరోజూ 1.50 లక్షల నుంచి 2 లక్షల మందికిపైగా భక్తులు వస్తుంటారు కాబట్టి వారందరికీ వసతులు, భోజనాలు, ప్రసాదం ఏర్పాట్లు కల్పించాలి''అని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి ప్రాకారం బాగుందన్నారు. ఆలయ అభివృద్ధి పనులు వేగంగా, ఆగమ శాస్త్రప్రకారం జరుగుతున్నాయని కితాబిచ్చారు. ప్రధానాలయంలో ప్రహ్లాద ఘట్టాలు ఎక్కడ వస్తున్నాయి? గర్భాలయ ద్వారాలకు బంగారు తాపడం ఎప్పుడు జరుగుతుంది? అని స్తపతులను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 100 కల్యాణాలకుపైగా జరిపే విధంగా మండప నిర్మాణం, ప్రధాన ఆలయం రెండవ ప్రాకారంలో అద్దాల మండపం పూర్తి కావాలన్నారు. ''మరో 15 రోజుల్లో మళ్లీ వస్తా. చిన్న, పెద్ద పనులన్నీ పూర్తి కావాలి''అని సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఫిబ్రవరిలోగా పనులు పూర్తి కావా?

'ఆలయ నిర్మాణ పనులు ఒక డెడ్‌లైన్ పెట్టుకొని చేసేవి కావు' అంటూ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే నిర్మాణ పనులు ఫిబ్రవరిలోగా పూర్తయ్యేలా కనిపించడం లేదు. ప్రధాన ఆలయ పనులతోపాటు ప్రెసిడెన్షియల్ సూట్‌ల నిర్మాణం, ఆలయ పరిసర పనులు, రోడ్ల వెడల్పు, విస్తరణ పనులు, రింగ్‌రోడ్డు, గిరి ప్రదక్షిణ పనులు పురోగతిలో ఉన్నప్పటికీ క్యూలైన్లు, పార్కింగ్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వసతులు లేకుండా, నిర్మాణ పనులు పూర్తి కాకుండా భక్తులకు నృసింహుని స్వయంభూ దర్శనం కల్పిస్తే ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించే సీఎం పైవిధంగా వ్యాఖ్యలు చేసి ఉంటారని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### శిల్పులకు ప్రత్యేక అభినందనలు...

రాతి శిలలను అద్భుత కళాఖండాలుగా మలిచిన శిల్పులను సీఎం కేసీఆర్ అభినందించారు. ఆలయ ప్రాంగణమంతా దేవతామూర్తుల విగ్రహాలతో నిండే విధంగా రూపకల్పన చేశారని మెచ్చుకున్నారు. 560 మంది శిల్పులు నాలుగేళ్లుగా పడుతున్న కష్టం ఫలించి అద్భుత ఆకారాలతో కూడిన ప్రాకారాలు సిద్ధమయ్యాయని కేసీఆర్ పేర్కొన్నారు. వంద శాతం శిలలనే ఉపయోగించి ఆలయాన్ని తీర్చిదిద్దడం యాదాద్రిలోనే సాధ్యమైందన్నారు.



సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదిస్తున్న యాదాద్రి ఆలయ అర్చకులు



యాదాద్రిలో నిర్మించనున్న ప్రెసిడెన్షియల్ సూట్ నమూనా

### క్షుణ్ణంగా పనుల పరిశీలన

సీఎం కేసీఆర్ యాదాద్రి పర్యటన ఆరున్నర గంటలపాటు సాగింది. ఆలయంలో పూజల అనంతరం రెండు గంటలపాటు ప్రధానాలయ నిర్మాణ ప్రాంతంలో కేసీఆర్ కలియదిరిగారు. గోపురాలు, మాఢ వీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజ స్తంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాదం, వంటశాల, పుష్కరిణి, యాగశాల నిర్మాణాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. యాదాద్రి ప్రధానాలయంలో జరుగుతున్న నిర్మాణాలన్నీ ఆధ్యాత్మికత, ధార్మికత ఉట్టిపడేలా ఉన్నాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎంతో కలసి మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సంతోశ్ కుమార్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, ఎలిమినేటి కృష్ణారెడ్డి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, వివేకానంద, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, వైటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు, కలెక్టర్ అనితా రాంచంద్రన్, ఈఓ గీతారెడ్డి, ఆలయ నిర్మాణ శిల్పి ఆనంద్‌సాయి, స్తపతి ఆనందవేలు, ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, రవీందర్‌రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆలయ పనులను పరిశీలించారు.

# ఏపీలో 3 రాజధానులు!

- అసెంబ్లీలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూత్రప్రాయంగా వెల్లడి
- వారం పది రోజుల్లో నిపుణుల కమిటీ నివేదిక.. ఆ తర్వాత ఉత్తమ నిర్ణయం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రతి అడుగూ ఆలోచించి వేయాలని, ఇందులో భాగంగా మూడు రాజధానుల అవసరం ఉందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధాని (ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్), కర్నూలులో హైకోర్టు (జ్యుడీషియల్ క్యాపిటల్), అమరావతిలో చట్ట సభలు (లెజిస్లేటివ్ క్యాపిటల్) ఏర్పాటు చేయొచ్చన్నారు. ఈ దిశగా మనందరం ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజధానిపై ప్రతిష్టాత్మక సంస్థలతో వేసిన కమిటీ నివేదిక రాగానే ఈ అంశాలపై చర్చించి పిల్లల భవిష్యత్తు కోసం మంచి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాజధానిపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం ఈ మేరకు వివరించారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

### రాజధాని ముసుగులో అంతా అవినీతే..

'గత ఐదేళ్లలో జరిగిన కుంభకోణాలు, మోసాలు, కుట్రలను మంత్రులు, సభ్యులు వివరించారు. స్కామ్‌ల గురించి ఆర్థిక మంత్రి బుగ్గన స్లయిడ్స్ కూడా చూపించారు. 2014 జూన్ నుంచి డిసెంబర్ వరకు కేవలం ఆరు నెలల కాలంలో 4,070 ఎకరాలను అప్పటి పాలకుల బినామీలు, బంధువులు ఏ రకంగా తక్కువ రేటుకు కొన్నారు? ఎవరెవరు కొన్నారు? అనే అంశాలను పేర్లతో సహా ప్రదర్శించారు. రాజధాని పేరుతో జరిగిన స్కామ్‌లు, అన్యాయాలు, చట్టాల ఉల్లంఘనలను సభ్యులు ధర్మాన, గుడివాడ అమర్నాథ్, మంత్రులు బొత్స, బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు ఆధారాలతో సహా వివరించారు. చంద్రబాబు.. రాజధాని అని ఒక ప్రాంతాన్ని ఎంపిక చేశారు. అక్కడ ముందుగానే బినామీ పేర్లతో తక్కువ ధరతో భూములు కొన్నారు. తర్వాత అక్కడ రాజధాని అని ప్రకటించారు. ఆ తర్వాత ఆ భూముల రేట్లు పెంచుకునేందుకు ఏం చేశారో కూడా సభ్యులు వివరించారు.

### రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి తేవాలి?

రాజధానిలో కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో కనీస మౌలిక సదుపాయాలకు రూ.1.06 లక్షల కోట్లు అవుతుందన్నది బాబు లెక్క. ఇలా నిర్మిస్తూ పోతే వడ్డీతో కలిపి ఇది రూ.3 లక్షల కోట్లో.. 4 లక్షల కోట్లో ఖర్చయ్యే పరిస్థితి ఉంది. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఐదేళ్లలో రూ.5,800 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఇందులో రాజధాని బాండ్ల పేరుతో 10.35 శాతం వడ్డీకి కూడా అప్పు తెచ్చారు. ఈ అప్పులకు ఏటా రూ.700 కోట్లు వడ్డీ చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు ఇన్నిన్ని వేల కోట్లు కావాలని లెక్కలున్నాయి. పలు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిలో రాజధాని నిర్మాణం కోసం అంటూ లక్ష కోట్ల రూపాయలకు పైగా ఎక్కడి నుంచి తేవాలి? ఈ పరిస్థితిలో రాజధానిలో కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో రోడ్లు, కరెంటు లాంటి పనుల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టడం అవసరమా?

### సాగు, తాగునీరు అందించడం ముఖ్యం కదా?

'బొల్లాపల్లిలో రిజర్వాయర్ కట్టి.. తద్వారా రాయలసీమలోని బనకచర్లకు గోదావరి నీటిని తెచ్చే భారీ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రూ.55 వేల నుంచి రూ.60 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనాతో ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. ఈ ఏడాది భారీ వర్షాలు పడ్డా, వరదలు వచ్చినా రాయలసీమలో ప్రాజెక్టులు నిండలేదు. నీరు తీసుకెళ్లే కాలువల సామర్థ్యం సరిపోవడం లేదు. సహాయ పునరావాస ప్యాకేజీలు అమలు చేయలేదు. రాయలసీమలో ప్రాజెక్టుల కోసం రూ.23 వేల కోట్లు కావాలి. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీరివ్వాలి. రాష్ట్రంలో తాగడానికి స్వచ్ఛమైన మంచినీరు లేని పరిస్థితి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా పరిశ్రమ వల్ల నీరు కలుషితమైంది. పోలవరం, ధవళేశ్వరం నుంచి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి, ప్రతి ఊరికి పైప్‌లైన్లు వేసి.. తాగు నీటిని తీసుకు రావాలంటే.. ఉభయ గోదావరి జిల్లాలకు రూ.8 వేల కోట్లు కావాలి. ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా తాగు నీటి కోసం రూ.40 వేల కోట్లు కావాలి.

### స్కూళ్లు, ఆసుపత్రుల మాటేంటి?

మరోవైపు నాడు–నేడు కార్యక్రమం కింద శిథిలావస్థలో ఉన్న స్కూళ్లు, ఆసుపత్రులు అభివృద్ధి చేస్తున్నాం. స్కూళ్లలో నీళ్లు, కరెంటు, ఫ్యాన్లు, ఫర్నీచర్ తదితర కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆసుపత్రుల్లో సెల్‌ఫోన్ల లైట్లలో ఆపరేషన్లు చేస్తున్నారు. ఎలుకలు కొరికి పిల్లలు చనిపోయిన దుస్థితి. ఈ పరిస్థితిలో స్కూళ్ల బాగు కోసం రూ.14 వేల కోట్లు, ఆస్పత్రుల బాగు కోసం రూ.16 వేల కోట్లు కలిపి 'నాడు – నేడు'కు రూ.30 వేల కోట్లు కావాలి. ఇన్ని కార్యక్రమాలకు మన దగ్గర డబ్బులున్నాయా? ఇవన్నీ కాదని రాజధాని కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయగలమా అని ఆలోచించాలి.

### ప్రతి అడుగూ ఆలోచించి వేయాలి

ఈ పరిస్థితుల్లో వేసే ప్రతి అడుగూ ఆలోచించి, ఆచితూచి వేయాల్సిన అవసరం ఉంది. దక్షిణాఫ్రికాకు మూడు రాజధానులు ఉన్నాయి. మనమూ మారాలి. సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు చెప్పినట్టు వికేంద్రీకరణ అనేది ఉత్తమ నిర్ణయం. ఆంధ్రప్రదేశ్కు బహుశా మూడు కేపిటల్స్ వస్తాయేమో. ఇలా రావాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి ఆలోచనలు చేయడానికే పేరెన్నికగన్న నిపుణులతో, ప్రఖ్యాతి గాంచిన బీసీజీతో పాటు మరో కన్సల్టెన్సీని నియమించాం. ఈ సంస్థలు సుదీర్ఘంగా అన్ని విధాలా పరిశీలించి, పరిశోధించి వారం పది రోజుల్లో నివేదిక ఇవ్వనున్నాయి. అధికార వికేంద్రీకరణ దిశగా పలు సూచనలు, సలహాలు చేయనున్నాయి. నివేదిక ఫలానా విధంగా ఉండాలని మేమైతే చెప్పలేదు. ఈ నివేదికలు రాగానే పరిశీలించి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు కోసం మంచి నిర్ణయం తీసుకోవాలి. నేను ఈ అంశంలో స్పష్టత ఇచ్చినట్లే భావిస్తున్నా. ఇంత కంటే మంచి సలహా ఉంటే.. ఇస్తే తప్పకుండా తీసుకుంటాం'అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

# 'మార్గదర్శి' కేసులో హైకోర్టు తీర్పుపై అప్పీల్

- సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి స్పెషల్ లీవ్ పిటిషన్
- రెండు రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేయాలని విజ్ఞప్తి

**సాక్షి, న్యూఢిల్లీ:** మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. తమపై ఉన్న క్రిమినల్ కంప్లయింట్ (సీసీ) నెంబర్ 540ని కొట్టివేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ క్వాష్ పిటిషన్ దాఖలు చేసిందని, దీనిని ఉమ్మడి హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం విచారించి సీసీ 540ని కొట్టివేసిందని పిటిషన్‌లో వివరించారు. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్టు పేర్కొన్నారు. అలాగే ఈ కేసులో అప్పీలు చేసేందుకు తనకు అనుమతి ఇవ్వాలని ఒక అప్లికేషన్ దాఖలు చేయడంతోపాటు హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఆయన స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. ఉమ్మడి హైకోర్టు విభజనకు ఒకరోజు ముందు 2018 డిసెంబరు 31న ఈ తీర్పు వెలువడిందని పిటిషన్‌లో పేర్కొన్న ఉండవల్లి.. ఈ కేసులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను భాగస్వాములను చేయాలని మరో అప్లికేషన్ దాఖలు చేశారు. అవిభక్త హిందూ కుటుంబ సంస్థ(హెచ్‌యూఎఫ్) అయిన మార్గదర్శి ఫైనాన్షియర్స్.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం–1934లోని సెక్షన్ 45(ఎస్) నిబంధనను ఉల్లంఘించి డిపాజిట్లు వసూలు చేయగా, ఉమ్మడి హైకోర్టు ఈ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)ను తప్పుగా అన్వయించిందని, 'అసోసియేషన్ ఆఫ్ ఇండివిడ్యువల్స్'పరిధిలోకి హెచ్‌యూఎఫ్ రాదని, ఈ నేపథ్యంలో సెక్షన్ 45ఎస్(2) పరిధిలోకి తేవొద్దని చెబుతూ క్రిమినల్ కంప్లయింట్‌ను కొట్టేసిందని పిటిషన్‌లో వివరించారు. అయితే అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2006 నవంబర్‌లో రాసిన లేఖకు 2007 జూన్ 2న ఆర్‌బీఐ బదులిస్తూ.. ప్రతివాది చాప్టర్ 3బి కింద అర్హత కలిగి లేదని, సెక్షన్ 45ఎస్ కింద లావాదేవీలు జరిపేందుకు వీలులేదని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పైగా సంబంధిత అంశాలపై సుప్రీంకోర్టులో సివిల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగా.. క్రిమినల్ కంప్లయింట్‌ను కొట్టివేయడంతో ఆ అప్పీళ్లన్నీ ఫలితం లేనివిగా మారిపోయాయని నివేదించారు.

### ఇదీ నేపథ్యం..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం–1934లోని సెక్షన్ 45(ఎస్) నిబంధనను ఉల్లంఘించి, దాదాపు రూ.2300 కోట్ల మేర డిపాజిట్లను సేకరించిందన్న అభియోగంపై ఇదే చట్టంలోని సెక్షన్ 45(టి), సెక్షన్ 58(ఇ) ఆధారంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చర్యలు తీసుకునేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2006 డిసెంబర్ 19న ఉత్తర్వులు వెలువరించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ తాను సేకరించిన డిపాజిట్ల మొత్తంలో సగం విలువ మేరకు నష్టాలను కలిగి ఉందని వచ్చిన వార్తల నేపథ్యంలో డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా ఈ వ్యవహారాన్ని పరిశీలించేందుకు అప్పటి ఆర్థిక శాఖ సలహాదారు ఎన్.రంగాచారిని నియమిస్తూ జీవో నెంబర్ 800 జారీచేసింది. అలాగే ఈ సంస్థపై ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(టి), సెక్షన్ 58(ఇ) కింద చర్యలు తీసుకునేందుకు వీలుగా న్యాయస్థానంలో కేసు ఫైల్ చేసేందుకు అప్పటి సీఐడీ ఐజీ కృష్ణరాజును జీవో నెంబర్ 801 ద్వారా అధీకృత అధికారిగా నియమించింది. ఎన్.రంగాచారి ఇచ్చిన నివేదిక ఆధారంగా కృష్ణరాజు 23 జనవరి 2008న ఫస్ట్ అడిషనల్ చీఫ్ మెట్రొపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సీసీ నెంబర్ 540 దాఖలు చేశారు. దీనిపై విచారణ నిలిపివేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్ పిటిషన్ దాఖలు చేసింది. 2010లో ఈ పిటిషన్‌ను ఆ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులను పక్కనపెట్టాలని కోరుతూ తిరిగి 2011లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం సీసీ నెంబర్ 540లో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై స్టే ఇచ్చింది. అయితే ఏ కేసులోనైనా స్టే ఉత్తర్వులు ఆ రోజు నుంచి ఆరు నెలల తరువాత రద్దవుతాయని సుప్రీం కోర్టు 2018 మార్చి 28న తీర్పు వెలువరించింది. విచారణ కొనసాగించడం కంటే స్టే పొడిగించడమే అవశ్యమనుకున్న కేసుల్లో స్టే కొనసాగింపునకు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఈ నేపథ్యంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ స్టే పొడిగించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ స్టే పొడిగించేందుకు ధర్మాసనం నిరాకరించింది. దీంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ హైకోర్టును ఆశ్రయించింది. 2011లో తాము దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌ను విచారించాలని అభ్యర్థించింది. దీనిని విచారించిన ఉమ్మడి హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉన్న క్రిమినల్ సీసీ నెంబర్ 540ని కొట్టివేసింది. దీనిపై ఉండవల్లి అరుణ్‌కుమార్ తరఫున న్యాయవాది అల్లంకి రమేశ్ ఇప్పుడు సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేశారు.

# ఉపాధి కల్పనలో తెలంగాణ టాప్



**87.38 శాతం పనుల ప్రగతితో రాష్ట్రం ముందంజ**

- 9.85 కోట్ల పని దినాలు పూర్తి
- మరో రెండుకోట్ల పనిదినాలకు అనుమతించిన కేంద్రం

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రం ముందంజలో నిలుస్తోంది. కూలీలకు పనికల్పనతో పాటు ఉపాధి హామీ పథకం నిర్వహణలో మంచి ప్రదర్శనను కనబరుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు పదికోట్ల పనిదినాలను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అందులో ఇప్పటికే 9.85 కోట్ల పనిదినాలను పూర్తిచేసింది. ఈ ఏడాది కేటాయించిన పనుల లక్ష్యాలను చేరుకుంటుండడంతో పాటు పనుల కల్పనలో పురోగతిని అంచనా వేసి, దాదాపు రెండు నెలల క్రితమే మరో రెండుకోట్ల పని దినాలని అదనంగా కల్పించాలని కేంద్రాన్ని కోరింది. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం ఈమేరకు రాష్ట్రానికి మరో రెండుకోట్ల పనిదినాలకు అదనంగా అనుమతినిచ్చింది.

### 14 రాష్ట్రాలు 50 శాతం లోపే...

ప్రస్తుతం దేశంలోని 14 రాష్ట్రాలు ఉపాధి పనుల కల్పనలో కేవలం 50 శాతం లోపే లక్ష్యాలను చేరుకోగా, 9.85 కోట్ల పని దినాలతో 87.38 శాతం ప్రగతితో తెలంగాణ ముందు వరుసలో నిలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటిదాకా 23.61 లక్షల కుటుంబాల్లోని 38.97 లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించారు. రోజుకు రూ. 150 చొప్పున ఒక్కో కూలీకి సగటున వేతనం అందింది. ఇప్పటి వరకు రోజువారీ వేతనాలుగా కూలీలకు రూ. 1,477 కోట్ల మేర వారి ఖాతాల్లో డిపాజిట్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 1.20 లక్షల మంది వందరోజుల పనిదినాలు పూర్తిచేసుకున్నారు. ఉపాధి పనుల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, నీటి సంరక్షణ పనులు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. ఇందులో తెలంగాణకు హరితహారంతో పాటు భూ అభివృద్ధి, స్వచ్ఛ తెలంగాణ వంటి కార్యక్రమాలకు సంబంధించిన పనులు కూడా చేపడుతున్నారు.

### జిల్లాల వారీగా చూస్తే...

జిల్లాల వారీగా ఉపాధి హామీ పనుల పురోగతిని పరిశీలిస్తే జోగుళాంబ గద్వాల జిల్లా 77 శాతంతో అట్టడుగున నిలిచింది. మిగతా జిల్లాలన్నీ కూడా మంచి ప్రదర్శన కనబరిచాయి. నిర్మల్ జిల్లా 92 శాతంతో, ఆదిలాబాద్ జిల్లా 90 శాతంతో అగ్రభాగాన నిలిచాయి. మిగతా 29 జిల్లాలు సగటున 85 నుంచి 89 శాతంతో పనుల్లో పురోగతిని సాధించాయి. కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలు 89 శాతం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, వరంగల్ అర్బన్, సూర్యాపేట, నల్లగొండ, మెదక్ జిల్లాలు 88 శాతం సాధించాయి. మిగతా జిల్లాలు 85 నుంచి 87 శాతం వరకు పురోగతిని సాధించాయి.

# కొత్త వార్డులొచ్చేశాయి!

- డివిజన్లు/వార్డుల విభజన తుది ప్రకటన విడుదల
- 10 కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు కొత్త రూపం
- త్వరలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రకటన.. ఆ వెంటనే రిజర్వేషన్ల ప్రక్రియకు శ్రీకారం

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన ఓ కీలక ఘట్టం ముగిసింది. ఎన్నికలు జరగనున్న 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డులు/డివిజన్ల పునర్విభజనకు సంబంధించిన తుది ప్రకటనను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ మంగళవారం పురపాలికల వారీగా వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం.. వార్డుల విభజన కోసం ఈ నెల 3న 14 రోజుల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం వార్డులు/డివిజన్ల పునర్విభజన ముసాయిదాను ప్రకటించి, వారం రోజుల పాటు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించింది. వీటిని పరిష్కరించడం ద్వారా మంగళవారం వార్డులు/డివిజన్ల పునర్విభజన తుది ప్రకటనను జారీ చేసింది. కొత్త వార్డులు/డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాను రెండుమూడు రోజుల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశముంది. కొత్త వార్డులు/డివిజన్ల భౌగోళిక స్వరూపం, సరిహద్దులను దృష్టిలో పెట్టుకుని వీటికి సంబంధించిన ఓటర్ల జాబితాను తయారు చేయనున్నారు. ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత వార్డులు/డివిజన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ జనాభా గణనను చేపట్టనున్నారు. దీనికి దాదాపు వారం రోజుల సమయం పట్టనుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

### జనాభా దామాషా ప్రకారం...

అన్ని మున్సిపాలిటీల్లోని ఎస్సీ, ఎస్టీల జనాభా దామాషా ప్రకారం వార్డు, చైర్‌పర్సన్ స్థానాలను కేటాయిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. కార్పొరేషన్లలో సైతం ఇలానే ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తుండగా, ఎస్సీ, ఎస్టీల కోటా పోగా మిగిలిన స్థానాలను బీసీలకు రిజర్వు చేయనున్నారు. వార్డు/డివిజన్ స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటిస్తూ స్థానిక జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. చైర్‌పర్సన్, మేయర్ స్థానాల రిజర్వేషన్లను మాత్రం పురపాలికల వారీగా ప్రభుత్వం ప్రకటించనుంది. రిజర్వేషన్లను ప్రకటించిన వెంటనే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేయనుంది. ఈ ప్రక్రియలన్నీ సజావుగా జరిగితే జనవరి చివరి వారంలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఏవైనా అడ్డంకులొస్తే ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్నాయి. కొత్త మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సాధారణ మున్సిపల్ ఎన్నికలు కావడంతో కొత్త రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్ఓఆర్)ను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అమలు చేసిన రోస్టర్‌ను ఈ ఎన్నికల్లో కొనసాగించరు. రోస్టర్‌ను ఒకటో పాయింట్ నుంచి ప్రారంభించనున్నారు. ఈ ఎన్నికల్లో ఖరారు చేసే రిజర్వేషన్లను మరో రెండు సాధారణ ఎన్నికల వరకు కొనసాగించనున్నారు.

## 22న రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి విందు

**సాక్షి, హైదరాబాద్:** శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రానున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు ఈ నెల 22వ తేదీ రాత్రి 7.30 గంటలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ విందు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొబైల్ యాప్‌ను రాష్ట్రపతి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. గవర్నర్‌గా తమిళిసై బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రపతి తొలి పర్యటన కావడంతో విందు ఏర్పాట్లపై మంగళవారం గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్ అధికారులతో సమీక్ష జరిపారు. భద్రత ఏర్పాట్లతో పాటు ఆతిథ్యానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, ప్రొటోకాల్ అదనపు కార్యదర్శి అర్విందర్‌సింగ్, జాయింట్ సెక్రటరీ జె.భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ప్రొఫెసర్లకు యూజీసీ పే స్కేళ్లతో పెన్షన్

**సాక్షి, హైదరాబాద్:** రిటైర్డ్ ప్రొఫెసర్లకు యూజీసీ వేతనాలను వర్తింపజేస్తూ పెన్షన్ ఇచ్చేందుకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేసేలా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించిన ఫైలుపై ఇటీవల సీఎం కేసీఆర్ సంతకం చేశారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. దీంతో రాష్ట్రంలోని దాదాపు 6 వేల మంది రిటైర్డ్ ప్రొఫెసర్లకు ప్రయోజనం చేకూరనుంది.

## ఎఫ్‌బీవో పోస్టులకు మరో 10 మంది ఎంపిక

**సాక్షి, హైదరాబాద్:** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా వరంగల్ డివిజన్ ఏజెన్సీ ప్రాంత స్థానికతకు సంబంధించిన క్లియరెన్స్ జిల్లా కలెక్టర్ నుంచి రావడంతో మరో 10 మందిని ఆయా పోస్టులకు ఎంపిక చేసినట్లు టీఎస్‌పీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొంది. మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని వెల్లడించింది.

## ఏబీహెచ్‌ఎం ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల శ్రీనివాస్

**సాక్షి, హైదరాబాద్:** అఖిల భారత హిందూ మహాసభ (ఏబీహెచ్‌ఎం) ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడు కమలేష్ మహారాజ్ ఓ ప్రకటనలో తెలిపారు.

# పంచాయతీ ట్రాక్టర్లకు ప్రభుత్వ పూచీకత్తు



**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పెద్దూర్ తండాలో 500 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామ పంచాయతీకి రాబడి అంతంతమాత్రమే. ప్రభుత్వం విడుదల చేసే 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర సంఘం నిధులు తప్ప మరో మార్గం లేదు. దీంతో ప్రతి జీపీ సొంతంగా ఒక ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ను సమకూర్చుకోవాలనే ప్రభుత్వ నిబంధన గుదిబండగా మారింది. స్వీయ నిధుల్లేక అల్లాడుతున్న ఈ పంచాయతీ ట్రాక్టర్ కొనుగోలు చేయలేక చేతులెత్తేసింది. ఇది కేవలం ఒక తండా ఉదాహరణ మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా సొంత వనరుల్లేక ఇబ్బందులు పడుతున్న పల్లెలెన్నో ఉన్నాయి. ఒకవేళ పంచాయతీ ఖాతాలో డబ్బులు నిండుకుంటే బ్యాంకు రుణాలతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అన్ని పత్రాలు సవ్యంగా ఉంటేనే రుణమివ్వడానికి సవాలక్ష కొర్రీలు పెట్టే బ్యాంకులు.. పంచాయతీల ట్రాక్టర్లకు లోన్లు ఇవ్వలేమని తేల్చిచెప్పాయి. ప్రభుత్వం పూచీకత్తు ఇస్తే ఆర్థిక సాయం చేస్తామని షరతులు విధించాయి. నిధుల్లేక ట్రాక్టర్లు కొనకపోవడం, క్షేత్రస్థాయిలో బ్యాంకర్ల మడతపేచీలను తెలుసుకున్న ప్రభుత్వం.. గ్రామ పంచాయతీలు కొనే ట్రాక్టర్లకు గ్యారంటీగా ఉండేందుకు ముందుకొచ్చింది. నెలవారీగా చెల్లించే వాయిదాలను పంచాయతీల ఖాతా నుంచి కట్టేందుకు అంగీకరించింది. ప్రభుత్వం వివిధ పద్దుల కింద విడుదల చేసే నిధుల్లో తొలి ప్రాధాన్యం ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించేందుకేనని స్పష్టం చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులకు లేఖ రాసింది. ట్రాక్టర్‌తోపాటు చెత్త తరలింపునకు ట్రాలీ, మొక్కలకు నీళ్లుపోసేందుకు ట్యాంకర్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.




# ఇంటర్‌లో సివిక్స్ సబ్జెక్ట్ పేరెందుకు మార్చారు?

## ప్రభుత్వం, ఇంటర్ బోర్డుకు హైకోర్టు నోటీసులు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ కోర్సు కోసం సవరించిన సిలబస్‌లో 'సివిక్స్'సబ్జెక్ట్ పేరును 'పొలిటికల్ సైన్స్'గా మార్పు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎందుకు ఈ విధంగా మార్పు చేస్తున్నారో తెలియజేయాలని, పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు. ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ యాక్ట్–1971 ప్రకారం సివిక్స్ సబ్జెక్ట్ ప్రవేశపెట్టడం జరిగిందని, దేశవ్యాప్తంగా ప్లస్ టు స్థాయి విద్యలో సివిక్స్ బోధన జరుగుతోందని, ఎలాంటి అధికారాలు లేకపోయినా ఇంటర్ బోర్డు కార్యదర్శి సివిక్స్ సబ్జెక్ట్ పేరు మార్పు చేయడం చెల్లదని పేర్కొంటూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్కాలర్స్ అసోసియేషన్ రిట్ దాఖలు చేసింది. సివిక్స్ సబ్జెక్ట్‌కు పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ల్లో పీజీ చేసిన వారు అధ్యాపకులుగా ఉంటారని, అత్యధికంగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (పీఏ) చేసిన వారే ఉంటారని, ఇప్పుడు పేరు మార్పు కారణంగా పీఏ వారికి తీరని అన్యాయం జరగనుందని పిటిషనర్ న్యాయవాది బూర రమేశ్ వాదించారు. ఇంటర్ ఫస్టియర్‌లో పొలిటికల్ సైన్స్, సెకండియర్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యాబోధన జరుగుతోందని వివరించారు. అయితే, ఢిల్లీలోని ఒక విశ్వవిద్యాలయంలో సివిక్స్ చదివిన విద్యార్థికి బీఏ పొలిటికల్ సైన్స్ సీటు రాలేదని చెప్పి ఇంటర్ బోర్డు సెక్రటరీ ఇలా ఏకపక్షంగా పేరు మార్పు చేశారని తెలిపారు. ఉన్నత విద్యా చైర్మన్, పాఠశాల విద్యా డైరెక్టర్, వివిధ వర్సిటీల ప్రతినిధులతో కూడిన స్టాండింగ్ కమిటీ అధ్యయనం చేసిన తర్వాతే మార్పు చేయాలని చట్టంలో ఉందని, ఇంటర్ బోర్డు సెక్రటరీకి ఎలాంటి అధికారం లేదని రిట్‌లో పేర్కొన్నారు. ఈ మార్పు వల్ల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ, పీహెచ్‌డీలు చేసిన వారికి భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. వాదనల అనంతరం ప్రతివాదులైన ఉన్నత విద్య శాఖ ముఖ్య కార్యదర్శి/చైర్మన్, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్, ఇంటర్ బోర్డు కార్యదర్శులకు హైకోర్టు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.






# ఉద్యోగుల లెక్క చెప్పండి

### ఆన్‌లైన్‌లో వివరాల సేకరణ

**సాక్షి, హైదరాబాద్:** రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ తయారీలో భాగంగా రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపాలని అన్ని ప్రభుత్వ విభాగాధిపతులను ఆర్థిక శాఖ కోరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా బడ్జెట్ తయారీ కోసం ఉద్యోగుల వివరాలు తీసుకోవడం సాధారణమే అయినా ఈసారి మరింత వివరణాత్మకంగా ఇవ్వాలని పేర్కొన్నారు. కేడర్ స్ట్రెంగ్త్‌కు అనుగుణంగా ఆర్థిక శాఖ (హెచ్ఆర్ఎం) నిర్ధారించిన ఉద్యోగుల వివరాలకు సంబంధించిన నంబర్ స్టేట్‌మెంట్లను ఆన్‌లైన్‌లో ఈ నెల 20కల్లా నిర్దేశిత ఫార్మాట్‌లో పంపాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ల ద్వారా జీతాలు తీసుకుంటున్న వారి వివరాలు, హోంగార్డులు, అంగన్‌వాడీలు, వీఆర్ఏలు, దినసరి వేతన ఉద్యోగులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, కంటింజెంట్ ఉద్యోగుల వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో పక్కాగా పొందుపరచాలని సూచించారు. ముఖ్యంగా 2020–21 సంవత్సరంలో కొత్తగా ప్రభుత్వ సర్వీసుల్లో చేరే ఉద్యోగుల లెక్కల అంచనాలను కూడా తయారుచేసి పంపాలని ఆయా శాఖల విభాగాధిపతులను కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా పంపాలని, ఇందుకు అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులను కూడా ఆన్‌లైన్‌లో జతపర్చాలని సూచించారు.

# సీఐటీయూ కొత్త కార్యవర్గం

**హైదరాబాద్:** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) తెలంగాణ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర మహాసభలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రా ష్ట్ర కౌన్సిల్‌లో ఉన్న 161 మంది సభ్యులు ఎన్నుకున్న ఈ కొత్త కార్యవర్గం మూడేళ్ల పాటు పని చేయనుంది. నూతన అధ్యక్షుడిగా చుక్కా రాములు, ఉపాధ్యక్షులుగా పి.రాజారావు, ఎస్.వీరయ్య, ఆర్.సుధాభాస్కర్, పి.జయలక్ష్మి, జె.మల్లికార్జున్, వీఎస్ రావు, వీరారెడ్డి, కే వెంకటేశ్వర్‌రావు, ఎం.పద్మశ్రీ, ఆర్.కోటంరాజు, ఎం.నర్సింహారావులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.సాయిబాబు, కార్యదర్శులుగా పాలడుగు భాస్కర్, భూపాల్, వెంకటేశ్ రమా, మధు, ముత్యంరావు, యాదానాయక్, మల్లేశ్, చంద్రశేఖర్, త్రివేణి, కోఆప్షన్, కోశాధికారిగా వంగూరు రాములును ఎన్నుకున్నారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా రాష్ట్ర కార్యదర్శిగా జె.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

# 'మాజీ సైనికుల సమస్యలపై జిల్లాకో నోడల్ అధికారి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో పాటు ఈ విషయంలో జిల్లాకో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించనున్నట్టు డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ కమిటీ నాలుగో వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమానికి ఉన్న పథకాల అమలుతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు డీజీపీ జితేందర్, అదనపు కార్యదర్శి చందూలాల్, సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ కల్నల్ రమేశ్ కుమార్, కెప్టెన్ శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, నాయబ్ సుకేదార్, పోచయ్య, సార్జెంట్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సీసీఎంబీ శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ పద్ధతులపై హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శిక్షణ ఇవ్వనుంది. యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా తాము ఈ శిక్షణ అందిస్తున్నామని, 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు దీనికి అర్హులని సీసీఎంబీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 31 నుంచి జనవరి 13 వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు సీసీఎంబీ శాస్త్రవేత్తలతో కలసి పనిచేస్తారని, పరిశోధన తదితర అంశాలను తెలుసుకుంటారని పేర్కొంది. డిసెంబర్ 26న జరిగే ఓ ప్రవేశ పరీక్ష ద్వారా 20–25 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని, హైదరాబాద్‌లోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపింది. పరీక్ష సందర్భంగానే ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ వీఎం తివారీ నీటి యాజమాన్య పద్ధతులపై ప్రసంగిస్తారని వెల్లడించింది. వివరాలకు http:// e-portal.ccmb.res.in/ccmb-yip/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపింది.

# మన మహిళలే టాప్

- ఉద్యోగార్హ నైపుణ్యాలున్న వారిలో తెలంగాణ మహిళలదే అగ్రస్థానం
- ప్రతిభావంతులైన మహిళలు ఎక్కువున్న నగరాల్లో హైదరాబాద్‌కు తొలిస్థానం
- ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆరోస్థానంలో తెలంగాణ
- ఇండియా స్కిల్ రిపోర్టు–2020లో వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ...కొత్త రాష్ట్రం మరో సరికొత్త రికార్డుకు వేదికైంది. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలున్న మహిళలకు తెలంగాణ నెలవుగా మారింది. ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలున్నవారిలో మహిళలు, పురుషులను కలుపుకుని చూస్తే తెలంగాణ ఆరో స్థానంలో ఉన్నప్పటికీ మహిళల పరంగా మాత్రం మొదటిస్థానంలో నిలిచింది. ఈమేరకు ఇండియా స్కిల్ రిపోర్టు –2020 నివేదిక వెల్లడించింది. 2019 జూలై నుంచి నవంబర్ వరకు నేషనల్ ఎంప్లాయబిలిటీ టెస్టు సర్వేను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో 'ది వీ బాక్స్'ని ర్వహించింది. ఈ సర్వేలో భాగంగా దేశంలోని 28 రాష్ట్రాలు, 9 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 3 లక్షల మంది విద్యార్థులను, వివిధ రంగాలకు చెందిన 150 కంపెనీలను కలిసి సర్వే చేసింది. ఆ సర్వే నివేదికలోని ప్రధానాంశాలు.

**పెరిగిన మహిళల సంఖ్య..**

- ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలున్న మహిళల సంఖ్య ఈసారి పెరిగింది. 2018లో నైపుణ్యాలు కలిగిన మహిళల సంఖ్య 46%ఉంటే 2019లో 47 శాతానికి పెరిగింది.
- ఉద్యోగ నైపుణ్యాలున్న మహిళలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. రాజస్తాన్ రెండో స్థానంలో నిలిచింది.
- నగరాల పరంగా చూస్తే ఉద్యోగ నైపుణ్యాలున్న మహిళలు ఎక్కువగా ఉన్న నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది.

**తగ్గిన పురుషుల సంఖ్య..**

- ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన పురుషుల సంఖ్య 2018 సంవత్సరంలో 48% ఉంటే 2019లో 46 శాతానికి తగ్గిపోయింది.
- ఉద్యోగ నైపుణ్యాలున్న పురుషులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఢిల్లీ మొదటి స్థానంలో ఉండగా, పంజాబ్ రెండో స్థానంలో ఉంది. తెలంగాణ పదో స్థానానికి పరిమితమైంది.
- నగరాల పరంగా చూస్తే ముంబై మొదటి స్థానంలో ఉండగా, ఘజియాబాద్ రెండో స్థానంలో, హైదరాబాద్ మూడో స్థానంలో ఉంది.

సంవత్సరాల వారీగా యువతలో ఉద్యోగానికి కావల్సిన నైపుణ్యాలు కలిగినవారు




**మొత్తంగా చూస్తే రెండోస్థానంలో హైదరాబాద్..**

ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు కలిగినవారు ఎక్కువ మంది (స్త్రీ, పురుషులు) ఉన్న నగరాల్లో మొదటి స్థానంలో ముంబై నిలువగా, రెండో స్థానంలో హైదరాబాద్ నిలిచింది. ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన వారు ముంబైలో 70.27 శాతం మంది ఉంటే హైదరాబాద్‌లో 66.52% ఉన్నట్లు తేలింది. 63.20%తో పుణే మూడో స్థానంలో ఉండగా, 62.86%తో ఢిల్లీ నాలుగో స్థానంలో ఉంది. 54.83%తో బెంగళూరు ఐదో స్థానంలో, 49.31%తో చెన్నై ఆరోస్థానంలో, 48.90%తో మంగళూరు ఏడో స్థానంలో, 46.09%తో విశాఖపట్నం 8వ స్థానంలో, 40%తో లక్నో 9వ స్థానంలో, 33.79%తో కోయంబత్తూర్ పదో స్థానంలో నిలిచింది.

**రాష్ట్రాల్లో మొదటి స్థానంలో మహారాష్ట్ర..**

ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు కలిగిన యువతను (స్త్రీ, పురుషులు) అందించడంలో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలిచింది. అక్కడ 67.99 శాతం మంది ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారు. తమిళనాడు 62.97 శాతం మందితో రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్ 61.78%తో మూడో స్థానంలో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ 53.56%తో నాలుగో స్థానంలో, కర్ణాటక 52.83%తో ఐదో స్థానంలో, తెలంగాణ 50.39%తో ఆరో స్థానంలో నిలిచాయి. ఆ తరువాత స్థానాల్లో వరుసగా ఢిల్లీ (49.99%), రాజస్తాన్ (38.09%), పశ్చిమ బెంగాల్ (37.30%), గుజరాత్ (30.39%) ఉన్నాయి.

**యువతలో తగ్గిన ఉద్యోగ నైపుణ్యాలు..**

ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు కలిగిన యువత సంఖ్య దేశంలో ఈసారి తగ్గింది. ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలున్న వారు 2018 లో 47.38% ఉంటే, 2019లో వారి సంఖ్య 46.21 శాతానికి పడిపోయింది.

**ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన ఎక్కువ మహిళలున్న రాష్ట్రాలు**

| స్థానం | రాష్ట్రం |
|---|---|
| 1 | తెలంగాణ |
| 2 | రాజస్తాన్ |
| 3 | ఢిల్లీ |
| 4 | కర్ణాటక |
| 5 | ఆంధ్రప్రదేశ్ |
| 6 | ఉత్తరప్రదేశ్ |
| 7 | మహారాష్ట్ర |
| 8 | తమిళనాడు |
| 9 | పశ్చిమ బెంగాల్ |
| 10 | గుజరాత్ |

**ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన ఎక్కువ మహిళలున్న పట్టణాలు**

| స్థానం | నగరం |
|---|---|
| 1 | హైదరాబాద్ |
| 2 | విశాఖపట్నం |
| 3 | ఘజియాబాద్ |
| 4 | బెంగళూరు |
| 5 | ముంబై |
| 6 | న్యూఢిల్లీ |
| 7 | మంగళూరు |
| 8 | కోయంబత్తూర్ |
| 9 | పుణే |
| 10 | చెన్నై |

# కోర్టుకు దిశ కేసు అదనపు రిపోర్టు

**షాద్‌నగర్ టౌన్:** దిశ కేసు, నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి అదనపు రిపోర్టును పోలీసులు షాద్‌నగర్ కోర్టుకు సమర్పించారు. దిశ కేసులో నిందితుల కస్టడీ, రిమాండ్ కాలం పూర్తి కావడంతో కేసుకు సంబంధించిన వివరాలు కోర్టుకు తెలియజేయాల్సిన నేపథ్యంలో పోలీసులు అదనపు రిపోర్టును సమర్పించినట్లు సమాచారం. దిశ హత్య అనంతరం నిందితులు ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చెన్నకేశవులను నవంబర్ 29న పోలీసులు అరెస్టు చేశారు. షాద్‌నగర్ కోర్టులో జడ్జి అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్‌ను షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నిందితులను ఆయన ఎదుట నవంబర్ 30న హాజరు పరిచారు. అదేరోజు నిందితులకు తహసీల్దార్ 14 రోజుల రిమాండ్ విధించారు. అయితే, నిందితులను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు డిసెంబర్ 2న కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. కోర్టు నిందితులను డిసెంబర్ 3న 10 రోజుల కస్టడీకి అనుమతినిచ్చింది. నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్న తర్వాత సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం వారిని చటాన్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లారు. నిందితులు పోలీసులపై ఎదురుదాడికి దిగడంతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు నిందితులు చనిపోయారు. అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు మృతి చెందడంతో ఈ కేసును క్లోజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నిందితుల ఎన్‌కౌంటర్‌కు దారితీసిన పరిస్థితులు, మృతుల వివరాలు, నిందితుల నుంచి సేకరించిన ఆధారాల వివరాలన్నింటినీ పేర్కొంటూ అడిషనల్ రిపోర్టును పోలీసులు కోర్టులో దాఖలు చేసినట్లు సమాచారం. మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన తర్వాత తుది రిపోర్టును పోలీసులు కోర్టుకు అందజేయనున్నట్లు తెలిసింది.

**దారి మూసివేత..**

ఎన్‌కౌంటర్ చేసిన ఘటనా స్థలానికి ఎవరూ వెళ్లకుండా పోలీసులు దారి మూసేశారు. చటాన్‌పల్లి బ్రిడ్జి దగ్గరి నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలానికి చెట్లు, పొలం గట్ల మధ్యలో నుంచి దారి ఉంది. ఘటనా స్థలానికి ఎవరూ వెళ్లకుండా దారికి అడ్డంగా కట్టెలకు ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. పోలీసులు ఘటనా స్థలం వద్ద గుడారాన్ని ఏర్పాటు చేసుకొని బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# వారం పదిరోజుల్లో అమలవ్వాలి: సునీల్ శర్మ

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీకి ఇచ్చిన హామీలను వారం పది రోజుల్లోగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉద్యోగుల సంక్షేమ బోర్డు కార్యలాపాలను ఈవారంలోనే ప్రారంభించాలని సూచించారు. మంగళవారం ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. డిపో స్థాయి, రీజియన్, కార్పొరేషన్ స్థాయిలో ఉద్యోగ సంక్షేమ బోర్డులను ఇప్పటికే ఏర్పాటు చేసినందున వాటి విధివిధానాలను ఖరారు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సులను హేతుబద్ధీకరించాలని, తద్వారా తక్కువ మంది ప్రయాణికులతో బస్సులు తిరిగే పరిస్థితిని నివారించాలని సూచించారు. పెరిగిన చార్జీల ద్వారా గరిష్ట ఆదాయం పొందేలా షెడ్యూల్ ఉండాలని పేర్కొన్నారు. మహిళా సిబ్బందికి కొత్త యూనిఫాం ఆప్రాన్లను అందించాలన్నారు. సిబ్బంది ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశాలను ఒక్కొక్కటిగా ఆయన సమీక్షించారు. వీటిపై త్వరలో సీఎం భేటీ నిర్వహించే అవకాశం ఉన్నందున ఈలోపు వాటిని అమల్లోకి తెచ్చేలా చూడాలని ఆదేశించారు.

# ఆర్టీసీలో వన భోజనాలు



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీలో అధికారులు–సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వన భోజనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. డిపోలవారీగా వీటికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా కార్తీక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేయటం సహజం. ఉద్యోగాలు ఉంటాయో ఉండవో అన్న సందిగ్ధ పరిస్థితి నుంచి సీఎం నోట వరాల జల్లు కురిపించుకున్న ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం కార్తీకమాసం ఇప్పుడు వచ్చినట్టయింది. ముందుగా హైదరాబాద్‌లో తొలి వన భోజనాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. శామీర్‌పేట ప్రాంతంలోని ఓ రిసార్ట్స్‌లో ఆహ్లాదకర వాతావరణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆర్టీసీలో సిబ్బంది నిత్యం కచ్చితంగా విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అందరూ ఒకేసారి వన భోజనాలకు హాజరైతే బస్సులు నిలిచిపోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విడతలవారీగా వన భోజనాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# మెంచు రమేశ్, శిల్ప అరెస్టు

**మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు**

**హైదరాబాద్:** మావోయిస్టులతో సంబంధాలున్నట్లు ఆరోపిస్తూ నాచారం దుర్గానగర్‌లో ఉండే తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెంచు రమేశ్‌ను గద్వాల పోలీసులు అరెస్ట్ చేశారు. సోదాలు నిర్వహించి కొన్ని విప్లవ సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకొని రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా రేపోని గ్రామానికి చెందిన మెంచు ఎల్లయ్య, భారతమ్మల చిన్న కుమారుడు రమేశ్(36) ఉస్మానియాలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. 8 ఏళ్ల క్రితం రాణితో వివాహమైంది. వీరికి పాప ఉంది. మంగళవారం నాచారం దుర్గానగర్‌లోని రమేష్ ఇంట్లో గద్వాల పోలీసులు 6 గంటలపాటు సోదాలు నిర్వహించారు. అనంతరం రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉదయం 9 గంటలకు 15 మంది వచ్చి ఇంట్లో తనిఖీలు, సోదాలు చేశారని రాణి తెలిపారు. పోలీసులే విప్లవ సాహిత్య పుస్తకాలను తీసుకొచ్చి కిచెన్ రూమ్‌లో పెట్టి ఇంట్లో దొరికినట్లు ఆరోపిస్తూ తన భర్తను అరెస్ట్ చేసినట్లు ఆమె వెల్లడించారు. రెండు నెలల నుంచి రమేశ్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారన్నారు.



మెంచు రమేశ్ (ఫైల్)



శిల్ప (ఫైల్)

**శిల్ప అరెస్టు...**

**కీసర:** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ ఎస్వీ నగర్‌లో ఉంటున్న చైతన్య మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిల్పను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నాగారానికి చేరుకున్న గద్వాల పోలీసులు కీసర పోలీసుల సహకారంతో శిల్ప ఇంట్లో సోదాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సోదాలు నిర్వహించిన పోలీసులు శిల్ప ఇంట్లో నిషేధిత సాహి త్య పుస్తకాలు, లెటర్ ప్యాడ్స్, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. శిల్పను కూడా అదుపులోకి తీసుకొని గద్వాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా అరెస్టులపై పౌర హక్కుల సంఘం, ఇతర సంఘాలు నిరసన తెలిపాయి.

# జర్మనీ యువతితో ఆ దేశ జాగృతి అధ్యక్షుడి వివాహం

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు ఆహ్వానం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రేమకు కులం, మతం, ప్రాంతం హద్దులు కావని మరోసారి నిరూపిస్తూ తెలంగాణ జాగృతి జర్మనీ విభాగం అధ్యక్షుడు స్వర్ణాకర్, జర్మనీ యువతి జూలియా ఈ నెల 22న వివాహ బంధంతో ఒక్కటవనున్నారు. భారతీయ సంప్రదాయ పద్ధతిలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగే తమ వివాహానికి రావాల్సిందిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు స్వర్ణాకర్, జూలియాలు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన స్వర్ణాకర్ జర్మనీలో ఉద్యోగం చేస్తూ, అక్కడ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని విస్తరించడానికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ దేశానికి చెందిన డాక్టర్ జూలియాతో ఏర్పడిన పరిచయం ప్రేమ గా మారగా, పెళ్లికి వారిద్దరి తల్లిదండ్రులు అంగీకరించారు. స్వర్ణాకర్, జూలియా జంటకు కవిత నూతన వస్త్రాలు బహూకరించి, శుభాకాంక్షలు తెలిపారు.



కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న జీవన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి

# కేటీఆర్‌కు మంత్రులు, పార్టీ నేతల శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి భవన్‌లో మంగళవారం ఉదయం మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, మాజీ మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, రెడ్యా నాయక్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు సోలిపేట రామలింగారెడ్డి, జీవన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రాథోడ్ బాపూరావు, రేఖానాయక్, నన్నపునేని నరేందర్, డాక్టర్ ఆనంద్, ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు కేటీఆర్‌కు శుభాకాంక్షలు చెప్పారు. పలువురు టీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాభినందనలు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు మొదలుకొని స్థానిక సంస్థలు, హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పార్టీ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు పార్టీ నేతలు కేటీఆర్‌ను అభినందించారు.



ఆస్ట్రేలియా ఎంపీ జూలీ ఇసాబెల్ బిషప్‌తో ఎంపీ కోమటిరెడ్డి

# ఆస్ట్రేలియా ఎంపీతో కోమటిరెడ్డి భేటీ

**సాక్షి, హైదరాబాద్:** ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆ దేశానికి చెందిన ఎంపీ జూలీ ఇసాబెల్ బిషప్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా, భారత రాజకీయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాలు, స్వరాష్ట్ర సాధనలో రాష్ట్ర ప్రజలు చూపిన తెగువ, రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిన తీరును కోమటిరెడ్డి ఆస్ట్రేలియా ఎంపీకి వివరించారని ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆస్ట్రేలియాలో ప్రభుత్వ శాఖల పనితీరు, ఆ దేశంలో జరుగుతున్న సంస్కరణల గురించి కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు.

# మద్యం ధరల పెంపు వెనుక ఓ ఎంపీ!



**బహిరంగ లేఖలో ఎంపీ రేవంత్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న మద్యం ధరల పెంపు నిర్ణయం వెనుక భారీ కుంభకోణం ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి, పంపిణీ, అమ్మకాల వరకు మాఫియా గుప్పిట్లో ఉందని, తాజా మద్యం ధరల పెంపు విషయంలో అధికార పార్టీకి చెందిన ఓ ఎంపీ ఢిల్లీ, చెన్నైలలో మకాం వేసి బేరం కుదిర్చారని అన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని సీబీఐతో విచారణ జరిపించాలని మంగళవారం ఆయన రాసిన బహిరంగ లేఖలో కోరారు. వెంటనే పెంచిన మద్యం ధరలను ఉపసంహరించుకోవాలని, లేదంటే న్యాయస్థానాల ద్వారా సీబీఐ విచారణ కోసం పోరాడుతామని లేఖలో రేవంత్ వెల్లడించారు.

# నాపై ప్రభుత్వం కక్ష సాధింపు: సంపత్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై తాను ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ ఆరోపించారు. తాను ప్రభుత్వ విధానాలను విమర్శించానని గన్‌మన్‌లను తీసేశారని, ఏడాది కాలంగా తనకు రావాల్సిన మాజీ ఎమ్మెల్యే పింఛన్ ఇవ్వడం లేదని మంగళవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. తన సోదరుడిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తొలగించారని, తన మరో సోదరుడు న్యాయపరంగా దక్కించుకున్న కాంట్రాక్టులను కూడా తొలగించారని ఆరోపించారు. ఐకియాకు ఇచ్చిన అనుమతుల్లో క్విడ్‌ప్రోకో జరిగిందని, హెరిటేజ్ భవనాన్ని తొలగించి కేటీఆర్ వందల కోట్లు సంపాదించడాన్ని తాను పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సభ్యుడిగా ఏడుసార్లు ప్రశ్నించినా సమాధానం చెప్పలేదని అన్నారు.

# 'బీజేపీ అనాలోచిత నిర్ణయాలతో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం'



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకమవుతోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం కారణంగా దేశంలో జరుగుతున్న ఆందోళనలు, అలజడులకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలే బాధ్యత వహించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.నిరంజన్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో నిప్పుపెట్టి అది బడబాగ్నిగా మారితే ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై నెట్టలేరన్నారు.

# విద్య, వ్యవసాయ రంగాలపై హరీశ్ సమీక్ష



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా అందించడంతోపాటు విద్య, వ్యవసాయ రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అర్థగణాంక శాఖ కార్యాలయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలసి నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీతి ఆయోగ్ సలహాదారు మురళీధరన్ కార్తికేయన్, గణాంక శాఖ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి, ప్రణాళికా శాఖ డైరెక్టర్ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వ్యవసాయ విస్తరణాధికారుల సేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రణాళికా శాఖ సెజీస్ సంస్థతో కుదు ర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఆ సంస్థ చేపడుతున్న కార్యకలాపాలపై కూడా సమీక్ష జరిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**తెలంగాణ ప్రభుత్వము**
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్/జాయింట్ కలెక్టర్
నాగర్‌కర్నూల్ జిల్లా రాజపత్రం (గెజిట్)
అసాధారణం అధికార ముద్రితం
ప్రకటన
ఫారం-VII
రూల్ 25 సబ్‌రూల్ (1) చూడుము
కేంద్ర చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1)

సంఖ్య: 123/2019 — తేది: 03/12/2019
గెజిట్ నెం.[illegible]/2794/2017 — తేది: 03/12/2019

నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం వట్టెం గ్రామం లోని మొత్తం ఎ. 3.17 ½ గుంటల భూమి ప్రజోపయోగం నిమిత్తం అనగా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామం లోని వట్టెం బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కొరకు అవసరమయినట్లుగా తెలుస్తోంది.
అందువల్ల ఈ క్రింద వివరింపబడిన నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం వట్టెం గ్రామం లోని ఎ. 3.17 ½ గుంటల భూమిని పైన చెప్పిన ప్రాజెక్టు కొరకు స్వాధీనపరచుకునేందుకు ఈ ప్రకటన జారీచేయనైనది.

వట్టెం బ్యాలన్సింగ్ రిజర్వాయర్
గ్రామం: వట్టెం — మండలం: బిజినేపల్లి — జిల్లా: నాగర్‌కర్నూల్

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | [illegible] | [illegible] | [illegible] | 0.05½ | యెంబరెట్ల కిష్టమ్మ భర్త నారాయణ | 164 | 190 | 193 | 165 | Nil | Nil |
| 2 | [illegible] | [illegible] | [illegible] | 0.12 | బాల మాసమ్మ భర్త కొండయ్య | 164 | 190 | 193 | 165 | Nil | Nil |
| 3 | [illegible] | [illegible] | [illegible] | 3.00 | [illegible] బాలయ్య తండ్రి రాములు | 164 | 190 | 193 | 165 | Nil | Nil |
| | | మొత్తం | | 3.17½ | | | | | | | |

[illegible]

Sd/- ప్రత్యేక ఉపకలెక్టర్ ... నాగర్‌కర్నూల్ — Sd/- జాయింట్ కలెక్టర్, నాగర్‌కర్నూల్ — Sd/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్
DIPR R.O. No.1133/LA/PP-Agency/2019-20

**SAINIK SCHOOL KALIKIRI**
**CHITTOOR DIST, (A.P)-517234**
**(Under the aegis of MoD, Govt of India)**
**WALK - IN - INTERVIEW**
Walk in interview for 01 Vacancy of Lower Division Clerk purely on temporary basis approximately for 6 months (may be extended with prior intimation) is scheduled to be held on 20 Dec 2019 at 0930 hrs in this school. For more details please visit www.kalikirisainikschool.com.
**NO TA/DA WILL BE PAID FOR ATTENDING THE SELECTION PROCESS/WALK-IN-INTERVIEW.**
**Sd/- PRINCIPAL**

# రణరంగంగా ఈశాన్య ఢిల్లీ

## పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సీలంపూర్‌లో భారీ ర్యాలీ

- లాఠీచార్జ్, భాష్పవాయు గోళాలను ప్రయోగించిన పోలీసులు
- కేరళ, తమిళనాడుల్లోనూ నిరసనలు
- సోనియా నేతృత్వంలో రాష్ట్రపతిని కలసిన విపక్షాలు




బెంగళూరులో నిరసన తెలుపుతున్న విద్యార్థి

**న్యూఢిల్లీ/ముంబై:** పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఈశాన్య ఢిల్లీలో ఆందోళనకారులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకమైంది. సీలంపూర్ జంక్షన్ వద్ద దాదాపు 3 వేల మందికి పైగా పాల్గొన్న ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. దాంతో, పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పోలీస్ ఔట్ పోస్ట్‌ను, పోలీసులకు చెందిన రెండు బైకులను, పలు బస్సులను ధ్వంసం చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. రాళ్ల దాడిలో ఇద్దరు పోలీసులకు, లాఠీచార్జ్‌లో పలువురు నిరసనకారులకు గాయాలయ్యాయి. మరోవైపు, దేశవ్యాప్తంగా పలు నగరాలు, యూనివర్సిటీల్లో ఈ వివాదాస్పద చట్టానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమబెంగాల్‌ల్లో నిరసనల తీవ్రత అధికంగా ఉంది. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, ఇజ్రాయెల్ దేశాలు భారత్‌కు వెళ్తున్న తమ పౌరులు జాగ్రత్త పడాలంటూ ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేశాయి.

**రాష్ట్రాల్లో..**

కేరళలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హర్తాళ్ జరపాలన్న 30 ఇస్లామిక్, రాజకీయ సంస్థల పిలుపు మేరకు వివిధ ప్రాంతాల్లో భారీగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రజా రవాణా బస్సులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. బలవంతంగా దుకాణాలు మూయించారు. పోలీసులు దాదాపు 200 మందిని అరెస్ట్ చేశారు. పార్లమెంట్లో ఈ బిల్లుకు మద్దతివ్వడంపై తమిళనాడులో మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ అధికార అన్నాడీఎంకేపై మండిపడ్డారు. దేశాన్ని అభివృద్ధి దిశగా కాకుండా, ముస్లింల హక్కులను కాలరాచే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ మండిపడ్డారు. చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించలేదని పశ్చిమబెంగాల్ సీఎం మమత స్పష్టం చేశారు.

**విదేశాల్లో..**

ప్రతిష్టాత్మక ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వర్సిటీల్లో విద్యార్థులు, పరిశోధకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికాలోని 40 వర్సిటీలకు చెందిన 400 మంది విద్యార్థులు జామియా విద్యార్థులకు సంఘీభావంగా ఒక ప్రకటన విడుదల చేశారు. జామియా, ఏఎంయూల్లో పోలీసుల దౌర్జన్యం మానవహక్కుల ఉల్లంఘనేనని అందులో పేర్కొన్నారు. కొలంబియా యూనివర్సిటీలో అధ్యాపకులు సైతం నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఫిన్లాండ్‌లోని ట్యాంపెర్ యూనివర్సిటీ విద్యార్థులు చట్టాన్ని వ్యతిరేకిస్తూ అక్కడి భారతీయ ఎంబసీకి లేఖ రాశారు.

### రద్దు చేయించండి

రాష్ట్రపతి కోవింద్‌ను కలసి వస్తున్న ఆంటోనీ, డి.రాజా, బాలు, సోనియా గాంధీ, ఆజాద్, ఏచూరి



ప్రజా వ్యతిరేక పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ 12 విపక్ష పార్టీలు రాష్ట్రపతిని కలిశాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, సీతారాం ఏచూరి (సీపీఎం), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ), రాంగోపాల్ యాదవ్(సమాజ్‌వాదీ) సహా సీపీఐ, డీఎంకే, ఆప్, ఆర్జేడీ, నేషనల్ కాన్ఫెరెన్స్, ఐయూఎంఎల్ తదితర పార్టీల ప్రతినిధులు రాష్ట్రపతిని కలిశారు. 'ఇది చాలా సీరియస్ అంశం. దేశాన్ని విచ్ఛిన్నం చేసే చట్టం అది. ఈ చట్టంపై ఈశాన్యంలోనే కాదు దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఆందోళనకారులపై పోలీసుల దౌర్జన్యం దారుణంగా ఉంది' అని రాష్ట్రపతితో భేటీ అనంతరం సోనియా వ్యాఖ్యానించారు.



ఢిల్లీలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాన్ని ప్రయోగిస్తున్న జవాను



ఢిల్లీలో ఆందోళనల్లో గాయపడి, రక్తమోడుతున్న ఓ వ్యక్తి

### అమలు చేస్తాం: అమిత్‌షా

పౌరసత్వ సవరణ చట్టంపై వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదని అమిత్ షా స్పష్టం చేశారు. ఈ విషయంలో విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టంలో మైనారిటీలకు వ్యతిరేకంగా ఏమీ లేదని మంగళవారం 'ఇండియా ఎకనమిక్ కాంక్లేవ్'లో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. 'పౌరసత్వ చట్టంపై మరో ఆలోచన లేదు. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని స్పష్టం చేశారు. ఈ చట్టం న్యాయ సమీక్షకు నిలవబోదన్న విపక్ష వాదనను కూడా ఆయన కొట్టేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులపై ఎలాంటి చర్యలుండవని, అయితే, హింసకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం చర్యలుంటాయని పేర్కొన్నారు. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడైన వీడీ సావర్కర్‌తో పోల్చుకునే స్థాయి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేదన్నారు. రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజారిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

---

## క్లుప్తంగా...

### రైల్వేకు నష్టం చేస్తే 'కనిపిస్తే కాల్చివేత'!

**రైల్వేశాఖ సహాయమంత్రి వ్యాఖ్య**

**బెంగళూరు:** పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే ఆస్తులను ధ్వంసం చేసేవారిపై కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు జారీ చేస్తామని రైల్వే శాఖ సహాయమంత్రి సురేశ్ హెచ్చరించారు. రైల్వే ఆస్తులను ధ్వంసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కోరుతామన్నారు. 'ఎవరైనా రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై హైదరాబాద్ విలీనం సమయంలో సర్దార్ వల్లభాయి పటేల్ చేపట్టిన స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతాం' అన్నారు. కఠిన చర్యలు అంటే ఏమిటని మీడియా ప్రశ్నించగా.. కఠిన చర్యలు అంటే కనిపిస్తే కాల్చివేతనే అని సమాధానమిచ్చారు. పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పలు రాష్ట్రాల్లో ఆందోళనకారులు రైల్వే ఆస్తులను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.

### ఫిబ్రవరిలో సీబీఎస్‌ఈ పరీక్షలు

**న్యూఢిల్లీ:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) 2020లో జరగనున్న 10, 12 తరగతుల పరీక్షల వివరాలను వెల్లడించింది. 2020 ఫిబ్రవరి 15 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని మంగళవారం చెప్పింది. 10వ తరగతి పరీక్షలు మార్చి 20న ముగియనుండగా 12వ తరగతి పరీక్షలు మార్చి 30న ముగియనున్నాయి.

### ఓసీఐ కార్డుదారులకు శుభవార్త

**వాషింగ్టన్:** ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డ్ ఉన్న విదేశాల్లోని భారతీయులకు భారత ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 20 ఏళ్ల లోపు, లేదా 50 ఏళ్ల పైబడిన వయసు ఉండి, ఇటీవలే తమ పాస్‌పోర్ట్‌ను రెన్యూవల్ చేయించుకుని, భారత్‌కు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ శుభవార్త. వారు తమ ఓసీఐ కార్డ్‌తో పాటు కొత్త పాస్‌పోర్ట్, రద్దైన పాత పాస్‌పోర్ట్.. రెండూ తమ వద్ద పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారత్‌కు రావచ్చని భారత హోంశాఖ లోని విదేశాంగ విభాగం మంగళవారం ప్రకటించింది. 2020, జూన్ 30 వరకు ఈ వెసులుబాటు కల్పించామని పేర్కొంది.

### బీజేపీకి ఫిబ్రవరిలో నూతన సారథి!

**న్యూఢిల్లీ:** బీజేపీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కొత్త అధ్యక్షుడు రానున్నారు. కొన్ని రాష్ట్రాలకు పార్టీ కొత్త చీఫ్‌లను కూడా నియమించేందుకు అవకాశాలున్నాయి. కొన్ని నెలలుగా జరుగుతున్న సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ మేరకు మార్పులు కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. 'ఒక వ్యక్తి–ఒక పదవి' సంప్రదాయం ప్రకారం పార్టీ అధ్యక్ష పదవిని జేపీ నడ్డా చేపట్టేందుకు అమిత్ షా మొగ్గు చూపేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం నడ్డా బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

### ఢిల్లీ @ 12.2 డిగ్రీలు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఈ సీజన్లో అత్యంత తక్కువగా మంగళవారం 12.2 డిగ్రీలుగా నమోదైంది. డిసెంబరు పగటి ఉష్ణోగ్రతల్లో ఇదే రెండో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రత. గతంలో 1997లో ఒకసారి ఇదే సీజన్లో రికార్డు స్థాయిలో 11.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. హిమాలయాల నుంచి వచ్చిన చల్లని గాలులు, తక్కువ ఎత్తులో ఉన్న మేఘాలతో సూర్యరశ్మి తగ్గి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి.

---

# పాకిస్తానీయులందరికీ ఇస్తారా?

**భారత పౌరసత్వంపై కాంగ్రెస్‌కు మోదీ సవాల్**



**భోగ్నాదిహ్ (జార్ఖండ్):** పాకిస్తానీయులందరికీ భారతీయ పౌరసత్వం కల్పిస్తామని ప్రకటించే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా? అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని పునరుద్ధరించి, ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేసే ధైర్య సాహసాలు ఆ పార్టీకి ఉన్నాయా అని సవాల్ విసిరారు. జార్ఖండ్‌లో ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి మంగళవారం మోదీ మాట్లాడారు. పౌరసత్వ సవరణ చట్టంతో భారత్‌లో పౌరులకు ఎలాంటి హాని జరగదని ఆయన పునరుద్ఘాటించారు.

**ప్రజాస్వామ్యయుతంగా చర్చిద్దాం**

జామియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసు చర్యల్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న విద్యార్థుల నిరసన ప్రదర్శనలపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అర్బన్ నక్సల్స్ పన్నిన కుట్ర వలలో విద్యార్థులు చిక్కుకోవద్దని హితవు పలికారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం అర్బన్ నక్సల్స్, ఇతర రాజకీయ పార్టీలు విద్యార్థుల భుజం మీద తుపాకీ ఉంచి కాల్చడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఏ అంశంలోనైనా ప్రభుత్వంతో ప్రజాస్వామ్యయుతంగా చర్చలు జరపవచ్చునని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# విచారణ కమిటీ ఏర్పాటుకు సుప్రీం నో

- హైకోర్టుకు వెళ్లండని పిటిషనర్లకు సూచన
- విద్యార్థుల అరెస్ట్ జరగలేదని వాదించిన సొలిసిటర్ జనరల్

**న్యూఢిల్లీ:** పౌరసత్వ చట్ట సవరణకు నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై విచారణకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిటీ వేసేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. హైకోర్టులు విచారణ కమిటీలు ఏర్పాటు చేయవచ్చునని, పిటిషనర్లు దిగువ కోర్టును ఆశ్రయించాలని సీజేఐ జస్టిస్ బాబ్డే నేతృత్వంలోని బెంచ్ స్పష్టం చేసింది. హింస చెలరేగిన రాష్ట్రాల హైకోర్టుల్లోనే పిటిషనర్లు తమ సమస్యలను నివేదించి, విచారణ కమిటీ ఏర్పాటును కోరాలని తెలిపింది. పిటిషనర్లు తమ ముందుంచిన ప్రతి అంశంపై కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విభేదిస్తున్నట్లు బెంచ్ తన ఆదేశాల్లో ప్రస్తావించడం గమనార్హం. విద్యార్థులను విచక్షణ రహితంగా అరెస్ట్ చేశారని, గాయపడిన వారికి తగిన వైద్యమూ అందడం లేదని పిటిషనర్లు చెప్పడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఆయా రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు విచారణకు ఆదేశిస్తారని నమ్మకంగా ఉన్నామని బెంచ్ వ్యాఖ్యానించింది. కమిటీ నియామకం సమయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఉండాలా? హైకోర్టు న్యాయమూర్తా? అన్నది కేంద్రం, ఆయా రాష్ట్రాల వాదనలు విన్న తరువాత నిర్ణయిస్తారని తెలిపింది.

**తీవ్రమైన అంశాలే ఉన్నాయి...**

యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ల మాటలను పోలీసులు పట్టించుకోవడం లేదన్న తీవ్రమైన అంశాలనే పిటిషనర్లు ప్రస్తావించారని, ఈ అంశాన్ని సొలిసిటర్ జనరల్ తిరస్కరిస్తున్న విషయాన్ని తాము పరిగణలోకి తీసుకుంటున్నామని బెంచ్ తెలిపింది. తెలంగాణ ఎన్‌కౌంటర్ విషయంలో మాదిరిగా ఈ కేసుల్లోనూ ఓ విచారణ కమిటీ ఏర్పాటు చేయడం సరికాదని, ఈ రెండు అంశాల మధ్య పోలిక లేదని వాదనల సందర్భంగా బెంచ్ స్పష్టం చేసింది. వార్తా పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా న్యాయ సంబంధిత నిర్ణయాలు తీసుకోలేమని ఒక సందర్భంలో తెలిపిన బెంచ్ పిటిషనర్ల న్యాయవాదులు గట్టిగా అరవడాన్ని తాము హర్షించమని హెచ్చరించారు.

# 'మైనారిటీ హోదా'పై పిల్ కొట్టివేత



**న్యూఢిల్లీ:** దేశంలో అల్పసంఖ్యాకులను వారి మొత్తం జనాభా ఆధారంగా మైనారిటీలుగా గుర్తించే 1993 నాటి ప్రభుత్వ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీజేపీ నేత, లాయర్ అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్శీ మతస్తులను వారి జనాభా ఆధారంగా రాష్ట్రాల వారీగా మైనారిటీలుగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. జమ్మూకశ్మీర్‌తోపాటు ఈశాన్య ప్రాంతంలోని మొత్తం 8 రాష్ట్రాల్లో మైనారిటీలుగా ఉన్న హిందువులు అల్పసంఖ్యాక వర్గాల వారికి ప్రభుత్వం అందించే సౌకర్యాలను పొందలేక పోతున్నారన్నారు. స్పందించిన ధర్మాసనం 'భాషలు రాష్ట్రాన్ని బట్టి మారుతుంటాయి. మతానికైతే రాష్ట్ర సరిహద్దులతో సంబంధం లేదు. అందుకే, మతం విషయంలో దేశం మొత్తాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. కశ్మీర్‌లో మెజారిటీగా ఉన్న ముస్లింలు దేశంలోని మిగతా ప్రాంతాల్లో మైనారిటీలైతే ఏంటి సమస్య? లక్షద్వీప్‌లో మైనారిటీ ముస్లింలు హిందువుల చట్టాలను అనుసరించడం లేదా?'అని ప్రశ్నించింది. రాష్ట్రాల వారీ జనాభా ఆధారంగా మైనారిటీ హోదా కల్పిస్తున్నట్లుగా గతంలో కోర్టులిచ్చిన తీర్పులు ఏవైనా ఉంటే చూపించాలని పిటిషనర్‌ను అడిగింది. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ మాట్లాడుతూ.. గతంలో అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన పలు తీర్పులు కూడా దేశం మొత్తం జనాభా ప్రాతిపదికగానే మైనారిటీలను నిర్ణయించాలని స్పష్టం చేశాయన్నారు. దీంతో ఈ పిల్‌ను తోసిపుచ్చుతున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

# నిర్భయ కేసులో మలుపు

**మరణ శిక్ష రివ్యూ పిటిషన్ విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ**



**న్యూఢిల్లీ:** నిర్భయ అత్యాచారం, హత్య కేసులో దోషి అక్షయ్ కుమార్ సింగ్ తనకు విధించిన మరణ శిక్షపై సుప్రీంకోర్టులో వేసిన రివ్యూ పిటిషన్ విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే తప్పుకున్నారు. జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం మధ్యాహ్నం ఈ రివ్యూ పిటిషన్‌పై విచారణ జరపవలసి ఉంది. అయితే అనూహ్యంగా జస్టిస్ బాబ్డే ఈ విచారణ నుంచి తాను తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ కేసులో బాధితురాలైన నిర్భయ తల్లి తరఫున విచారించిన లాయర్లలో తన బంధువు ఒకరు ఉన్నారని, అందుకే తప్పుకుంటున్నట్లు జడ్జి చెప్పారు.

**మరో కేసులో కూడా**

కేసులో దోషిగా తేలిన రాజకీయనేత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నవారు, రాజకీయ పార్టీలకు ఎలా నేతృత్వం వహిస్తారంటూ సుప్రీంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ నుంచీ సీజేఐ తప్పుకున్నారు. జస్టిస్ బాబ్డే కుమార్తె కూడా లాయరే. ఆమె ఇదే అంశంపై మరో విచారణ బెంచ్ ఎదుట తన వాదనలు వినిపించారు. అందుకోసమే సీజేఐ బాబ్డే ఈ కేసు విచారణ నుంచి తప్పుకున్నారు.




# వాట్సాప్‌లో బగ్..

**అప్‌డేట్ చేసుకోవాలని సూచన**

**న్యూఢిల్లీ:** మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ గ్రూపులను టార్గెట్ చేసే బగ్‌ను తాము గుర్తించినట్లు వాట్సాప్ తెలిపింది. తాజా వెర్షన్ 2.19.58కు అప్‌డేట్ చేసుకోవాలని మంగళవారం సూచించింది. బగ్ కారణంగా గ్రూపుల్లోని మెసేజ్‌లు శాశ్వతంగా డిలీట్ అవుతున్నాయని తెలిపారు. హ్యాకర్లు వాట్సాప్ వెబ్‌ను ఉపయోగించి వెబ్ డీబగ్గింగ్ టూల్ ద్వారా గ్రూపుల్లో ప్రత్యేక పారామీటర్లు ఉన్న సందేశాలు పంపుతున్నారని తెలిపారు. దీనివల్ల గ్రూప్ క్రాష్ అయ్యి పనిచేయడం ఆగిపోతోందని వాట్సాప్ ప్రొడక్ట్ వల్నెరబిలిటీ రీసెర్చ్ చెక్ పాయింట్స్ హెడ్ ఓడెడ్ వనును తెలిపారు. ఈ హ్యాకింగ్ ప్రక్రియను సాగించే హ్యాకర్లు ఆయా గ్రూపుల్లో సభ్యులై ఉంటారని చెప్పారు. వినియోగదారులు వాట్సాప్ అన్‌ఇన్‌స్టాల్ చేసి మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు.

# బ్రహ్మోస్ సక్సెస్



**బాలాసోర్:** భారత రక్షణ శాఖ ఆయుధ సంపత్తిలో బ్రహ్మాస్త్రంగా పరిగణిస్తున్న అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష మరోసారి విజయవంతమైంది. చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లోని లాంచ్ ప్యాడ్3 నుంచి భూమిపై ఉన్న లక్ష్యాలను ఛేదించేలా రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణి(మొదటి రకం)ని మంగళవారం ఉదయం ప్రయోగించారు. ఇక గాలిలోని లక్ష్యాలనుఛేదించగల రెండో రకాన్ని ఐఏఎఫ్ యుద్ధ విమానాన్ని టార్గెట్‌గా చేసుకుని ప్రయోగించారు. మంగళవారం మధ్యాహ్నం కలైకుండ ఎయిర్‌బేస్ నుంచి ఎగిరిన ఐఏఎఫ్ యుద్ధ విమానాన్ని లక్ష్యంగా నిర్దేశించారు. దీనిని ఎయిర్‌ఫోర్స్ వేరియంట్ బ్రహ్మోస్ క్షిపణి బంగాళఖాతం సమీపంలో ఛేదించిందని రక్షణవర్గాలు వెల్లడించాయి.

# ముషారఫ్‌కు మరణశిక్ష

- పాకిస్తాన్ కోర్టు తీర్పు
- రాజ్యాంగాన్ని రద్దుచేసి సైనిక పాలన విధించారన్న ఆరోపణలపై..

**ఇస్లామాబాద్:** సైనికాధ్యక్షుడిగా ఉంటూ సైనికపాలన విధించిన పాకిస్తాన్ మాజీ సైనికాధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు పాకిస్తాన్ ప్రత్యేక కోర్టు మరణశిక్ష విధించింది. రాజ్యాంగాన్ని తాత్కాలికంగా రద్దు చేసి, సైనిక పాలన విధించి తీవ్ర దేశద్రోహానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై కోర్టు మరణశిక్ష విధించింది. 1999లో తిరుగుబాటు ద్వారా అధికారాన్ని స్వాధీనం చేసుకొని, అధ్యక్షుడి స్థానాన్ని చేజిక్కించుకొని, నిరంకుశంగా పరిపాలించిన ముషారఫ్ దేశద్రోహ నేరానికి పాల్పడ్డారని కోర్టు అభిప్రాయపడింది. 2014లో ముషారఫ్ పై ఈ కేసు నమోదైంది.

పెషావర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ వక్వార్ అహ్మద్ సేథ్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల స్పెషల్ కోర్టు పాకిస్తాన్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించినందుకుగాను, రాజ్యాంగంలోని ఆర్టికల్ 6 ప్రకారం పర్వేజ్ ముషారఫ్‌ను దోషిగా ఉగ్రవాద నిరోధక ప్రత్యేక కోర్టు నిర్ధారించింది. నవంబర్ 19న రిజర్వులో ఉంచిన తీర్పుని సింధ్ హైకోర్టు (ఎస్‌హెచ్‌సీ) జస్టిస్ నజర్ అక్బర్, లాహోర్ హైకోర్టు జస్టిస్ షాహీద్ కరీమ్‌ల బెంచ్ మంగళవారం వెల్లడించింది.

కోర్టు తీర్పు పూర్తి వివరాలు వెల్లడించలేదు. కోర్టు తీర్పుపై తన అభిప్రాయాన్ని వెల్లడించేందుకు ముషారఫ్ అందుబాటులో లేరు. అయితే ఫిర్యాదులను, రికార్డులను, వాదనలు, కేసులోని వాస్తవాలను పరిశీలించిన మీదట ముగ్గురు న్యాయమూర్తుల్లో ఇద్దరు ముషారఫ్‌కి వ్యతిరేకంగా మెజారిటీ తీర్పుని వెల్లడించారు. 2007లో ముషారఫ్ దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి, సైనిక పాలన విధించినప్పుడు ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. అత్యవసర పరిస్థితి విధించడంతో దేశంలో పౌరుల హక్కులు హరణకు గురయ్యాయి, మానవ హక్కులకు అర్థం లేకుండా పోయింది. 2007 నవంబర్ నుంచి 2008 ఫిబ్రవరి వరకు పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితి కారణంగా ఎటువంటి ప్రజాస్వామిక పాలనకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది.

అధ్యక్షస్థానంలో ఉండి ముషారఫ్ సైనికాధిపతిగా వ్యవహరించడంతో ముషారఫ్ పాలనలో జనం విసిగిపోయారు. సుప్రీంకోర్టు జడ్జీలనూ ఆనాడు గృహ నిర్బంధంలో ఉంచారు. అనేక మంది జడ్జీలను విధుల నుంచి తొలగించారు. తర్వాత 2008లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతిచ్చిన ఓ రాజకీయ పార్టీ వైఫల్యంతో ముషారఫ్ పాకిస్తాన్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత ముషారఫ్ విదేశాలకు పారిపోయాడు. విదేశాలకు పారిపోయిన ముషారఫ్‌కి ఈ శిక్ష అమలు చేయడం ఇప్పుడు సవాల్‌గా మారనుంది.

దుబాయ్‌లోని ఆసుపత్రి పడకపై నుంచి ముషారఫ్ గత నెలలో ఓ వీడియో రికార్డింగ్‌ను విడుదల చేశారు. అందులో కేసులో తనపై న్యాయమైన విచారణ జరగడంలేదని ఆరోపించారు. అలాగే 'జాతికి సేవ చేశాను. దేశ అభ్యున్నతి కోసమే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను' అని వీడియోలో ముషారఫ్ వ్యాఖ్యానించారు. ఈ తీర్పుని ముషారఫ్ పై కోర్టులో చాలెంజ్ చేయొచ్చని న్యాయనిపుణులు వెల్లడించారు. అమెరికాపై నవంబర్ 9న జరిగిన దాడుల అనంతరం ఉగ్రవాదంపై పోరులో ముషారఫ్ అమెరికా పక్షం వహించడం పట్ల మతపరమైన పార్టీలు విమర్శలు గుప్పించాయి. పాకిస్తాన్‌లో ఇస్లామిస్ట్ హింసకు దారితీశాయి.



# సెంగార్‌కు ఉరే సరి

**ఉన్నావ్/న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచారం కేసులో బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌కు ఉరిశిక్ష విధించాలని బాధితురాలి తల్లి మంగళవారం డిమాండ్ చేశారు. మరో నిందితురాలు శశిసింగ్‌ను నిర్దోషిగా విడుదల చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం యూపీలోని ఉన్నావ్‌లో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశారన్న కేసులో ఢిల్లీ కోర్టు సెంగార్‌ను సోమవారం దోషిగా నిర్ధారించిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పుపై బాధితురాలి తల్లి మంగళవారం స్పందిస్తూ ''శశిసింగ్‌ను ఎందుకు వదిలేశారు? ఉద్యోగమిస్తానని మాయమాటలు చెప్పి నా కూతురిని కుల్దీప్ సెంగార్ వద్దకు తీసుకెళ్లింది శశిసింగే'అని వాపోయారు. బాధితురాలి సమీప బంధువు ఇప్పటికీ జైల్లో ఉన్నారని, అతడు విడుదలయ్యేంత వరకూ తనకు న్యాయం దక్కనట్లేనని స్పష్టం చేశారు. దోషికి కఠినాతి కఠినమైన శిక్ష విధించాలని సీబీఐ వాదించగా ఈ అంశంపై తాను డిసెంబరు 20న తీర్పు వెలువరిస్తానని ఢిల్లీ జిల్లా న్యాయమూర్తి ధర్మేశ్ శర్మ ప్రకటించారు.

epaper.sakshi.com

సాక్షి
బుధవారం, డిసెంబర్, 18

# మాజీ నియంతకు మరణశిక్ష

పాకిస్తాన్‌ను ఒక అర్థరాత్రి చెరబట్టి, ఏ రకమైన ప్రజామోదమూ లేకుండా తొమ్మిదేళ్లపాటు పాలించి, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసిన జనరల్ పర్వేజ్ ముషార్రఫ్‌కు అక్కడి ప్రత్యేక న్యాయ స్థానం దేశద్రోహ నేరంకింద మరణశిక్ష విధించడం ఆ దేశంలో మారిన పరిస్థితులకు అద్దం పడుతుంది. సుప్రీంకోర్టుకు అప్పీల్‌కి వెళ్లినప్పుడు ఈ శిక్ష నిలబడుతుందా... పాక్ సైన్యం ఈ తీర్పును ఎలా పరిగణిస్తుందన్న అంశాలు పక్కనబెడితే పాకిస్తాన్ చరిత్రలో సైనిక కుట్ర ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న సైనికాధికారికి పౌర న్యాయస్థానంలో మరణశిక్ష పడటం ఇదే ప్రథమం. ఇప్పటికే అనారోగ్యంతో దుబాయ్ ఆసుపత్రిలో ఉన్న ముషార్రఫ్ తన వాదన వినకుండా తీర్పునిచ్చారని, తనను వేధిస్తున్నారని ఎన్ని కబుర్లైనా చెప్పొచ్చుగానీ... ఆయన చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కాదు. 1999 అక్టోబర్‌లో అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్ శ్రీలంక పర్యటనకెళ్లినప్పుడు రక్తరహిత కుట్ర ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న ముషార్రఫ్ ఆ తర్వాత వరసబెట్టి ప్రజా స్వామ్య వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. ముందుగా మీడియా పీకనొక్కి, ఆ తర్వాత న్యాయవ్యవస్థ పనిపట్టారు. 2007లో దేశంలో రాజ్యాంగాన్ని రద్దుచేసి, కొత్తగా తాత్కాలిక రాజ్యాంగాన్ని తీసుకొచ్చి దానికింద ఎమర్జెన్సీ విధించారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయ మూర్తులంతా పదవుల్నించి తప్పుకుని కొత్త రాజ్యాంగం కింద ప్రమాణస్వీకారం చేయాలని హుకుం జారీచేశారు. ఈ తాత్కాలిక రాజ్యాంగాన్ని తక్షణం నిలిపేస్తున్నట్టు ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ ఉత్తర్వులిచ్చింది. వీరిని, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇఫ్తెకర్ చౌధ్రితోసహా వంద మంది న్యాయమూర్తులను పదవులనుంచి తొలగించి గృహ నిర్బంధంలో ఉంచారు. వివిధ హైకోర్టులు, ఆ కిందిస్థాయి న్యాయస్థానాలకు చెందిన 76 మంది న్యాయమూర్తులు కొత్త రాజ్యాంగం ప్రకారం ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయ నాయకులందరినీ ఖైదు చేశారు. ఈ చర్య తర్వాత పాకిస్తాన్ అంతటా ఆందోళనలు రాజుకోవడంతో ముషార్రఫ్ తన ప్రభుత్వాన్ని తానే రద్దు చేసుకుని నేరుగా పాలించడం మొదలుపెట్టారు. అటు సైనిక దళాల చీఫ్‌గా, ఇటు దేశాధ్యక్షుడిగా జోడు పదవుల్లో ఉన్న ముషార్రఫ్‌పై ఏదో ఒక పదవే ఉంచుకోవాలంటూ సైన్యం నుంచి కూడా ఒత్తిళ్లు రావడంతో సైనిక దళాల పదవికి స్వస్తి చెప్పి అధ్యక్షుడిగా కొనసాగాలని నిర్ణయించు కున్నారు. తనకు ఆప్తుడైన ఐఎస్ఐ చీఫ్ కయానీకి సైనిక దళాల చీఫ్ పదవి కట్టబెట్టారు. రాజ్యాం గాన్ని రద్దు చేసిన కేసులోనే ఇప్పుడు ముషార్రఫ్‌కు ఇప్పుడు మరణశిక్ష పడింది.

తనను ఏరి కోరి తెచ్చుకున్న నవాజ్ షరీఫ్‌కు తాను ఎసరు పెట్టినట్టే... తాను తెచ్చుకున్న జనరల్ కయానీ తనకే ఎదురు తిరగడం ముషార్రఫ్‌కు అనుభవంలోకొచ్చింది. 2008 ఫిబ్రవరిలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ముషార్రఫ్ కనుసన్నల్లో పనిచేసే పీఎంఎల్–క్యూ తుడిచిపెట్టుకుపోగా పీపీపీ ఘనవిజయం సాధించింది. తన టక్కుటమార విద్యలన్నీ విఫలమయ్యాయని గ్రహించాక ఇక అయిష్టంగా ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. పౌర ప్రభుత్వాలను కబ్జా చేసి, అధికారాన్ని హస్తగతం చేసుకున్న సైనికాధికారుల్లో ముషార్రఫ్ మొదటివారేమీ కాదు. ఆ దేశం దాదాపు 35 ఏళ్లపాటు సైనిక పదఘట్టనల్లోనే బతుకీడ్చింది. తమ పాలనలోని అవినీతి జనం కళ్లబడకుండా, పేదరికం, అవిద్య, నిరుద్యోగం, అధిక ధరలు వంటి అంశాల జోలికి వారు పోకుండా ఇస్లామిక్ సిద్ధాంతం పేరు చెప్పి ప్రజలను బుజ్జగించడం సైనిక పాలకులు అనుసరిస్తూ వచ్చిన వ్యూహం. ఆ తానులో ముక్కగా ముషార్రఫ్ కూడా దాన్నే కొనసాగించారు. అటు అఫ్ఘాన్‌లో తాలిబన్‌లకు బహి రంగంగా సహాయసహకారాలిస్తూ, భారత్‌లో ఉగ్రవాద దాడులు చేసేందుకు ప్రోత్సహించారు. పాక్‌లో తన చెప్పుచేతల్లో ఉండే ప్రభుత్వం అవసరం గనుక అమెరికా ఈ కుట్రలన్నిటికీ సహక రిస్తూ వచ్చింది. 2001లో అమెరికాపై ఉగ్రవాదులు దాడులు చేశాక ఇదంతా మారక తప్పలేదు. ఆ తర్వాత చాటుమాటుగా ఉగ్రవాదులకు మద్దతు పలుకుతూ వచ్చారు. ఈ సంస్కృతిని ఇంకా పాక్ విడనాడలేదు.

ఇప్పుడు తీర్పు వెలువరించిన ప్రత్యేక కోర్టుకు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం చివరి నిమిషంలో అడ్డంకులు సృష్టించిన వైనాన్ని గమనిస్తే, ముషార్రఫ్‌ను కాపాడటానికి అది ఎన్ని పాట్లు పడిందో అర్థమవుతుంది. ఈ పనంతా మొదట్లో ముషార్రఫ్ చేసుకోవాల్సి వచ్చింది. 2013నాటి ఈ కేసు విచారణలో అడుగు ముందుకు పడకుండా ఎప్పటికప్పుడు ఆయన ఉన్నత న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూనే వచ్చారు. అవన్నీ వృథాయేనని అర్థమయ్యాక 2016లో ఆయన కొద్దిరోజుల్లో తిరిగొస్తానని నమ్మబలికి దేశం నుంచి నిష్క్రమించారు. ఈ మూడేళ్లూ చడీచప్పుడూ చేయని ఇమ్రాన్ సర్కార్ ఇక తీర్పు వెలువడటం తథ్యమని తెలిశాక ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించి ప్రత్యేక కోర్టు తీర్పునివ్వకుండా ఆపాలంటూ పిటిషన్ వేసింది. అలా నెలరోజులు గడిచిపోయింది. ఆ అడ్డంకి కూడా అధిగమించి ఈ నెల 17న తీర్పునిస్తామని ఈ నెల 5న ప్రకటించాక ముషార్రఫ్‌తో పాటు అప్పటి ప్రధాని షౌకత్ అజీజ్, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ హమీద్ దోగర్, అప్పటి న్యాయమంత్రి జహీద్ హమీద్‌లను కూడా నిందితులుగా చేర్చాలంటూ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. వీరందరినీ చేర్చి కొత్తగా విచారించాలని కోరింది. ఇన్నేళ్లపాటు ఏం చేశారంటూ ప్రభుత్వాన్ని మందలించి, పిటిషన్‌ను కొట్టేసి ప్రత్యేక కోర్టు తాజా తీర్పు వెలువరించింది. తుది అప్పీల్‌పై నిర్ణయం వెలువడే వరకూ ఈ తీర్పును ఎటూ సుప్రీంకోర్టు నిలిపివేస్తుంది. ఆ నిర్ణయం ఇప్పట్లో రాదనే చెప్పాలి. అక్కడ కూడా చుక్కెదురయ్యాక దేశాధ్యక్షుడు క్షమాభిక్ష పెట్టొచ్చు. కానీ ఆ దేశ రాజకీయాలపై ఇంకా సైన్యం పట్టుసడలని వర్తమానంలో ఈ తీర్పు ప్రతీ కాత్మకమైనదే అయినా ఎన్నదగినది. దీని పర్యవసానాలెలా ఉంటాయో ముందుముందు చూడాలి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి బ.సప్తమి రా.12.32 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం పుబ్బ రా.1.32 వరకు తదుపరి, ఉత్తర, వర్జ్యం ఉ.10.36 నుంచి 12.05 వరకు దుర్ముహూర్తం ప.11.33 నుంచి 12.16 వరకు అమృతఘడియలు... రా.7.33 నుంచి 9.01 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 5.25
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# నికార్సయిన చట్టం 'దిశ'

ఏళ్లూ పూళ్లుగా తీర్పులు వాయిదా పడుతూ పోవడం వల్ల అత్యాచార బాధిత కుటుంబాల ఆవేదన చల్లారదు. అందుకే తీర్పు ఆలస్యమైన కొద్దీ న్యాయం ఆలస్యమైనట్టే కాదు, న్యాయాన్నే బాధితులకు దూరం చేసినట్లుగా భావించాలని రాజ్యాంగమూ, న్యాయ వ్యవస్థ సూత్రాలు కూడా నిర్ద్వంద్వంగా చెప్పడమూ జరిగింది. కనుకనే ఆలస్యమైన న్యాయం అక్కరకు రాని న్యాయంగా భావించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల దిశ దారుణ హత్యోదంతం పట్ల చలించి, దేశంలో అలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకూడదని ప్రకటించారు. దానికి కొనసాగింపుగా అత్యాచార ఘటనల నివారణకు రెండు ప్రత్యేక బిల్లులను, కేంద్ర నేర నిరోధక చట్టాలకు రెండు సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం లభించింది.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రాజకీయాలకు, నైతిక సూత్రాలకు, నైతికతకూ ఎలాంటి పొత్తూ పొంతనా కుదరదన్నది ఇటాలియన్ చాణక్యుడు మాకియవెల్లీ సూత్రం! కానీ ఆ సూత్రీకరణ అబద్ధమనీ, నైతిక సూత్రాలకు, నైతి కతకు బద్ధమై దేశ దిశాగతిని నిర్ణయించి ఆచరించే రాజకీయమే సిసలైన రాజకీయం. అలాంటి పాలకుడే నిజమైన ప్రజాసేవకుడని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. ప్రజా బాహుళ్యాన్ని వేధిస్తున్న అనేక సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆగమేఘాలపై తీసుకుంటున్న నిర్ణయాలు, వాటిని ఆచరిస్తున్న తీరు ఇందుకు నిదర్శనం. దేశంలో రాజ్యాంగ బద్ధత పేరిట గడచిన డెబ్బైఏళ్లలో వివిధ ప్రభుత్వాలు క్రిమినల్, పౌర సమస్యలపై రకరకాల చట్టాలు తీసుకొచ్చాయి. వాటికి విలువైన భాష్యాలను సుప్రీంకోర్టు పొందుపర్చి, అమలుకు సిద్ధం కావడమూ మనకు తెలుసు. కానీ పెక్కు సందర్భాల్లో నాటి పెట్టుబడి దోపిడీ వ్యవస్థలో వివిధ స్థాయిల్లో అధికార పీఠాలు అలంకరించిన రాజకీయ పాలక శక్తులు తమ లేదా తమ అనుయాయుల, వందిమాగధుల స్వార్థపూ రిత ప్రయోజనాల దృష్ట్యా వేలు, లక్షలాది మంది బాధిత కుటుం బాలకు న్యాయం అనేది పెక్కు సందర్భాలలో ఆలస్యం కావడమో లేదా దూరం కావడమో జరుగుతోంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి బాబ్డే అన్యాయాలకు గురైనవారు, అత్యాచారాలకు, హత్య లకు బలైనవారి కుటుంబాలు సత్వర న్యాయాన్ని అప్పటికప్పుడు ఆశించలేరని న్యాయశాస్త్రపరిశీలనా పరిధుల దృష్ట్యా చెప్పి ఉండ వచ్చు. కానీ ఏళ్లూ పూళ్లుగా తీర్పులు వాయిదా పడుతూ పోవడం వల్ల బాధిత కుటుంబాల ఆవేదన చల్లారదు. అందుకే రాజ్యాంగమూ, న్యాయ వ్యవస్థ సూత్రాలు కూడా తీర్పు ఆలస్యమైన కొద్దీ న్యాయం ఆలస్యమైనట్టే కాదు, న్యాయాన్నే బాధితులకు దూరం చేసినట్లుగా భావించాలని నిర్ద్వంద్వంగా చెప్పడమూ జరిగింది. అందుకే అత్యు న్నత న్యాయసూత్రాలు ఆధారంగా నిర్దేశించిన ఆలస్యమైన న్యాయం అక్కరకు రాని న్యాయంగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల దిశ దారుణ హత్యోదంతంపట్ల చలించి, ఇలాంటి ఘటనలు ఇకమీదట ఎక్కడా పునరావృతం కాకూడదని సంకల్పించారు. ఆ వెంటనే ఏపీ శాసనసభ ఆమోదానికి అత్యాచార ఘటనల నివారణకు రెండు ప్రత్యేక బిల్లులను ప్రవేశపెట్టారు. అలాగే కేంద్ర నేర నిరోధక చట్టాలకు రెండు సవరణ బిల్లులను చట్టాలుగా ప్రవేశపెట్టి ఆమోదించాల్సి వచ్చింది.

ఈ బిల్లులకు దేశవ్యాపితంగా మద్దతు రావడానికి కారణం శిక్షా కాల పరిమితిని బాగా తగ్గించి, బాధితులకు తక్షణ న్యాయం సకాలంలో దక్కేలా చూడటం, అత్యాచారాలకు తలపడే వారిని నిరోధించగల న్యాయ యంత్రాంగాన్ని, పోలీసు యంత్రాంగాన్ని జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేసి సత్వర శిక్షలకు రంగాన్ని సిద్ధం చేయడం. ఇప్పటికే ఢిల్లీ, ఒడిశా ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ చొరవను హర్షించాయి. తెలంగాణలో దిశ హత్యోదంతం తర్వాత ఏపీతో సహా ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి ఘటనలు కొనసాగడంవల్ల దిశ చట్టానికి ప్రాంతీయ హద్దులు చెరిగిపోయాయి. ఈ విస్తృతికి ప్రధాన కారణం.. దిశ ఘటనకు ఏమాత్రం తీసిపోని 'నిర్భయ' దారుణో దంతం 2012లో జరిగి నేటికి ఏడేళ్లయినా.. విచారణ ముగిసి, మరణ శిక్షలు పడినా, ఈరోజుదాకా కోర్టు తీర్పు ఆచరణలో అమలులోకి రాకపోవడమే. కాగా, ఆంధ్రప్రదేశ్ తాజా చట్టం మహిళలు, చిన్నా రులపట్ల వేధింపులు, అత్యాచార ఘటనలను తక్షణం పరిగణనలోకి తీసుకుని, అంత వేగంగానూ వాటిని విచారించి, శిక్షలు విధించేం దుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు జిల్లా స్థాయిలో ఎక్కడి కక్కడ తక్షణం ఏర్పాటు చేసి న్యాయం చేకూర్చడం ఆంధ్రప్రదేశ్ నూతన చట్టం ప్రత్యేకత.

### రెండో మాట



అయితే ఈ ప్రక్రియ అంతా రాజ్యాంగంలోని 21వ అధికరణ ప్రకారమే జరిగిందా అన్న ప్రశ్నకు ఆ అధికరణలో సమాధానం ఉంది: 'ఏ పౌరుడిని జీవించే హక్కుకు, వ్యక్తిగత స్వేచ్ఛకు దూరం చేయకూడదు' అని ఆ అధికరణం చెబుతున్నా ఆ వెంటనే అదే అధిక రణలో 'చట్టం నిర్దేశించిన విధి విధానాలకు లోబడి మాత్రమే' అని కూడా ఉన్నందున, జగన్ ప్రభుత్వం ఆ గేటు దాటకుండానే దేశ దిశా గతికి త్వరితగతిన 'దిశ చట్టం' రూపొందించింది. అలాగని ఆంధ్ర ప్రదేశ్ చట్టం, వలస పాలనావశేషంగా మిగిలిపోయిన చట్టబద్ధ విచారణతో నిమిత్తం లేకుండా పోలీసులు జరిపే బూటకపు ఎన్ కౌంటర్ల (ఫేక్)ను మాత్రం అనుమతించదు. ఎందుకంటే, 'ప్రకాష్ కడం వర్సెస్ రాంప్రసాద్ విశ్వనాథ్ గుప్తా' కేసులో సుప్రీంకోర్టు 'ఎదురు కాల్పుల్లో చనిపోయారన్న పేరిట పోలీసులు జరిపే బూట కపు ఎన్‌కౌంటర్లు పచ్చి హత్యలు తప్ప మరొకటి కావ'ని అలాంటి బూటకపు హత్యలకు పాల్పడే పోలీసులకు మరణశిక్షలు విధించా లని, అలాంటి వాటిని 'అసాధారణ కేసులలో అతి అసాధారణం'గా పేర్కొనాలని తీర్పు చెప్పింది. అంతేగాదు, గతంలో అలహాబాద్ హైకోర్టు విశిష్ట న్యాయమూర్తిగా పేరొందిన జస్టిస్ ఎ.ఎన్.ముల్లా భారతదేశంలోని పోలీసులంత అరాచక శక్తులు, నేరస్తులు మరెవరూ ఉండరని చెప్పారు. ఆ మాటకొస్తే హైదరాబాద్‌లో 'దిశ ఘోర హత్యా ఘటన' సందర్భంలో కూడా నలుగురు నిందితులను విచారణకు పంపకుండా పోలీసు కస్టడీలో ఉన్న నిందితుల్ని హతమార్చడం కూడా 'ఫేక్ ఎన్‌కౌంటర్'గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ భావించారు (8.12.2019). అంతేగాదు, వ్యవస్థ ఇంత అధ్వానమైన దశకు చేరుకోవడానికి కారణం ఇటు పోలీసు శాఖల్లోనూ, అటు న్యాయ వ్యవస్థలోనూ తగినంత సిబ్బంది లేకపోవడమేనని ఇదే అనేక అరాచకాలకు కారణమవుతోందని 'ఇండియా జస్టిస్ రిపోర్ట్' (2019) తాజా నివేదిక స్పష్టం చేస్తోంది.

ఇక నేర న్యాయ వ్యవస్థపై వెచ్చించే బడ్జెట్ కేటాయింపులు హీనాతిహీనం. ఉదాహరణకు 2017 దాకా పోలీసింగ్ నిర్వహణకు అఖిల భారత స్థాయిలో తలసరి వెచ్చిస్తున్న ఖర్చు కేవలం రూ. 820. సరిగ్గా ఈ అస్తు బిస్తు పరిస్థితుల్లోనే నేర న్యాయ వ్యవస్థ క్రమంగా పోలీసు న్యాయ వ్యవస్థగా దిగజారుతోందని 'సెంటర్ ఫర్ క్రిమి నాలజీ అండ్ జస్టిస్' సంస్థకు చెందిన 'ప్రయాస్' ప్రాజెక్టు డైరెక్టర్ అయిన డాక్టర్ విజయ రాఘవన్ అభిప్రాయపడుతున్నారు. ఈ దారుణ పరిస్థితుల మధ్యనే.. దూసుకువచ్చిన జగన్ ప్రభుత్వ 'దిశ చట్టం' 'నిర్భయ' కేసు నిందితులపై శిక్ష ఖరారై అమలు జరపడంలో ఏడేళ్ల తర్వాతనైనా ఇప్పటికి సుప్రీంకోర్టు, ప్రభుత్వమూ వెంటనే కదలబారడానికి కారణమైందని మరవరాదు. అంతేగాదు, ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన యువతి దారుణ లైంగిక హత్యోదం తంలో కూడా బీజేపీ ఎమ్మెల్యేకి శిక్ష ఆగమేఘాలపై ఖరారు కావడానికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'దిశ చట్టమే' ఉద్దీపన శక్తిగా దివిటీ పట్టింది. ఈ సందర్భంగా మన వ్యవస్థలో ఉన్న మౌలిక సత్యాలను విజయ రాఘవన్ దాచుకోకుండా ఇలా వ్యక్తం చేశారు: ''రానురానూ మన దేశంలోని సామాజిక వ్యవస్థా చట్రం కనుసన్నల్లో సామాన్య ప్రజలు సమాజంలో వర్గ, కుల, స్త్రీ పురుష వివక్ష, అసమానతల కారణంగా కునారిల్లిపోతున్నారు. ఇలా మన స్త్రీ–పురుషుల మధ్య వివక్ష చూపుతూ అసమ దృష్టితో వ్యవహరించినంత కాలం, స్త్రీలను భౌతికంగా కేవలం లైంగిక దృష్టితో చూసి, వేధించి వివక్షతో జరిపే హింసాకాండ ఒక అంటురోగంగా మనల్ని పీడిస్తూనే ఉంటుంది. కుల, వర్గ, అసమానతలు గొడ్డలి పెట్టుగా మారినందున హింసా ప్రవృత్తి మరింత పాశవిక రూపం దాల్చుతుంది. ఈ బెడదను తప్పించుకోవాలంటే శాశ్వత పరిష్కారంగా మరింత ఆదర్శవంత మైన సమ సమాజ వ్యవస్థను నిర్మించుకోగల సామాజిక సమీకరణ వైపుగా దృష్టి పెట్టాలి'' అని హితవు పలుకుతున్నారు. అందుకే, అలాంటి ఉత్తమ సమాజ వ్యవస్థావతరణ వైపుగా పరిపూర్ణ బ్రతు కిచ్చే దిశగా కవి కుమారుడు సరికొత్త గీతా రచనను ఉద్దీపనగా అందించాడు:

*''ఓ! కూలీ, మాలీ, రైతూ*
*గుడిసెలలో బతికేవాడా*
*గంజినీళ్లతోనే కాలం గడిపేవాడా*
*ఆకలికన్నూ! మానవుడా,*
*తిరగబడేవాడా, ప్రశ్నించేవాడా*
*అన్యాయాలకు ఆహుతి కావడానికైనా జంకనివాడా*
*ఖైదీ, రౌడీ, ఖూనీకోర్, బేబీ– మానవుడా, ఓ మానవుడా!''*

*వాడే! వాడే! ఆ 'జగన్నా'థ రథచక్రాల కోసం ఎదురుచూస్తున్న మానవుడు!!*

abkprasad2006@yahoo.co.in

### సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### క్లాస్



"బెంగళూర్‌లోని మౌంట్ కర్మెల్ కాలేజీలోని టీచర్లు జామియా మిలియాకు మద్దతుగా నిరసనలు చేపట్టవద్దని తమ విద్యార్థులను కోరడమే కాదు, టౌన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావద్దని, సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి పోస్టులు చేయొద్దని చెప్పినట్టు తెలిసింది. స్థానిక ఏసీపీ ఆదేశానుసారం ఇలా చెప్పినట్టు భావిస్తున్నారు. నిరసన కోసం ఎవరినీ అనుమతించేది లేదు. నిరసనకు అనుమతి లేదని, విద్యార్థులెవరైనా పాల్గొన్నట్టయితే జైలుకు పంపుతామని ఏసీపీ చెప్పారని కాలేజీ వర్గాలు అంటున్నాయి"

– పూజ ప్రసన్న, జర్నలిస్ట్

### విద్యుత్



"గత మూడు నెలల్లో మన దేశం 30 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను ఆదా చేసింది. అయితే, దీనికి కారణం మాత్రం ప్రజలందరూ ఎల్‌ఈడీ బల్బుల వాడటం మొదలుపెట్టినందుకు కాదు, నిర్ణీత సమయాల్లో ఆయా రాష్ట్రాలలో ఇంటర్నెట్ సేవలను రద్దు చేయడం ద్వారానే ఇది సాధ్యమైంది"

– అతుల్ ఖత్రీ, కమెడియన్

### హక్కులు



"ఈరోజు దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితి ఆమోద యోగ్యం కాదు. ఇప్పుడు జరుగుతున్న ఆందోళనలు గొంతెత్తడానికి మీకున్న హక్కును హరించడం గురించి. శాంతియుతంగా నిరసన తెలపడం గురించి. ఇది విశ్వాసాల గురించో, మతం గురించో, మీ ప్రయోజనాలను కాపాడుకోవటం గురించో కాదు. ఇది మీకున్న అధికారం గురించి"

– లిసా రే, రచయిత్రి

### విడదీత



"మా తండ్రి ముస్లిం, తల్లి హిందూ. మతం పేరిట వాళ్లు మమ్మల్ని ఎలా విడదీస్తారు? అని నటుడు మహ్మద్ జీషాన్ అయూబ్ తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. జామియా, ఏఎంయూ విద్యార్థులకు ఆయన తన సంఘీభావం తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేకమైన, విభజనతత్వంతో కూడిన సీఏబీ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా నిలబడాలని ఆయన కోరారు"

– ఉమర్ ఖలీద్, సామాజిక కార్యకర్త

### రెచ్చగొట్టడం



"ప్రధాని మోదీ పాక్ ప్రస్తావన వదలడం లేదు. కానీ, ఇప్పుడు మాట్లాడవలసింది మన దేశం గురించి. ఎప్పుడూ పాక్‌పైనే ఎందుకు దృష్టి పెడతారు? పౌరసత్వం కోసం మతపర వివక్షను చూపడం రాజ్యాంగానికి వ్యతిరేకం. మోదీ తరచూ అమిత్ షా ఏం చెబుతున్నారో వింటూ ఉండాలి. ఆయన వివక్షతో కూడిన పౌరసత్వ బిల్లుకు, దాన్ని అమలు చేసే ఎన్నార్సీకీ మధ్య ఒక సంబంధాన్ని ఏర్పరుస్తున్నారు. దేశంలోని ప్రజలంతా దాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు"

– సీతారాం ఏచూరి, సీపీఎం నేత

### అద్భుతం



"జామియా దగ్గర నిరసనకారులకు చుట్టుపక్కల వారు ఆహారం అందించడం అద్భుతం. ఇండియా గేట్ దగ్గర కూడా పాత ఢిల్లీకి చెందినవారు ఆహారం తీసుకొచ్చి ఇచ్చారు. మరోచోట కొందరు సిక్కులు అందరికీ టీ అందజేశారు"

– ఆదిత్యా మీనన్, జర్నలిస్ట్

# తండ్రి బాటలో తనయుడు

అభిప్రాయం



డా. కాలువ మల్లయ్య

తెలుగు రాష్ట్రాలను స్వాతంత్ర్యానంతరం 14 మంది సీఎంలుగా పాలించారు. వీరిలో అత్యుత్తమ పాలన అందించిన సీఎంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డినే పేర్కొనక తప్పదు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో, వాగ్దానాలను నెరవేర్చడంలో వైఎస్సార్‌దే ప్రథమస్థానం. తెలుగు రాష్ట్రాల్లో మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో వైఎస్సార్‌దే అగ్రస్థానం. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తన ప్రాంతీయతను, గ్రామీణతను, దేశీయతను వదిలి నేల విడిచి సాము చేస్తున్నవేళ.. సుదీర్ఘ పాదయాత్రను చేశారు వైఎస్సార్. అనంతరం 2004 ఎన్నికల్లో అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టిన వైఎస్సార్ అంతవరకు విస్మరణకు గురైన అన్ని రంగాలపై దృష్టి కేంద్రీకరించారు.

ఉమ్మడి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను వ్యవసాయక్షేత్రాలుగా మార్చడానికి అనేక నీటి పారుదల ప్రాజెక్టులను ప్రారంభించారు. పనికి ఉపాధి పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఏడాదికి రెండువందల పై చిలుకు రోజులకు ఆదాయ గ్యారంటీనిచ్చారు. పావలా వడ్డీకి రుణాలిచ్చి రైతులను, వృద్ధాప్య పెన్షన్‌తో వృద్ధులను ఆదుకున్నారు. తెలంగాణలో ప్రతి జిల్లాకు విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఏటా డీఎస్సీ పెట్టి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ, 108 సౌకర్యం ద్వారా పేదల ముంగిట్లోకి కార్పొరేట్ వైద్యం అందేట్టు చేశారు. ఈ పథకం ద్వారా లక్షలాది ప్రాణాలు నిలబడ్డాయి.

ఉమ్మడి రాష్ట్రంలో విద్యార్థుల, రైతుల ఆత్మహత్యలు, ఫ్యాక్షనిజం హత్యలు వైఎస్సార్ తీసుకున్న సాహసోపేత చర్యల వల్లనే తగ్గుముఖం పట్టాయి. విద్యా, వైద్య, వ్యవసాయరంగాలలో ఆయన చేసిన సంస్కరణలు, తీసుకున్న చర్యలు అగ్రశ్రేణి నాయకుడిగా నిలబెట్టాయి. కనీవినీ ఎరుగని స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి జన



హృదయాలను గెలుచుకున్న వైఎస్సార్ అకాల మరణం ప్రజల్ని దుఃఖసాగరంలో ముంచింది.

తండ్రి బాటను మరింత విశాలం చేస్తూ వైఎస్ జగన్ తొమ్మిదేళ్లు మడమతిప్పని పోరాటం చేసి విజయుడయ్యారు. ఎన్ని కష్టాలొచ్చినా ఒంటరిగానే ఎదుర్కొని రాజకీయ పోరాటం చేశారు. వేల కిలోమీటర్ల పాదయాత్రనూ చేశారు. ఆచరణీయమైన మేనిఫెస్టోతో ఎన్నికల బరిలోకి దిగారు. తాను గెలవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఘనవిజయం సాధించాడు. ఈ ఐదారు నెలలుగా జగన్ ఏపీ సీఎంగా చేస్తున్న పనులు, తీసుకుంటున్న నిర్ణయాలు తన తండ్రి వైఎస్సార్ ఆశయాలను మరింత విశాలం చేస్తున్నాయి. గ్రామ వాలంటీర్లను నియమించడం, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడంతో పాటు ఉద్యోగ కల్పనకు పాల్పడటం వైఎస్ జగన్ చేస్తున్న ప్రజోపయోగ పనుల్లో ముఖ్యమైనవి. ఏపీఎస్సార్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య కోసం మెజారిటీ బహుజనులు కోరుకుంటున్న ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న సాహసోపేత చర్యల్లో ముఖ్యమైనవి. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచినా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలోనూ, ఆరోగ్యశ్రీలాంటి అద్భుత పథకాలను అందరికీ వర్తింపజేయడంలోనూ, నవరత్నాలను ప్రోత్సహించడంలోనూ జగన్ ప్రభుత్వం చూపుతున్న చొరవ అద్వితీయం. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వానికి ఒక సంవత్సరం, కనీసం ఆరు నెలల కాలమైనా ఇవ్వకుండా, వేచిచూడకుండా ప్రభుత్వం ఏర్పడిన తెల్లవారి నుంచే పసలేని విమర్శలు చేస్తూ తాము పలుచబడుతూ వైఎస్ జగన్ మరింత బలపడటానికి తోడ్పడుతున్నాయి ప్రతిపక్షాలు. ఏదేమైనా తండ్రి బాటను సువిశాలంచేస్తూ, బహుజనులకు అండదండగా ఉంటూ తెలుగుజాతి గౌరవాన్ని, ఔన్నత్యాన్ని సమున్నతంగా నిలబెడుతున్న యువకిశోరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

వ్యాసకర్త ప్రముఖ సామాజిక రచయిత
మొబైల్ : 91829 18567

# టీఎస్ సర్వీస్ కమిషన్‌కు ఐదేళ్లు

సందర్భం



జూలూరు గౌరీశంకర్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడి నేటికి అయిదేళ్లు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ తొలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనేక ఎదురీతలకు నిలిచి ఒక శక్తివంతమైన సంస్థగా నిలిచింది. గతంలో సర్వీస్ కమిషన్ అంటే వున్న దురభిప్రాయాన్ని తుడిచివేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్రానికి అత్యవసరమైన ఉద్యోగాలను ఎంపిక చేసే పనిని సర్వీస్ కమిషన్‌కి అప్పగించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో అన్ని వ్యవస్థల నిర్మాణంలాగే సర్వీస్ కమిషన్ తనను తాను నిర్మించుకోవడానికి ఆరు నెలల కాలంపట్టింది. కొత్తగా సిలబస్‌ను రూపొందించుకుంది.

ఎంపిక చేసే పాతవిధానానికి మారుగా కొత్త విధానాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టింది. వ్యవస్థీకృతమైన సమస్యలను ఎదుర్కొంటూనే ముందుకుసాగుతూ ఓ కొత్త నియామకాల శకానికి చైర్మన్ ఘంటా చక్రపాణి నేతృత్వంలో శ్రీకారం చుట్టారు. తెలంగాణ చరిత్ర సంస్కృతిని, తెలంగాణ మట్టి ఆత్మను చదువుకునే పనిని ఈ తరం యువత ముందుకు తీసుకువచ్చారు.

గడిచిన 70 ఏళ్ల తెలంగాణ చరిత్రలో ఏనాడూ లేని విధంగా ఐదేళ్లలో 39 వేల నోటిఫికేషన్లు విడుదల చేసి 30 వేల నియామకాలను చేపట్టారు. ఇవే కాక ప్రభుత్వంలోని పలుశాఖల్లో నియామకాల కోసం 165 రకాల పేపర్లను సెట్ చేశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షల నిర్వహణను తొలిసారిగా తెలంగాణలో ప్రవేశపెట్టారు. దీంతో నియామకాల ముఖచిత్రమే మారిపోయింది. దరఖాస్తు చేసుకోవడం దగ్గర్నుంచి ఉద్యోగపట్టా పొందే వరకు అభ్యర్థే తనకు తాను నూతన టెక్నాలజీతో దరఖాస్తు చేసుకోవడం, ఉద్యోగం పొందడం అన్నది కొత్తటెక్నాలజీతో మొదలయ్యింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు 25 లక్షల మంది విద్యార్థులు తమ ఆధార్‌కార్డులతో లింక్



చేసుకొని రికార్డు చేసుకున్నారు. 16 రాష్ట్రాలకు చెందిన సర్వీస్ కమిషన్లు మన దగ్గరకు వచ్చి టెక్నాలజీతో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించే పద్ధతిని తెలుసుకొని అభినందించాయి.

తెలంగాణ రాష్ట్ర తొలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ 36,602 ఉద్యోగనియామకాలకు పరీక్షలు నిర్వహించి సుమారు 30 వేల పైచిలుకు పోస్టులకు నియామకాలు చేపట్టింది. ప్రధానంగా నీటిపారుదల, విద్య, వైద్య, వ్యవసాయ, అటవీ రంగాలకు చెందిన ఉద్యోగాలకు పెద్ద ఎత్తున నియామకం జరిగింది. ఇప్పటికే సర్వీస్ కమిషన్‌పై 15 వందలకు పైగా కేసులు పెట్టారు. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటూనే గడిచిన ఐదేళ్ళకాలంలో ఒక్క చిన్న అవినీతి ఆరోపణకూడా లేకుండా సర్వీస్ కమిషన్ రథచక్రాలను చక్రపాణి ముందుకు నడిపించారు. ఇంతకన్నా ఏంకావాలి? దక్షతగల ఐఏఎస్ వాణీప్రసాద్, కమిషన్ సభ్యులు విఠల్, కృష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రావతి, ప్రొఫెసర్లు సాయిలు, ఖాద్రీలతో కూడిన బృందం చక్రపాణికి, కమిషన్‌కి వెన్నెముకగా నిలిచారు. ఒకనాడు సర్వీస్ కమిషన్‌లో చేతులు తడిపితే ఉద్యోగాలొస్తాయనే అపవాదు ఉండేది. దాన్ని నామరూపాలు లేకుండా తీర్చిదిద్దడం మామూలు విషయం కాదు.

చక్రపాణి అవినీతికి ఆస్కారం లేని వ్యవస్థకు రూపకల్పన చేసి సర్వీస్ కమిషన్‌ను రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దారు. ఇంతటి ఘనతకు కారణమైన చక్రపాణికి హ్యాట్సాఫ్. సర్వీస్‌కమిషన్ దరిదాపుల్లోకి అవినీతిని రానీయకుండా చేసి తెలంగాణ కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారని, పోటీపరీక్షలో పాల్గొని ఉద్యోగం రాని ఒక నిరుద్యోగి సగర్వంగా ఒక మెసేజ్‌ని పంపారంటే అంతకంటే ఏం కావాలి? తెలంగాణ రాష్ట్రంలో బీడుభూముల దాహార్తి తీర్చే కాళేశ్వరంలాంటి భగీరథ నీటి ప్రాజెక్టులే కాకుండా అవినీతికి ఆస్కారంలేని సర్వీస్ కమిషన్ కొలువుల ప్రాజెక్టు కూడా నిర్మాణం కావడం సంతోషకరం.

వ్యాసకర్త ప్రముఖ సామాజిక రచయిత
మొబైల్: 94401 69896

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

గేమ్ ఛేంజర్స్

# ఆశలు ఉన్నవాళ్లు

కాళ్లు లేవు. కాలినడకన వస్తాం అని మొక్కుకోకూడదా? వేళ్లు లేవు. వీణపై స్వరాలను పలికించాలన్న తపన ఉండ కూడదా? మాట లేదు. ప్రతిధ్వనించేలా నినదించాలని ఆవేశపడకూడదా? వినికిడి లేదు. విశ్వాంతరాళ హోరుకు విష్ణుమూర్తిలా చెవి వొగ్గకూడదా? చూపు లేదు. సిక్సర్‌లు కొట్టాలని, క్యాచ్‌లు పట్టేయాలని ఉత్సాహపడకూడదా?

● మాధవ్ శింగరాజు

బ్రియాన్ లారా వెస్టిండీస్ క్రికెటర్. ప్రపంచ క్రికెట్ చరిత్రను తూకం వేస్తే ఆ తూగే బరువులో ఆయన కాస్త ఎక్కువగానే ఉంటారు. ఐదడుగులా ఎనిమిది అంగుళాల ఎత్తు ఉన్నందువల్ల, ర్యాంకింగ్‌లు– రికార్డులు ఏవో ఉంటాయి ఈ క్రికెట్‌వాళ్లకు.. అవి సమృద్ధిగా ఉన్నందువల్ల, ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వెస్టిండీస్‌లో పర్యటిస్తూ అక్కడుండే లారాను వెతుక్కుంటూ వెళ్లి కలిసినందువల్ల, తన చిట్టచివరి వన్డే ఇంటర్నేషనల్‌లో ఆట అవుతున్నంతసేపూ ‘లారా.. లారా.. లారా..’ అని పిచ్‌లో ప్రకంపనలు రేపిన ఫ్యాన్స్ వైపు ఆటంతా అయ్యాక చేతులు చాస్తూ.. ‘డిడ్ ఐ ఎంటర్‌టైన్?’ అని అడిగినందు వల్లా.. క్రమంగా పెరుగుతూ వచ్చిన బరువు కావచ్చది. యాభై ఏళ్ల మనిషి. ఆరేళ్ల వయసున్నప్పటి నుంచి ఆడిన మనిషి. పన్నెండేళ్ల క్రితం రిటైర్ అయిన మనిషి. రిటైర్ అయినా బరువు ఏమాత్రం తగ్గని మనిషి.

బ్రియాన్ లారానే మనం ఇంకోలా చూద్దాం. ఆయనకు కళ్లు లేవు. పుట్టు గుడ్డి.

> అందరికీ ఇచ్చిన దానిని దేవుడు ఒకరికి ఇవ్వలేదని చెప్పి అందరికీ ఉన్నట్లు ఆ ఒకరికి ఆశలు లేకుండా పోతాయా? అన్నీ ఉండి ఆశలు లేనివాళ్ల దగ్గర లభించని స్ఫూర్తి.. ఏమీ లేకున్నా ఆశలు ఉన్న వాళ్ల దగ్గర దొరుకుతుందే.. అందుక్కదా మనం క్లీన్ బౌల్డ్ అవాల్సింది!

మాటలు మాట్లాడమని ‘క్రికెట్ అసోసియేషన్’ అడిగితే వచ్చాడు. పోటీలు సోమవారం మొదలయ్యాయి. ఫస్ట్ టైమ్ మన దగ్గర అంధ మహిళా క్రీడాకారులకు జాతీయస్థాయి



ఛాంపియన్స్ : ఢిల్లీ కెప్టెన్ అంకితా సింగ్‌తో బ్రియాన్ లారా (పక్కన) అంకిత టీమ్ మేట్ పూజ

అలా అని అనుకుందాం. పదకొండు మంది సంతానంలో ఒకడైన లారాను తండ్రి ఎన్ని కళ్లతోనూ ఎంతసేపో కనిపెట్టుని ఉండలేకపోయేవాడు. లారా పుట్టిన శాంటాక్రజ్‌లో లోకల్ స్కూల్ ఒకటి ఉంది. హార్వార్డ్ కోచింగ్ క్లినిక్. ఆ క్లినిక్.. ఆరేళ్ల వయసులోనే క్రికెట్ అంటే ఆసక్తి చూపినప్పటికీ కళ్లు లేని కారణంగా లారాను చేరదీసి, ముద్దు చేయలేకపోయేది. లారా తొలి బడి సెయింట్ జోసెఫ్స్ రోమన్ కేథలిక్ ప్రైమరీ ఆ పసివాడికి అడ్మిషన్ ఇవ్వలేకపోయేది. కళ్లు లేని వాళ్ల బడి కాదు అది. సెయింట్ జువాన్ సెకండరీ స్కూలు, ఫాతిమా కాలేజీ కూడా ముఖం చాటేసేవి.. ఒకవేళ లారా స్టిక్ సహాయంతో తడుముకుంటూ తడుముకుంటూనే అంతదూరం వచ్చాడని అనుకున్నా. క్రికెట్ కోచ్ హ్యారీ రామ్‌దాస్ అంటే కూడా ప్రపంచానికిప్పుడు పెద్దగా తెలియకపోయేది. అంధుడైన లారాను లెఫ్ట్‌హ్యాండెడ్ బ్యాట్స్‌మన్‌గా, రైట్ ఆర్మ్ లెగ్ బ్రేక్ బౌలర్‌గా చెక్కడానికి ఆయనకేం పట్టేది?! లారాకు కూడా కళ్లు లేకుండా పద్నాలుగేళ్ల వయసులో స్కూల్ బాయ్స్ లీగ్‌లో ఇన్నింగ్స్‌కి సగటున 126 పరుగులు చొప్పున 745 పరుగులు తియ్యడం ఒక ఊహ మాత్రమే అయ్యేది. సాకర్ అన్నా, టేబుల్ టెన్నిస్ అన్నా కూడా లారాకు ఇష్టం. చూపులేని కారణంగా ఆ ఇష్టాలనూ చంపుకుని ఎక్కడో బతుకుతూ ఉండేవాడు! ‘నాకే ఎందుకిలా చేశావ్ దుర్మార్గుడా!’ అని దేవుణ్ణి తిట్టుకుంటూ.. తలకొట్టుకుంటూ ఉండేవాడు.. ఎవర్ని తిడుతున్నదీ స్పృహ లేకుండా.

‘‘అవును నిజంగా అలానే ఉండేవాడిని’’ అన్నాడు ఇప్పుడు ఇండియాలోనే ఉన్న బ్రియాన్ లారా. ఢిల్లీలో బ్లైండ్ ఉమెన్ డొమెస్టిక్ నేషనల్ క్రికెట్ లీగ్ పోటీలకు ముందు రెండు పోటీలు జరగడం. ఏడు టీమ్‌లు తలపడుతున్నాయి. ఢిల్లీలోని సిరి ఫోర్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇవాళ ఫైనల్స్.

మాట్లాడ్డానికి ముందు ఢిల్లీ టీమ్ కెప్టెన్ అంకితాసింగ్‌ని, తక్కిన టీమ్‌లను, టీమ్ మేట్స్‌నీ కలిసి విష్ చేశాడు లారా. ‘‘ఈరోజు మీ మధ్య నేను ఉండటం అనే ఫీలింగ్ నాకు చాలా వండర్‌ఫుల్ అనిపిస్తోంది’’ అన్నాడు ఆ తర్వాత స్టేజ్ మీద. కొంచెం ఎమోషనల్ కూడా అయ్యాడు. ‘‘నా కెరియర్ మొత్తంలో నేనేవైతే సాధించగలిగానో అవన్నీ కూడా నాకేవైతే ఉన్నాయో వాటి వలన సాధ్యమైనవే. నేనొకవేళ నాకేవైతే ఉన్నాయో వాటికి నోచుకోకపోయి ఉంటే కనుక, నా ఆశలన్నిటినీ చంపుకుని ఏ చీకటి మూలనో కూర్చొని ఉండేవాడిని’’ అని ఒక్క క్షణం ఆగి.. ‘‘అయితే ఇప్పుడనిపిస్తోంది. అలా కూర్చొని ఉండేవాడిని కాదని. నేనూ స్కూలుకు వెళ్లాలనే అనుకునేవాడిని. నేనూ నేర్చుకోవాలనే అనుకునేవాడిని. నేనూ మంచి ఉద్యోగం చేయాలనే అనుకునేవాడిని. నేనూ ఆటలు ఆడాలనే అనుకునేవాడిని’’ అన్నాడు లారా! ఆ వెంటనే ‘‘దీజ్ లేడీస్ అండ్ దెయిర్ టోర్నమెంట్ జస్ట్ అప్రోచింగ్’’ అన్నాడు. అప్రోచింగ్ అంటే నాట్ కంపేరబుల్ అని. ఈ మాటతో మళ్లీ కొద్దిగా బరువు పెరిగాడు బ్రియాన్ లారా.

ఎలా ఆడతారు వీళ్లు క్రికెట్‌ని కళ్లు లేకుండా అనుకుంటాం? అసలు ఎలా ఆడాలనిపిస్తుంది వీళ్లకు క్రికెట్‌ని కళ్లు లేకుండా అనుకునేవాళ్లూ ఉండొచ్చు. ‘ఎలా ఆడతారు?’ అనే ప్రశ్నకు ఎక్కడైనా సమాచారం లభిస్తుంది. ‘ఎలా ఆడాలనిపిస్తుంది?’ అనే ప్రశ్నకు చూపుకు అందని సమాధానం మాత్రమే ఉంటుంది.



బ్యూటిప్

- చలికాలం చర్మం పొడిబారుతుంటుంది. కాబట్టి నిమ్మరసం, టొమాటో గుజ్జుతో కూడిన సిట్రస్ ఫేస్ ప్యాక్‌లు ఈ కాలంలో వాడకూడదు. శనగపిండిలో పచ్చి పాలు, మీగడ, పన్నీరు కలిపి ప్యాక్‌లు వేసుకోవచ్చు.
- స్నానానికి సబ్బుకు బదులు సున్నిపిండి వాడాలి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
18-12-2019

# వాట్సాప్ విజేతలు

వాట్సాప్‌లో దగ్గరివాళ్లంతా కలిసి ఒక గ్రూప్ క్రియేట్ చేసుకోవడం ఒక ఆత్మీయ బంధం. వాట్సాప్‌లో ఒక గ్రామం పేరుతో గ్రూప్ క్రియేట్ చేసుకుని అభివృద్ధి వివరాలను తెలియ చేసుకోవడం ఓ సామాజిక బంధం. అలాగే వాట్సాప్‌ను చక్కగా వినియోగించుకుని వ్యక్తిగత నైపుణ్యాలకు మార్కెటింగ్ కల్పించుకోవడం ఒక వ్యాపార బంధం. ఈ బంధంతో వ్యాపారవేత్తలుగా రాణిస్తున్న గృహిణులు ఎందరో ఉన్నారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం. వారి నుంచి స్ఫూర్తిని పొందుదాం.



భారతి
చీరలు, బ్లవుజులు



అభిలాష
మరాఠీ ఫుడ్



షణ్ముఖ ప్రియ
దుస్తులు



గుంజన్
హ్యాండిక్రాఫ్ట్స్



ప్రియాంక
ఫ్యాబ్రిక్ పెయింటింగ్



ప్రీతి
హెల్త్ ఫుడ్

నెల్లూరు పట్టణంలో చీరల షోరూమ్ నడుపుతున్న తుంగా భారతినే తీసుకోండి. ఆమె బిజినెస్ వాట్సాప్ ద్వారా చాలా వేగంగా జరిగిపోతోంది. ‘‘మొదట్లో నేను హాబీగా ఫ్రెండ్స్‌కు, బంధువులకు వాళ్లకు నప్పే విధంగా డ్రస్‌లు డిజైన్ చేయించి ఇచ్చేదాన్ని. నా పిల్లలు సెటిల్ అయిపోయిన తర్వాత రోజంతా ఖాళీ అనిపించేది. దాంతో రెండేళ్ల కిందట పూర్తి స్థాయిలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాను. ఇప్పుడు ‘విఆర్‌కే’ నుంచి ఫ్రాంచైజీ తీసుకున్నాను. నా కస్టమర్‌లు ఎక్కువమంది విదేశాల్లో ఉన్నారు. అందరం వాట్సాప్ గ్రూప్‌తో కనెక్ట్ అయి ఉన్నాం. కొత్త స్టాక్ వచ్చినప్పుడు ఆ రోజే ఫొటోలు, వీడియోలు వాట్సాప్‌లో షేర్ చేస్తే, తెల్లవారి నిద్ర లేచేసరికి ఆర్డర్‌లు రెడీగా ఉంటాయి. వాళ్ల సందేహాలు కూడా. వాటన్నింటికీ ఓ గంటలో మా టీమ్ రిప్లయ్ ఇచ్చేస్తుంది. ఆర్డర్‌లుగా వచ్చిన చీరలకు వర్క్ బ్లవుజ్ కూడా రెడీ చేయించి సోమవారం కొరియర్ చేస్తే గురువారానికి అమెరికాకు చేరిపోతాయి. ఆ వీకెండ్ పార్టీకి కట్టేసుకుంటారు. మొత్తం టాస్క్ పది రోజుల నుంచి రెండు వారాల్లో పూర్తయిపోతుంది’’ అని చెప్పారు భారతి.

## ఢిల్లీలో మరాఠా భోజనం

అభిలాష ఐదేళ్ల కిందట ఇంట్లో వంటలు చేసి ఢిల్లీలోని మరాఠీయులకు సప్లయ్ చేయడం మొదలు పెట్టాలనుకుంది. మెల్లిగా దాన్నే వ్యాపారంగా మలుచుకుంది. పెద్ద పెద్ద క్యూజిన్‌లు, కాంటినెంటల్ ఫుడ్ రెస్టారెంట్‌ల కాలంలో కూడా అభిలాష ఫుడ్ బిజినెస్ విస్తరించింది. వాట్సాప్ అనే లాంచింగ్ పాడ్ మీదనే తన వ్యాపారం సాగుతోందని చెప్పింది అభిలాష. ‘‘నేను గృహిణిగా ఉన్నప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే దాన్ని. చాలా మంది మహిళలు ఏదో ఒక అభిరుచితో ఉండడాన్ని గమనించాను. నేను ఖాళీగా రోజు గడిపేస్తున్నాననిపించింది. ఏదైనా చేద్దామంటే నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. నాకు వంట చేయడం ఇష్టం. కాబట్టి తెలిసిన పని, ఇష్టమైన పనిలోనే ప్రవేశించాలనుకుని ఓ రోజు నా కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వాళ్లందరికీ ‘సంప్రదాయ మార్వాడీ భోజనాన్ని వండుతాను’ అని మెసేజ్ పెట్టాను. ‘మాకు కావాలంటే మాక్కావాలంటూ..’ అని నేను ఊహించనంత రెస్పాన్స్ వచ్చింది. అలా మొదలైన నా భోజన వ్యాపారం ఇప్పుడు పది వాట్సాప్ గ్రూపులతో నడుస్తోంది. ఒక్కో గ్రూప్‌కి 250 మంది లెక్కన నా ఫుడ్ కస్టమర్లతో పది గ్రూపులున్నాయిప్పుడు. డెబ్బై శాతం వ్యాపారం వాట్సాప్ ఆర్డర్‌ల ద్వారానే సాగుతోంది. అన్నీ ‘టేక్ అవే’నే!

## ఇలానే మరికొందరు

షబ్రి హోమ్ డెకోర్ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్న గుంజన్‌ది కూడా ఇదే బాట. ఫేస్‌బుక్, వాట్సాప్‌లోనే వ్యాపారం జరుగుతోంది. వాట్సాప్ ద్వారా కస్టమర్ ప్రశ్నలకు బదులిస్తూ వారిని సమాధానపరచడం ద్వారా నిశ్శబ్దంగా జరిగిపోతోందని చెప్తోంది గుంజన్. పన్నెండేళ్ల పాటు ముంబయిలో అడ్వర్టైజ్‌మెంట్ ఫర్మ్‌లో పని చేసిన ఆమె ఇతర ఉద్యోగాలకంటే ఇదే బాగుందని చెప్పింది.

**సరిహద్దు దాటిన కళ** ప్రియాంక తన వస్త్ర వ్యాపారాన్ని వాట్సప్ యుగానికి ముందే మొదలు పెట్టింది. గర్భిణిగా ఉన్నప్పుడు ఆమెకు పూర్తి బెడ్ రెస్ట్ అవసరమైంది. రోజంతా నాలుగ్గోడల మధ్య ఉంటూ, ఏ పనీ చేయకుండా గడపడం ఆమెకు దుర్భరంగా తోచింది. చదువుకునే రోజుల్లో హాబీగా నేర్చుకున్న ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌నే ప్రవృత్తిగా మార్చుకుంది. పిల్లలతో పాటే ఆమె వ్యాపారమూ ఎదిగింది. పెయింటింగ్ చేయడానికి అనువుగా చీరల ప్యాటర్న్‌లు చేనేతకారులకు ఇచ్చి మరీ తయారు చేయించేది. ఇందుకోసం తరచూ ప్రయాణాలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు వాట్సప్ ద్వారా ప్యాటర్న్‌లు పంపించడంతో శ్రమ తగ్గిపోయింది. సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి. గుర్‌గావ్‌లోనే ఉంటూ బెంగాల్ నుంచి న్యూ జెర్సీ వరకు తన క్లయింట్లతోనూ, తనకు పని ఇస్తున్న చేనేతకారులతోనూ కాంటాక్ట్‌లో ఉంటోంది. షో రూమ్ ద్వారా జరిగే వ్యాపారం కంటే వాట్సప్ ఆర్డర్‌లు, విక్రయాలే ఎక్కువ అంటోంది ప్రియాంక.

‘యునిక్ త్రెడ్స్’ షణ్ముఖ ప్రియది కూడా వాట్సాప్ విజయమే. చంటి బిడ్డను చూసుకునే వాళ్లు లేక ఈ తమిళమ్మాయి ఉద్యోగం వదిలేయాల్సి వచ్చింది. జీవితాన్ని నిరుపయోగంగా గడుపుతున్నాననే భావన వేధించినంత కాలం వేధించిందామెను. పాపాయి పెద్దయిన తర్వాత ముప్పై వేలతో మొదలైన వస్త్ర వ్యాపారం ఇప్పుడు పదహారు వాట్సాప్ గ్రూపులతో నడుస్తోంది. హైదరాబాద్‌లో ఉంటున్న ప్రీతి సిన్హా అయితే బిడ్డ పుట్టినప్పుడు తాను పెరిగిన బరువు తగ్గడానికి అనుసరించిన మార్గంలోనే వ్యాపారాన్ని ఎంచుకుంది. ‘గ్రీన్ అండ్ మోర్’ పేరుతో ఫుడ్ బిజినెస్ మొదలు పెట్టింది. బరువు తగ్గడానికి, శక్తి పెరగడానికి డాక్టర్లు సూచించిన ఆహారాన్ని కస్టమర్ ఆరోగ్యానికి తగినట్లు వండి సప్లయ్ చేస్తోందీమె.

చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. మీలోనూ ఏదో చేయాలన్న తపన ఉంది. భారతి, అభిలాష, ప్రియాంక, గుంజన్, షణ్ముఖ ప్రియ, ప్రీతీ సిన్హా.. ఆ తర్వాతి పేరు మీదే ఎందుకు కాకూడదు?

– వాకా మంజులారెడ్డి

చెట్టు నీడ

# బలహీనుడు

ఫిలిష్తీయుల నుండి ఇశ్రాయేలీయులను విడిపించడానికి దేవుడు పుట్టించిన బలవంతుడే సంసోను. ఈ సంసోను అందరికంటే బలవంతుడు. అతడు పుట్టడానికి ముందే దేవుడు అతని తల్లితో అతని తలమీది వెంట్రుకలను కత్తిరించకుండా, ఏ దురలవాటుకీ లోను కాకుండా అతడిని పెంచమని చెప్పాడు. ఇలా దేవుడు ప్రత్యేక పరచుకున్న వారిని నాజీరులు అంటారు. సంసోను ఎంత బలవంతుడు అంటే ఆయుధం లేకుండానే వట్టి చేతులతో సింహాన్ని రెండుగా చీల్చిన వీరుడు. అంతే కాదు, గాడిద దవడ ఎముకతో వెయ్యి మంది ఫిలిష్తీయులను మట్టి కరిపించిన మహా బలాఢ్యుడు. అయితే ఈ సంసోను దెలీలా అనే వేశ్యను చూసి ఆమె వద్దకు పోయి అక్కడే ఆమెతో ఉండడం మొదలు పెట్టాడు. అది గమనించిన ఫిలిష్తీయులు దెలీలాకు ధనం ఇచ్చి అతడి బలం ఎక్కడ ఉందో కనుక్కొని రమ్మని పంపారు. అప్పుడు దెలీలా సంసోనును లాలిస్తున్నట్టు నటిస్తూ ఆయన బలాన్ని కనుక్కోడానికి ప్రయత్నం చేసి చివరకు అతడిని విసిగించి అతని వద్దనుండి ఆ బల రహస్యాన్ని రాబట్టి ఫిలిష్తీయులకు చేరవేసింది. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే సంసోనుకు బలాన్నిచ్చింది ఒక పనిని జరిగించడానికి. కానీ సంసోను దానిని మరచిపోయి తన శరీర బలహీనతను జయించలేక తాను ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాడో మరచిపోయి తన జీవితాన్నీ, అదే సమయంలో దేవుని ప్రణాళికను దెబ్బతీసిన వ్యక్తిగా నిలిచిపోయాడు.



– బి.రవికాంత్

**ఎప్పుడైతే మనం ఈ శరీర బలహీనతను జయిస్తామో అప్పుడే బలవంతులుగా ఉంటాం. లేదంటే బలహీనులుగానే బతికి బలహీనులుగానే మరణిస్తాం. ఇదే సంసోను జీవితం నుంచి మనం నేర్చుకోవల్సిన పాఠం.**

తిరుప్పావై 3వ పాశురం

**ఓంగి ఉలగళంద ఉత్తమన్ పేర్ పాడి**
**నాంగళ్ నం పావైక్కు చ్చాత్తి నీర్ ఆడినాల్**
**తీంగిన్రి నాడేల్లాం తింగళ్ ముమ్మారి పెయ్యు**
**ఓంగు పెఱుం జెన్నెలూడు కయల్ ఉగళ**
**పూంగువళై ప్పోదిల్ పోఱిపండు కణ్-పడుప్ప**
**తేంగాదే పుక్కిరుందు శీర్ త్తములై పత్తి**
**వాంగ క్కుడం నిఱైక్కుం పళ్ళల్ పెరుం పశుక్కళ్**
**నీంగాద శెల్వం నిఱైందేలోర్ ఎమ్బావాయ్**



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

**భావం:** ఇక్కడ ఆండాళ్ విభవావతారమైన వామనావతారాన్ని ప్రస్తుతిస్తుంది. మహాబలి అహంకార దమనం కోసం వటువుగా అవతరించి లోకాలను తన పాదాలతో కొలిచిన త్రివిక్రముడు, ఉత్తమోత్తముడైన శ్రీహరిని స్మరిస్తూ వ్రతవిధిగా బ్రహ్మముహూర్తంలో స్నానమాచరిస్తే వర్షమనే ఫలం సమృద్ధిగా దక్కుతుందని ఆండాళ్ వాగ్దానం.

**అంతరార్థం:** వ్రతనిరతులు కేవలం శ్రీమన్నారాయణుడి పట్ల శుద్ధమైన దాస్యభావం, కేవలం శ్రీమన్నారాయణుడి చరణాల మ్రోల శరణు కోరటం, కేవలం శ్రీమన్నారాయణుడే పరమ లక్ష్యంగా ఆయనను చేరుకోవటం ఈ మూడింటిని అవలంబించాలని గోదాదేవి భావం . ఈ అకారత్రయజ్ఞానమనే వర్షమే ఆత్మవికాసానికి తోడ్పడుతుంది. తిరుప్పావై అనే పేరున్న శ్రీవ్రతం లౌకిక క్లేశాలను పోగొట్టి సమస్త ఆధ్యాత్మిక సంపదలను ప్రసాదిస్తుంది. లీలావిభూతిలో అంటే ఈ లౌకిక జీవితంలో, నిత్యవిభూతిలో అంటే శ్రీవైకుంఠంలో సర్వకాలాల, సర్వావస్థలలో అక్షయమైన జ్ఞానసంపద ఒనగూర్చుతుంది.

– శ్రీదేవి మురళీధర్

● ముగ్గు-ముచ్చట



## ముగ్గులకు ఆహ్వానం

*ముగ్గులు పంపవలసిన చిరునామా:*

ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
muggulu.sakshi@gmail.com

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు



ఆర్. ఇందిర
పేలస్ రోడ్, కురుపాం

17 చుక్కలు
7 వరుసలు
7 మధ్య చుక్క





కాసర సింధూ రెడ్డి
జంగారెడ్డిగూడెం

లీడర్స్

# పూలూ రాళ్లూ



టిమ్, మలాలా

మహిళా నైపుణ్యాలను, మహిళల నాయకత్వాన్ని ప్రపంచం వేనోళ్ల ప్రశంసిస్తుంటే.. అక్కడక్కడా కొన్ని నోళ్లింకా మహిళల్ని తక్కువ చేసి మాట్లాడుతూనే ఉన్నాయి. తాజాగా ఎస్టోనియా మంత్రి మార్ట్ హెల్మ్ (70).. ప్రపంచ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఇటీవలే ప్రధాని అయిన సనా మారిన్ (34)పై నోరు పారేసుకున్నారు. ఓ రేడియో టాక్ షోలో మాట్లాడుతూ మారిన్‌ను ఆయన ‘సేల్స్ గర్ల్’ అని అన్నారు! చిన్నప్పట్నుంచీ ఎన్నో కష్టాలను ఎదుర్కొని, చిన్న చిన్న ఉద్యోగాలు చేసి, ప్రజాసేవపై ఆసక్తితో రాజకీయాల్లోకి వచ్చిన సనాను ఆయన ఆ విధంగా మాట్లాడ్డం ఆమె అభిమానులను



ఫిన్లాండ్ ప్రధాని సనా మారిన్

ఎంతగానో బాధించింది. ఎస్టోనియా మహిళా అధ్యక్షురాలు కెర్‌స్టీని కూడా నొప్పించింది. తన మంత్రివర్గ సభ్యుడు ఒక మహిళను అలా అనడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. వెంటనే ఆయన తరపున సనాకు క్షమాపణలు పంపారు. ఎస్టోనియాలో ఆయన ఇలా అంటున్నప్పుడే యు.ఎస్.లో ఆపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్.. మాలాలాను ‘విద్యారంగ యోధురాలు’ అని ప్రశంసించారు. బరాక్ ఒబామా సింగపూర్‌లో పర్యటిస్తూ.. ‘మగవాళ్ల కన్నా ఆడవాళ్లు సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను కలిగి ఉంటారు’ అని అన్నారు. సంస్కారాన్ని బట్టే మాటలూ!

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 18-12-2019

# ఈసారీ ఆస్కారం లేదు!



● రణవీర్ సింగ్

మరో ఏడాది. మరో నిరాశ. మరో నిరుత్సాహం. ఉత్తమ విదేశీ చిత్రంగా ఆస్కార్‌ని అందుకోవాలనే ఆశ అలానే మిగిలిపోనుంది. 92వ ఆస్కార్ అవార్డులకి ఈ ఏడాది మన దేశం నుంచి అఫీషియల్ ఎంట్రీగా నిలిచిన హిందీ చిత్రం 'గల్లీ బాయ్' ఆస్కార్ విడుదల చేసిన షార్ట్ లిస్ట్‌లో చోటు సాధించలేకపోయింది. ఆస్కార్ ఆశల్ని తొలి దశలోనే తుంచేసింది.

ఉత్తమ విదేశీ చిత్రంగా ఆస్కార్ పోటీల్లో మన దేశం తరపున నిలబడటానికి ఈ ఏడాది 28 సినిమాలు పోటీపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ విభాగంలో 91 సినిమాలు ఆయా దేశాలు నుంచి నామినేట్ చేశారు. మన దేశం తరపున 'గల్లీ బాయ్'ని పంపాం. రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ జోడీగా జోయా అక్తర్ తెరకెక్కించిన చిత్రం 'గల్లీ బాయ్'. ర్యాపర్ కావాలనుకునే ముంబై మురికివాడ కుర్రాడిగా ఇందులో రణ్‌వీర్ కనిపించారు. ర్యాపర్‌గా తన కలను ఎలా చేరుకున్నాడు అన్నది కథ. 40 కోట్లతో తీస్తే 200 కోట్లకు పైగా వసూలు చేసింది 'గల్లీ బాయ్'. అయితే ఆస్కార్ నామినేషన్ దక్కించుకోలేదు. 91 సినిమాలను ఫిల్టర్ చేసి పది సినిమాలకు కుదించి షార్ట్ లిస్ట్‌ను ప్రకటించింది ఆస్కార్. ఈ పది సినిమాల జాబితాలోకి 'గల్లీ బాయ్' ప్రవేశించలేకపోయాడు.

ప్రతి ఏడాది ఇస్తూ వస్తున్న ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్ కేటగిరీను ఈసారి ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్‌గా పేరు మార్చారు. ఈ ఏడాది ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఎంపికయిన సినిమాలు. 1. ది పెయింటెడ్ బర్డ్ (చెక్ రిపబ్లిక్), 2. ట్రూత్ అండ్ జస్టిస్ (ఎస్టోనియా), 3. లెస్ మిసరబుల్స్ (ఫ్రాన్స్), 4. దోస్ హూ రిమైండ్ (హంగేరి), 5. హనీ ల్యాండ్ (నార్త్ మెకడోనియా), 6. కోర్పస్ క్రిస్టీ (పోల్యాండ్), 7. 'బీన్ పోల్' (రష్యా), 8. అట్లాంటిక్స్ (సెనెగల్), 9. ప్యారసైట్ (సౌత్ కొరియా), 10. పెయిన్ అండ్ గ్లోరీ (స్పెయిన్).

92వ ఆస్కార్ అవార్డులకు సంబంధించిన నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌ను మంగళవారం ప్రకటించింది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్. 9 విభాగాల ఈ జాబితాలో విభాగానికో పది సినిమాలను షార్ట్‌లిస్ట్ చేసి ప్రకటించారు. ఉత్తమ విదేశీ చిత్రం, డాక్యుమెంటరీ మూవీ, డాక్యుమెంటరీ షార్ట్, మేకప్ అండ్ హెయిర్ స్టయిల్, మ్యూజిక్ (ఒరిజినల్ స్కోర్), మ్యూజిక్ (ఒరిజినల్ సాంగ్), లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్, యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో ఎంపికయిన చిత్రాల జాబితాను విడుదల చేసింది. ఆ తర్వాత ఒక్కో విభాగంలో 5 సినిమాలను తుది జాబితాగా పరిగణించి ఒక్క సినిమాకి అవార్డు ప్రదానం చేస్తారు.

ఆస్కార్ నామినేషన్ ఓటింగ్స్ వచ్చే ఏడాది జనవరి 2న ప్రారంభం కానున్నాయి. జనవరి 7 వరకూ ఓటింగ్ నడుస్తూనే ఉంటుంది. ఆ జాబితాను జనవరి 13న ప్రకటిస్తారు. దాని తర్వాత జనవరి 30న తుది జాబితాకు సంబంధించిన ఓటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 4 వరకూ ఈ ఓటింగ్ సాగుతుంది. ఐదు రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 9న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. హాలీవుడ్ అండ్ హైల్యాండ్ సెంటర్‌లో జరగబోయే 92వ ఆస్కార్ వేడుక ఏబీసీ టెలివిజన్‌లో ప్రసారం కానుంది. సుమారు 225 దేశాల్లో ఆస్కార్ వేడుక ప్రత్యక్ష ప్రసారం కానుంది.

ఆస్కార్ అవార్డులు సినిమా ప్రియులకు పండుగే. కానీ హాలీవుడ్ చిత్రాల కోసం ఏర్పాటు చేసుకున్న ఈ ఫంక్షన్‌ను అన్ని దేశాల వాళ్లు ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం ఏంటి? ఇన్ని వందల సినిమాల్లో ఒక్క దేశం ఆస్కార్ దక్కించుకోకపోతే చిన్నబోవాల్సిన అవసరం ఏంటి? అనే వాదనలూ ఉన్నాయి. 'ఆస్కార్ అవార్డులు ప్రపంచ స్థాయివేం కాదు. చాలా లోకల్ అవార్డులు' అని అభిప్రాయపడ్డారు కొరియన్ సినిమా 'ప్యారసైట్' దర్శకుడు బాంగ్ జూన్-హో. ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది. మన ప్రయత్నం మనం చేద్దాం. ఫలితం ఆస్కార్ ఓటింగ్‌కి వదిలేద్దాం!

### చాన్స్ ఎవరికి?


● 'ప్యారసైట్'

ఈ ఏడాది ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఆస్కార్ దక్కే ఛాన్స్ ఎక్కువగా సౌత్ కొరియా చిత్రం 'ప్యారసైట్'కి ఉందని విశ్లేషకుల అంచనా. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ సినిమా ఉత్తమ చిత్రంగా నిలిచింది. ప్రస్తుతానికైతే చాలామంది హాట్ ఫేవరెట్ 'ప్యారసైట్'. ఏం జరుగుతుందో వేచి చూద్దాం.

### మార్వెల్ వర్సెస్ డీసీ


● 'అవెంజర్స్ ఎండ్ గేమ్'

కామిక్ బుక్స్ నుంచి సూపర్ హీరోల సినిమాలు తీసి బస్టర్స్ సాధి స్తుంటాయి నిర్మాణ సంస్థలు. కానీ ఆ సినిమాలను పెద్దగా పరిగణలోకి తీసుకోదు ఆస్కార్. టెక్నికల్ విభాగాల్లో కొన్నిసార్లు అవార్డు ఇచ్చి వెన్ను తట్టింది కానీ సూపర్ హీరో సినిమాలంటే ఆస్కార్‌కి చిన్న చూపే. అయితే ఈ ఏడాది బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపించిన సూపర్ హీరో 'అవెంజర్స్ ఎండ్ గేమ్, జోకర్, కెప్టెన్ మార్వెల్' వివిధ విభాగాల్లో నామినేషన్లు దక్కించుకున్నాయి. మార్వెల్ సంస్థ నుంచి వచ్చిన 'ఎండ్ గేమ్' బెస్ట్ మ్యూజిక్ (ఒరిజినల్ స్కోర్), విజువల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో, 'కెప్టెన్ మార్వెల్' చిత్రం విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో నామినేట్ అయ్యాయి. డీసీ సంస్థ ఆస్కార్ బాధ్యతను 'జోకర్' భుజాలపై ఉంచింది. ఒరిజినల్ స్కోర్, మేకప్ అండ్ హెయిర్ స్టయిల్ విభాగాల్లో 'జోకర్' సినిమా నామినేట్ అయింది.


● కాజల్ అగర్వాల్

## కొత్త దశాబ్దానికి శుభారంభం



పాత సంవత్సరానికి గుడ్ బై చెప్పేటప్పుడు కొత్త ఏడాది అంతా బాగుండాలని కోరుకుంటాం. కాజల్ అగర్వాల్ అలానే కోరుకుంటున్నారు. అయితే రానున్న 2020 గురించి మాత్రమే కాదు.. వచ్చే దశాబ్దం కూడా తనకు బాగుంటుందని ఆమె అంటున్నారు. దానికి కారణం ఉంది. ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖుల లిస్ట్‌లో కాజల్ చేరబోతున్నారు. మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియమ్‌లో ఎంతోమంది సెలబ్రిటీల బొమ్మల సరసన కాజల్ మైనపు బొమ్మ చేరబోతోంది. సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న తన మైనపు బొమ్మను కాజల్ ఆవిష్కరించనున్నారు. ''నా చిన్నప్పుడు టుస్సాడ్స్ మ్యూజియమ్‌కి వెళ్లి, అక్కడున్న ప్రముఖుల బొమ్మలను ఎంతో ఆరాధనగా చూసేదాన్ని. నా బొమ్మ వారితో పాటు ఉండబోవటం అనేది నాకు దక్కిన గౌరవంలా భావిస్తున్నాను. కొత్త దశాబ్దం శుభారంభానికి ఇది నాంది అనుకుంటున్నాను. నిద్ర లేకుండా ఎంతో కష్టపడి షూటింగ్ చేసిన రాత్రులు, ఎన్నో వ్యక్తిగత త్యాగాలకు దక్కిన ప్రతిఫలంలా భావిస్తున్నా. నా బొమ్మను నా చేతులతో ఆవిష్కరించే రోజు కోసం ఎదురు చూస్తున్నా'' అన్నారు కాజల్ అగర్వాల్. కాజల్ బొమ్మకు కావాల్సిన కొలతలను టుస్సాడ్స్ టీమ్ తీసుకుంది.

# ఈ విజయానికి కారణం మా యూనిట్

**- వెంకటేశ్**

''మంచి సినిమా తీయాలనే ఉద్దేశంతో యూనిట్ అంతా ఎంతో కష్టపడటంతోనే ఇంత పెద్ద సక్సెస్‌ను అందుకున్నాం. 'వెంకీమామ' సినిమాను బాగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. చిరంజీవిగారికి, మహేశ్ బాబుకి కూడా మా సినిమా నచ్చడంతో అభినందించారు.. ఇందుకు వారిద్దరికీ ధన్యవాదాలు'' అని వెంకటేశ్ అన్నారు. కె.ఎస్.రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా, పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'వెంకీమామ'. డి.సురేష్ బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– ''ఈ సినిమాని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని టెన్షన్‌గా ఉండేది. విడుదల తర్వాత చాలా సంతోషంగా ఉంది. అందరూ సినిమాను తమదిగా భావించి ఎంజాయ్ చేస్తున్నారు. ఇద్దరు మామలు కలిసి కమర్షియల్ బ్లాక్ బస్టర్ ఎలా ఉంటుందో నాకు చూపించారు. మాకే కాదు.. ఇది తాతగారి (రామానాయుడు) కల.. తాతగారి సక్సెస్. అందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు. ''నా ఫ్యామిలీతో కలిసి ఈ సినిమా చూశాను. అంతా బాగా ఎంజాయ్ చేశారు'' అన్నారు రాశీఖన్నా. ''మనం రేపు మాట్లాడుకునే సినిమాల్లో 'వెంకీమామ' ఒకటిగా నిలుస్తుందని కచ్చితంగా చెప్పగలను'' అన్నారు పాయల్ రాజ్‌పుత్. ''ఈ సక్సెస్ రెండేళ్ల కష్టం. హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. నా జీవితంలో ఈ సినిమా చాలా ప్రత్యేకం. వెంకటేశ్ గారు, చైతన్యగారి పాజిటివిటీ వల్లే ఈ సినిమా తీయగలిగాను'' అన్నారు కె.ఎస్.రవీంద్ర. ''మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''వెంకటేశ్‌గారు, చైతన్యగారితో సినిమా అనగానే ఎగ్జయిట్ అయ్యి 'వెంకీమామ' చేశాను'' అన్నారు సంగీత దర్శకుడు ఎస్.ఎస్.తమన్. ''ఇంటి భోజనం తింటే ఎలా ఉంటుందో 'వెంకీమామ' చూస్తుంటే అలా అనిపించింది'' అన్నారు డైరెక్టర్ నందినీ రెడ్డి. డైరెక్టర్ వంశీ పైడిపల్లి, చందూ మొండేటి, నిర్మాత వివేక్ కూచిభొట్ల, ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


● వెంకటేశ్, పాయల్ రాజ్‌పుత్, నాగచైతన్య, రాశీఖన్నా, బాబీ, తమన్

# ట్రైలర్ బాగుంది

**- రామ్‌గోపాల్ వర్మ**

''ఊల్లాల ఊల్లాల' మేకింగ్ వీడియో చూసి ఆశ్చర్యపోయా. సత్యప్రకాష్‌లో ఇంత ప్రతిభ ఉందా? అనిపించింది. ఈ చిత్రం టీజర్, ట్రైలర్ చాలా బావున్నాయి. గురురాజ్‌కు ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలి'' అన్నారు డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ. నటరాజ్ హీరోగా, నూరిన్, అంకిత హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నటుడు సత్యప్రకాష్ దర్శకత్వం వహించారు. ఎ.గురురాజ్ నిర్మించిన ఈ సినిమా జనవరి 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం పాటలను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. సత్యప్రకాష్ మాట్లాడుతూ– ''మా అబ్బాయి నటరాజ్‌ని ఈ చిత్రంతో హీరోగా పరిచయం చేస్తున్నా. గురురాజ్‌తో జర్నీ చాలా ఆనందంగా ఉంది. 'ఊల్లాల.. ఊల్లాల' అనే టైటిల్ ఆయన ఆలోచనే. టైటిల్ బాగుందని వర్మగారు కూడా అన్నారు'' అని చెప్పారు. ''అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు గురురాజ్. ''కొత్తవారితో సినిమా అంటే ఆర్థిక సమస్యలుంటాయి. కానీ, గురురాజ్ సినిమాను విడుదల చేస్తాడనే భరోసానే సత్యప్రకాష్‌ను నడిపించింది'' అన్నారు నిర్మాత సి.కళ్యాణ్. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్.


● రామ్‌గోపాల్ వర్మ, అశోక్‌కుమార్, సి. కల్యాణ్, నూరిన్, గురురాజ్, నటరాజ్, సత్యప్రకాష్

# అదే మా బ్యానర్ విజయ రహస్యం

''శైలజా రెడ్డి అల్లుడు' తర్వాత కొన్ని నెలలు ఓ కథ మీద వర్క్ చేశాడు మారుతి. ఆ తర్వాత మరో ఆలోచనను పంచుకున్నాడు. అది నచ్చింది. కానీ ఎక్కడో చిన్న సందేహం. అయితే మా అమ్మగారి వల్ల ఈ సినిమా చేయాలనుకున్నాను'' అన్నారు నిర్మాత 'బన్నీ' వాస్. సాయితేజ్, రాశీ ఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో రూపొందిన 'ప్రతి రోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై 'బన్నీ' వాస్ నిర్మించారు. సత్యరాజ్, రావు రమేశ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 20న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా 'బన్నీ' వాస్ చెప్పిన విశేషాలు.


● 'బన్నీ' వాస్

- దర్శకుడు మారుతి, నేను, యూవీ క్రియేషన్స్ వంశీ, యస్‌కేయన్ (ఈ చిత్ర సహనిర్మాత) మంచి ఫ్రెండ్స్. ఏ ఐడియా వచ్చినా నలుగురం పంచుకుంటాం. డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లా ఎప్పుడూ ఉండం. మారుతి క్రియేటర్ కాబట్టి అతని ఆలోచనల్ని నేను గౌరవిస్తాను.
- 'ప్రతి రోజూ పండగే' కథ బాగానే అనిపించింది కానీ అమ్మానాన్నలను అశ్రద్ధ చేసేవాళ్లు ఎవరుంటారు? కనెక్ట్ అవుతారా? అనే డౌట్‌ని కొందరు వ్యక్తం చేశారు. ఇది జరిగిన కొన్ని రోజులకే మా అమ్మగారు నాకు ఫోన్ చేశారు. 'ఐదు రోజులుగా నీతో మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాను రా' అన్నారు. నాకు వెంటనే తల్లి దండ్రులను అశ్రద్ధ చేసేవాళ్లలో నేను కూడా ఉన్నానా? అని భయం వేసింది. మేం పట్టించుకోనప్పుడు మీకెలా ఉంటుంది అమ్మా? అని అడిగాను. 'పెద్దయిపోయారు. మీకు బాధ్యతలు ఉంటాయని సర్ది చెప్పుకుంటాం రా' అని చెప్పింది. అందరం ఏదో ఒకసారి మన పేరెంట్స్‌ను అశ్రద్ధ చేస్తున్న వాళ్లమే. అలాంటి కథ కాబట్టి మారుతిని గోఎహెడ్ అన్నాను.
- ఈ చిత్రంలో తేజ్ ఫిట్‌బాడీతో కనిపిస్తాడు. 'బాడీ మీద క్రమశిక్షణ తప్పింది. వర్కౌట్ చేస్తాను' అని ఈ సినిమా కోసం బాడీని రెడీ చేశాడు. యాక్టర్‌గా తనను తాను చాలా మెరుగుపరుచుకుంటున్నాడు.
- చావు అనివార్యం. పెళ్లి, పుట్టినరోజుని ఎలా అయితే సెలబ్రేట్ చేసుకుంటామో చావుని కూడా అలానే సెలబ్రేట్ చేసుకోవాలి. ఈ విషయాన్ని సీరియస్‌గా, ఫన్నీగా చెప్పాం.
- అల్లు అరవింద్‌గారి సలహాలు బావుంటాయి. మనం చెప్పినదాంట్లో పాయింట్ ఉందంటే తీసుకుంటారు. మూడు జనరేషన్స్ (అరవింద్ గారు , నేను, నూతన దర్శకులు) కలిసి పని చేయడమే మా బేనర్ విజయ రహస్యం.
- ప్రస్తుతం 'జెర్సీ' హిందీ రీమేక్, అఖిల్– 'బొమ్మరిల్లు' భాస్కర్ చిత్రం, కార్తికేయ 'చావు కబురు చల్లగా', నిఖిల్– సూర్యప్రతాప్ సినిమాలు చేస్తున్నాం.

- సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించను. కానీ ఎప్పుడైనా బాధ కలిగినా, నా అభిప్రాయాలను పంచుకోవాలన్నా ఫేస్‌బుక్‌లో స్పందిస్తా.
- మేం అడ్వాన్స్ ఇచ్చినా ఆ దర్శకుడికి వేరే ఆఫర్ ఉంటే చేసుకోమంటాం. దర్శకులను మా దగ్గరే ఉండాలని నిబంధన పెట్టం. ప్రాజెక్ట్ ఓకే అయ్యాక మాత్రం వదలం (నవ్వుతూ).

# ఇండస్ట్రీలో ఉన్న ఇబ్బంది అదే!

''లెజెండ్' సినిమాలో తొలిసారి బాలకృష్ణగారి సరసన యాక్ట్ చేశాను. పెద్ద సూపర్‌స్టార్‌తో ఎలా వర్క్ చేస్తాం అని టెన్షన్ పడ్డాను. కానీ ఇప్పుడు బాలకృష్ణగారితో మూడో సినిమా చేశాను. బాలకృష్ణగారి సినిమా అంటే ఓకే అనేస్తున్నాను. వీలుంటే ఆయనతోనే వంద సినిమాలయినా చేస్తాను'' అన్నారు సోనాల్ చౌహాన్. బాలకృష్ణ హీరోగా సోనాల్ చౌహాన్, వేదిక హీరోయిన్లుగా కేయస్ రవికుమార్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన చిత్రం 'రూలర్'. ఈ నెల 20న ఈ సినిమా రిలీజ్ కానున్న సందర్భంగా సోనాల్ చెప్పిన విశేషాలు.


● సోనాల్ చౌహాన్

- 'రూలర్' చిత్రంలో నా పాత్ర పేరు హారిక. కావాలనుకున్నది సాధించుకునే మనస్తత్వం ఉన్న అమ్మాయి. ఓ విషయంలో హీరోతోనే పోటీ పడాల్సి వస్తుంది. నా పాత్ర ఫుల్ గ్లామరస్‌గా ఉంటుంది. కామెడీ కూడా చేశాను. ఈ సినిమాలో బాలకృష్ణగారు రెండు గెటప్స్‌లో కనిపిస్తారు. ఒకటి మాస్ గెటప్.
- ఒక యాక్టర్ ఒక పాత్ర చేసి అది బాగా హిట్ అయితే అన్నీ అలాంటి పాత్రలే వస్తాయి. మన ఇండస్ట్రీలో ఇబ్బందే అది. ఆ యాక్టర్ ఇక ఆ పాత్రలే చేయాలన్నట్టు చూస్తారు. యాక్టర్ అన్నాక అన్ని పాత్రలు చేయాలి. నాకు పల్లెటూరి అమ్మాయి పాత్ర చేయాలనుంది. భవిష్యత్తులో డిజిటల్ మాధ్యమమే టాప్‌లో ఉంటుందనుకుంటున్నాను. హిందీలో ఓ వెబ్ సిరీస్ చేశాను. ప్రస్తుతం హిందీలో ఓ సినిమా, తెలుగులో ఓ పెద్ద ప్రాజెక్ట్ ఓకే అయింది.







సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
18-12-2019




# బుల్లితెర శోభన్‌బాబు

**బుల్లితెరపై విజె సన్నిగా అలరించిన అరుణ్ సీరియల్ నటుడిగా ప్రేక్షకుల అభిమానాన్ని పొందుతున్నాడు. 'అందరూ సీరియల్ శోభన్‌బాబు అని కితాబులిస్తున్నారు' అంటూ సరదాగా వివరించిన అరుణ్ సింగిల్ ట్రావెల్ జర్నీ అంటే అమితంగా ఇష్టపడతానని తన విషయాలు చెప్పుకొచ్చాడు.**


'కళ్యాణవైభోగం' సీరియల్‌లోని దృశ్యం

'మాది ఖమ్మం. పీజీ చేస్తున్నప్పుడు అవకాశం వస్తే ముందు ఒక టీవీ చానెల్‌లో లైఫ్‌స్టైల్ రిపోర్టర్‌గా పనిచేశాను. ఆ తర్వాత యాంకరింగ్ వైపు వచ్చాను. మూడేళ్లపాటు టీవీ యాంకర్‌గా వర్క్ చేశాను. నా యాంకరింగ్ చూసిన టీవీ సీరియల్ వాళ్లు ఆడిషన్స్‌కు పిలిచారు. అలా 'కళ్యాణవైభోగం' సీరియల్ ద్వారా నటుడిగా పరిచయం అయ్యాను. మూడేళ్లుగా ఈ సీరియల్‌లో లీడ్ రోల్ చేస్తున్నాను.

## సూర్యదేవర జయసూర్య అనే నేను

'జీ తెలుగు'లో వచ్చే 'కళ్యాణవైభోగం' సీరియల్‌లో సూర్యదేవర జయసూర్యగా లీడ్ రోల్‌లో నటిస్తున్నాను. ఈ సీరియల్‌లో బిజినెస్ మ్యాన్‌గా రాణిస్తుంటాను. బిజినెస్ ఉమన్ నిత్యను చూసి, ఇష్టపడి పెళ్లిచేసుకుంటాను. తనే నా లైఫ్ అన్నట్టుగా ఉంటాను. అయితే, అనుకోకుండా మా ఇద్దరి మధ్య బిజినెస్ వార్ నడుస్తూ ఉంటుంది. ఒకానొక సందర్భంలో నిత్య చనిపోయిందని అందరూ అనుకుంటారు. నిత్య స్థానంలో అదే పోలికతో ఉండే మంగను చేర్చుతారు. ఈ విషయం ఎక్కడ బయటపడిపోతుందో అని భయం. ఇలా ఓ భిన్న కథాంశంతో సీరియల్ నడుస్తుంది. మా టీమ్‌లో అందరూ నన్ను సీరియల్ శోభన్‌బాబు అని పిలవడానికి కారణం కూడా అదే. మూడేళ్లుగా ఈ సీరియల్ టాప్ రేటింగ్‌లో ఉన్నందుకు గాను టీవీ అవార్డు నన్ను వరించింది. ఈ రంగానికి వచ్చినందుకు ఇదో అద్భుతమైన అవకాశంగా భావిస్తుంటాను.

## అమ్మ కష్టంతో ఎదిగాం

ఖమ్మంలో అమ్మ విలేజ్ హెల్త్ రిప్రజెంటేటివ్‌గా వర్క్ చేసేవారు. ఇద్దరు అన్నయ్యలు.




అమ్మ సింగిల్ పేరెంట్‌గా మా ముగ్గురిని చదివించింది. అమ్మ కష్టాన్ని అర్థం చేసుకుంటూ పెరిగాం. మా ముగ్గురిలో చిన్నవాడిని కాబట్టి నేను కాస్త గారంగానే పెరిగాను. పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తుండగా రిపోర్టర్‌గా, అటు నుంచి వీడియోజాకీగా.. అవకాశాలు వచ్చాయి. దీంతో టీవీనే నా ప్రపంచం అనుకుంటూ వచ్చేశాను. అన్నయ్యలిద్దరూ ఉద్యోగాల్లో సెటిల్ అయ్యారు. నాకున్న ఇష్టం కొద్దీ ఈ ఇండస్ట్రీకి వచ్చాను. అమ్మకు మా మీద చాలా నమ్మకం. ఏ వర్క్ అయినా స్వేచ్ఛ ఉంటుంది. ఇదే చేయ్, ఇదే చదువుకొని జాబ్ తెచ్చుకో.. అని అనలేదు. దీంతో సృజన ఉన్న ఈ రంగాన్ని ఎంచుకున్నాను. సీరియల్స్‌తో పాటు సినిమాలోనూ రాణించాలనుకుంటున్నాను.

## ప్రయాణాలతో ప్రమోదం

సీరియల్ షూటింగ్, ఈవెంట్స్, షోస్ అంటూ నెలలో పాతిక రోజులు గడిచిపోతాయి. మిగతా రోజులను ట్రావెల్‌కు ఉపయోగించుకుంటాను. కొత్త కొత్త ప్రదేశాలను సందర్శించడం అంటే చాలా ఇష్టం. అలాగని ట్రూప్‌లుగా వెళ్లే జర్నీ అంటే ఇష్టముండదు. అమ్మ వాళ్లు తీర్థయాత్రలు చేస్తుంటారు. నేను మాత్రం బైక్‌పైన ఫ్రెండ్స్‌తో ట్రావెల్ ఎక్కువ చేస్తుంటాను. ప్రపంచ పర్యాటక స్థలాలన్నీ సందర్శించాలనేది నా కల' అంటూ తన జీవనవిధానంతోపాటు అభిరుచులనూ షేర్ చేశారు సన్ని.

– నిర్మలారెడ్డి

కార్డియాలజీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

# గుండెవైఫల్యం అంటే...?

**నా వయసు 59 ఏళ్లు. గత నాలుగేళ్లుగా మూత్రం తగ్గడం, చర్మం పలచబడటం, కండరాల పటుత్వం కూడా తగ్గడం వంటి లక్షణాలతో డాక్టర్‌ను కలిశాను. ఆయన కొన్ని పరీక్షలు చేసి గుండెవైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్) కారణంగా ఈ లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పారు. గుండెవైఫల్యం అంటే ఏమిటి? ఇందుకు కారణాలేమిటి? దయచేసి వివరంగా చెప్పండి.**

**- సుధాకర్‌రావు, కంకిపాడు**



గుండె వైఫల్యానికి అతి ప్రధాన కారణం గుండెపోటు. ఒకసారి గుండెపోటు బారిన పడ్డవారిలో నూటికి 60 మందిలో గుండెవైఫల్యం సంభవించవచ్చు. అయితే గుండెవైఫల్యానికి ఇదొక్కటే కారణం కాదు. దీర్ఘకాలం పాటు హైబీపీ నియంత్రణలో లేకపోవడం వల్ల కూడా గుండెకండరం దెబ్బతిని వైఫల్యానికి దారితీస్తుంది. అలాగే డయాబెటిస్ నియంత్రణలో లేనప్పుడు కూడా సూక్ష్మరక్తనాళాలు దెబ్బతిని అంతిమంగా అది గుండె వైఫల్యానికి దారితీస్తుంది. దీర్ఘకాలంగా కిడ్నీ జబ్బు ఉన్న వారికి కూడా రక్తంలో విషపదార్థాల ప్రభావం పెరిగి, కరమంగా గుండె దెబ్బతింటుంది. అరుదుగా పుట్టుకతో కండర ప్రోటీన్ లోపం ఉన్నవారికి, కాన్పు సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురైన మహిళలకు, కొందరిలో జీవితంలో ఉన్నట్టుండి ఎన్నడూ లేనంత తీవ్రమైన మానసిక ఒత్తిడి బారిన పడ్డవారికి కూడా హఠాత్తుగా గుండెవైఫల్యం సంభవించి ముప్పు ఉంటుంది.

నిర్ధారణ గుండెవైఫల్యాన్ని చాలావరకు లక్షణాల ఆధారంగానే గుర్తుపట్టవచ్చు. వైద్యులు రోగిని పరీక్షించడంతో పాటు కచ్చితమైన నిర్ధారణకు కొన్ని పరీక్షలు చేయిస్తారు. 'ఈసీజీ' పరీక్ష చేస్తే గతంలో గుండెపోటు వచ్చిందా, గుండె గదులు పెద్దగా అయ్యాయా, కండరం మందంగా తయారైందా... వంటి వివరాలన్నీ బయటపడతాయి. ఎకో పరీక్ష చేస్తే గుండె పంపింగ్ సామర్థ్యం ఎలా ఉందన్న విషయం తెలుస్తుంది. ఇవికాకుండా గుండె వైఫల్య లక్షణాలు స్పష్టంగా కనబడుతున్నప్పుడు... ఒక వేళ గుండె రక్తనాళాల్లో పూడికలుండి, త్వరలో గుండెపోటు ముంచుకొచ్చే అవకాశం ఉందేమో తెలుసుకునేందుకు 'యాంజియోగ్రామ్' అవసరమవుతుంది. దాదాపు 99 శాతం మందికి ఈ పరీక్షలతో గుండెవైఫల్యం కచ్చితంగా నిర్ధాణ అవుతుంది. అరుదుగా మరింత స్పష్టత కోసం ఎమ్మారై, పెట్‌స్కాన్ వంటి పరీక్షలూ అవసరమవుతాయి. ఆయాసంగా ఉన్నప్పుడు దానికి కారణం గుండె వైఫల్యమా లేక ఉబ్బసమా అన్నది తెలుసుకునేందుకు 'బీఎన్‌పీ' అనే పరీక్ష ఉపకరిస్తుంది.

చికిత్స: గుండెవైఫల్యానికి చికిత్స దీర్ఘకాలం పాటు కొనసాగుతుంది. గుండెవైఫల్యం మొదలైనప్పుడు దగ్గు, ఆయాసం వంటి పైకి కనిపించే లక్షణాలతో పాటు గుండె సైజు పెరగడం, కండరం మందం కావడం వంటి అంతర్గత సమస్యలూ ఉంటాయి. గుండె వ్యాధి ముదరకుండా చూడటానికి మందులు వాడాల్సి ఉంటుంది. గుండె, కిడ్నీ వంటి కీలక అవయవాల పనితీరును సమన్వయం చేస్తూ పంపింగ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు బీటా బ్లాకర్లు, ఏసీఈ, ఏఆర్‌బీ ఇన్హిబిటర్లు, స్పైరనోలాక్టోన్ వంటి మందులు ఇస్తారు. వీటికితోడు గుండె సైజు పెరిగినప్పుడు దాని దుష్ప్రభావాలను అడ్డుకునేందుకు 'నెప్రిలీసిలిన్ ఇన్హిబిటర్' వంటి కొత్తమందులు రాబోతున్నాయి. ఇక ఒంట్లోకి అధికంగా చేరిన నీటిని బయటకు పంపేందుకు 'డైయూరెటిక్స్' మందులు, లక్షణాలను తగ్గించేందుకు 'డిజిటాయిల్స్' మందులు తోడ్పడతాయి. ఇవన్నీ కూడా వ్యాధి ముదరకుండా కాపాడుతూ జీవితకాలాన్ని పెంచడానికి తోడ్పడతాయి. గుండె పంపింగ్ సామర్థ్యం 30 శాతం కంటే తక్కువగా ఉన్నవారికి 'ఆల్డోస్టెరాన్ యాంటగోనిస్ట్స్' రకం మందులు ఉపయోగపడతాయి. ఆస్తమా వంటి సమస్యలున్నవారు బీటాబ్లాకర్స్‌ను తట్టుకోలేరు వీరికి 'ఇవాబ్రాడిన్' అనే కొత్త మందు అందుబాటులోకి వచ్చింది. కిడ్నీ సమస్యలున్నవారు ఏసీఈ, ఏఆర్‌బీ మందులను తట్టుకోలేరు. వీరికి 'ఐసార్‌జైన్' మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇవన్నీ రక్తనాళాలను విప్పారేలా చేస్తూ గుండెమీద భారాన్ని తగ్గిస్తాయి. ఈ మందుల వల్ల రోగి బాధలు తగ్గడమే కాకుండా, గుండె వైఫల్యం కారణంగా లోపల తలెత్తే సమస్యలు తగ్గి రోజువారీ పనులన్నీ హాయిగా చేసుకోగలుగుతారు. కాబట్టి మందులను క్రమం తప్పకుండా పద్ధతి ప్రకారం వాడటం చాలా కీలకం.

# గుండె ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి రాకూడదంటే...?

**నా వయసు 54 ఏళ్లు. ఇటీవల నాకు గుండెకు రక్తం పరఫరా చేసే ధమనుల్లో బ్లాక్స్ ఉన్నాయని డాక్టర్లు చెప్పారు. మందులతోనే చక్కదిద్దవచ్చని (మెడికల్లీ మేనేజబుల్) అన్నారు. నేను కూడా డాక్టర్లు చెప్పినట్టే క్రమం తప్పకుండా మందులు వాడాలనుకుంటున్నాను. వీటిని కొద్ది కాలం వాడితే సరిపోతుందా? జీవితాంతం వాడాలా? ఇవి వాడుతున్నా భవిష్యత్తులో ఎప్పుడైనా సర్జరీ చేయించాల్సిన అవసరం వస్తుందా? నాకు సర్జరీ అంటే చాలా భయం. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే చేయాలి?**

**- ఆర్. జగన్నాథరావు, గుడివాడ**



మీకు గుండెజబ్బు ఉండి, రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నప్పటికీ కేవలం మందులు వాడితే సరిపోతుందని డాక్టర్లు చెప్పారంటే ఆ బ్లాక్స్ అంత ఎక్కువగా లేవనీ అర్థం. లేదా పెద్ద రక్తనాళాలు అన్నీ బాగానే ఉండి గుండెకు రక్తసరఫరా చేసే చిన్న రక్తనాళాల్లో మాత్రమే బ్లాక్స్ ఉన్నాయని అనుకోవచ్చు. కాబట్టి మీరు ఎక్కువగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఇదేకాకుండా భవిష్యత్తులో జబ్బు పెరగకుండా ఆహార, వ్యాయామ నియమాలు పాటిస్తూ... ఆస్పిరిన్, స్టాటిన్స్ వంటి మందులు వాడుతూ ఉంటే జబ్బు పెరిగి ఆపరేషన్ అవసరం పడాల్సి రావడానికి అవకాశాలు చాలా తక్కువ. కానీ ఆహార, వ్యాయామ నియమాలు పాటించకుండా, మందులు వాడటంలో నిర్లక్ష్యంగా ఉండి అశ్రద్ధ చేస్తూ ఉంటే జబ్బు పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి అస్తమానం ఆపరేషన్ గురించి ఆలోచిస్తూ ఆందోళనపడకుండా ఉండండి.

యోగా, వాకింగ్ వంటివి చేస్తూ పైన పేర్కొన్న మందులు తీసుకుంటూ నిర్భయంగా ఉండండి. ఒకవేళ ఇదంతా చేసినా కూడా జబ్బు పెరిగి ఆపరేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంటే నిర్భయంగా, నిశ్చింతగా సర్జరీ చేయించుకోండి. ఇప్పుడు తక్కువగాటుతో లేదా ఒక్కోసారి అదీ లేకుండా యాంజియోప్లాస్టీ స్టెంటింగ్ చేయించుకుని పూర్తిగా సాధారణ జీవితాన్ని గడిపే అవకాశాలు న్నాయి.



**డాక్టర్ జి. సూర్యప్రకాశ్,** సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, ముషీరాబాద్, హైదరాబాద్



సత్యం గారి కుమార్తె ఉండవల్లి నాగలక్ష్మి, కుమారుడు మాధవపెద్ది వెంకట నారాయణ మూర్తి

# స్వరణీయం

**'భలే చాన్సులే భలే చాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తన గొంతుతో మన కళ్ల ముందుంచినా... 'సరదా సరదా సిగరెట్టు' అని పాడుతూ ధూమపానం అనర్థాల గురించి హెచ్చరించినా... 'భళి భళి భళి భళి' దేవా అంటూ తత్వాన్ని బోధించినా...'అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి సరదాగా వాపోయినా...'వివాహ భోజనంబు' పాట చెవిన పడ్డా, మాధవపెద్ది సత్యం స్వరం మన చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. నేడు మాధవపెద్ది వర్ధంతి. ఈ సందర్భంగా తండ్రిని స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకాలను సాక్షితో పంచుకున్నారు ఆయన పిల్లలు నాగలక్ష్మి, వెంకటనారాయణ మూర్తి.**



**మూర్తి:** నా పేరు వెంకటనారాయణమూర్తి. ఎంవిఎన్‌మూర్తి అంటారు. ముద్దుగా బాజీ అని పిలుస్తారు. నేను బి.ఎస్సీ కెమిస్ట్రీ చదివాను. ఎయిర్‌లైన్స్ కోర్సు చేశాను. జర్మనీ నేర్చుకున్నాను. వెంపటి చినసత్యంగారి దగ్గర కూచిపూడి నాట్యం నేర్చుకున్నాను. పాతికేళ్లుగా శివ ఫౌండేషన్ పేరుతో డాన్స్ స్కూల్ నడుపుతున్నాను. 1999లో అమ్మ, 2000లో నాన్న మరణించారు. అమ్మానాన్నల పేరు మీద హృదయాంజలి సంగీత విభావరిని 18 మంది గాయనీ గాయకులతో పాడించాను. బాలమురళి ముఖ్య అతిథిగా వచ్చారు. ప్రస్తుతం వారి పేరు మీద 'మాధవపెద్ది సత్యం – మాధవపెద్ది ప్రభావతి' పురస్కారాలు అందిస్తున్నాను. త్వరలో నాన్నగారి పుస్తకం ఆవిష్కరించాలనుకుంటున్నాను.



**నాగలక్ష్మి:** బి.ఏ. హిస్టరీ చదివాను. పెళ్లయ్యాక బి.ఈడి చేశాను. మావారు ఉండవల్లి రవికుమార్ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేశారు. వైజాగ్‌లో ఒక కాన్వెంట్‌లో కాలక్షేపానికి పనిచేశాను. నాన్నకి నేనంటే కొండంత ప్రేమ. కొండ మీద కోతిని అడిగినా తెచ్చేవారు. నో అనే వారు కాదు. కంచంలో అన్నీ ఆయనే వడ్డించి అన్నానికి పిలిచేవారు. నాన్నగారి చివరి రోజులలో హాస్పిటల్‌కి రోజూ వెళ్లి కూర్చునేదాన్ని. అలాగైనా ఆయన ఋణం తీర్చుకోవాలనుకున్నాను. అక్కడ కూడా ఆయన నాతో ఏమీ చేయించుకోలేదు.

**నాగలక్ష్మి:** నాన్నగారు ఆ రోజుల్లో వృత్తిపరంగా చాలా బిజీగా ఉన్నా, చాలా సాదాసీదాగా ఉండటానికి ఇష్టపడేవారు. ఆర్భాటాలు, విలాసాలు ఆయనకు నచ్చేవి కాదు. మమ్మల్ని కూడా అతి సామాన్యుల్లాగే పెంచారు. జీవితంలో అన్నీ తెలుసుకోవాలని చెప్పేవారు. కష్టపడితే ఫలితం వస్తుందన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా నమ్మిన వ్యక్తి మా నాన్న.

**మూర్తి:** నాన్నగారు బాపట్ల తాలూకా బ్రాహ్మణ కోడూరులో పుట్టారు. మా అమ్మ ప్రభావతి. వాళ్లది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. నాన్నగారికి పేకాట అంటే బాగా ఇష్టం. అలాగని అది డబ్బులకు ఆడే వ్యసనం కాదు. ఇంట్లో అందరం కలిసి సరదాగా ఆడుకోవటానికి ఇష్టపడేవారు. చెన్నై టి–నగర్‌లో మా పక్కింట్లోనే పెద్దనాన్న గోఖలే గారి ఇల్లు. పెద్దనాన్న, దొడ్డమ్మ అందరూ కలిసి ఆడుకునేవారు. పేకాట ఉంటే నాన్నకు ఇంకేమీ అక్కర్లేదు

**నాగలక్ష్మి:** నాన్నకి 'నేను ఏదో సాధించాను' అని కించిత్తు కూడా గర్వం ఉండేది కాదు. మన కర్తవ్యం మనం నిర్వహించాం అనుకోవడం ఆయన సిద్ధాంతం. తనకు వచ్చిన గౌరవ పురస్కారాలను ఎప్పుడూ ప్రదర్శించుకోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. మాయాబజార్‌లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించలేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు.

**మూర్తి:** ఆ రోజుల్లో సినిమా వాళ్లని చూడటం ఒక క్రేజ్. అభిమానులు బస్సులు వేసుకుని మరీ చెన్నై వచ్చేవారు. ఇలా కొందరు నాన్నగారిని చూడటానికి వచ్చే సమయానికి, నాన్న మా తోటలోని గడ్డిని తీస్తున్నారు. వారిని చూసి ఆయన మారుమాట్లాడకుండా ఇంటి వెనుకవైపుకు వెళ్లి చేతులు కడుక్కుని, ముందు వైపునుంచి వచ్చారు. వారు ఆశ్చర్యపోతుంటే 'ఇంటిపని చేసుకోవడం నాకు అలవాటు!' అన్నారు సింపుల్‌గా. ఇంటి పనుల్లో అమ్మకి సాయం చేసేవారు.

**నాగలక్ష్మి:** 'అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని నాన్న గురించి ఎస్. పి. బాలు అన్నారు. నాన్న సంగీతం పెద్దగా నేర్చుకోలేదు. తన పెదనాన్న వెంకటరామయ్యగారి దగ్గర పద్యాలతో ప్రభావితులయ్యారు. పాట రికార్డింగ్ పూర్తయ్యి ఇంటికి రాగానే ఒక బైండ్ పుస్తకం తీసుకుని, అందులో ఆ రోజు పాడిన పాట సాహిత్యం, అలాగే ఆ పాట ఏ శృతిలో, ఏయే గాయకులతో, ఎవరి సంగీత దర్శకత్వంలో, ఏ నటుడికి పాడారు.. వంటి విషయాలన్నీ రాసుకునేవారు. ఆ తరవాతే భోజనం.

**మూర్తి:** నాన్నగారు నాటకాలలో కూడా నటించేవారు. నాటకం పూర్తయ్యాక, పాటలు పాడేవారు. అలాగే రైలులో సెకండ్ క్లాసులోనే ప్రయాణించేవారు. గోంగూర పులుసు, వెన్న పూస, ఉల్లిపాయ కలిపి తినేవారు. పండుగకి గారెలు కావాలనేవారు. తెలుగు వంటలంటేనే ఇష్టం.

**నాగలక్ష్మి:** అందరం కలిసి కూర్చుని భోజనం చేయటానికి ఇష్టపడేవారు. ఇంట్లో ఉన్నప్పుడు నలుగురం పీటల మీద కూర్చుని తినేవాళ్లం. కుండలో నీళ్లు మాత్రమే ఇష్టపడేవారు.

**మూర్తి:** మా అక్కని అస్సలు కొట్టేవారు కాదు. నన్ను మాత్రం రెండుసార్లు కొట్టారు. ఒక సారి నేను సర్కస్‌కి వెళ్లొచ్చి, తాళ్లు పట్టుకుని వేలాడి కిందపడ్డాను. గడ్డం కింద దెబ్బ తగిలింది. నా అల్లరి భరించలేక గట్టిగా ఒక్కదెబ్బ వేశారు. మరోసారి షాపింగు కోసం పాండీ బజార్‌కి వెళ్దామన్నారు. నేను బీచ్‌కి వెళ్దామని ఏడ్చాను. అంతే! నా వీపు పగిలింది (నవ్వు)

**నాగలక్ష్మి:** నాన్నకు క్రమశిక్షణ అంటే ప్రాణం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నాన్న చెప్పిన మాటలను నేటికీ ఆచరిస్తూనే ఉన్నాను.

**మూర్తి:** ఘంటసాలగారిని మాస్టారూ అని పిలిచేవారు. ఆయన నాన్నను ఉర్రై అనేవారు. అలాగే నాన్నగారు ఎస్వీ రంగారావుగారి కోసమే పుట్టారేమో అని అందరూ అనుకునేవారు. ఒకసారి నాన్న, నేను ఎస్వీ రంగారావుగారి ఇంటికి వెళ్లాం. కబురు పంపగానే, ఆయన వెంటనే మమ్మల్ని పైకి రప్పించారు. నన్ను చూడగానే 'ఉర్రై డింభకా ఇలా కూర్చోరా' అని ప్రేమగా ఒళ్లో కూర్చోపెట్టుకున్నారు. నాన్నగారంటే ఆయనకు ఎంతో గౌరవం.

నాన్న జీవితమంతా సంబరంగా, అర్థవంతంగా గడిచిపోయింది. ఏ ప్రభుత్వమూ నాన్నగారికి అవార్డులు ఇవ్వకపోయినా బాధపడలేదు. 2006లో నేను అందుకున్న కలైమామణి పురస్కారాన్ని నాన్నకి అంకితం చేశాను.

– సంభాషణ: **వైజయంతి పురాణపండ**
ఫొటోలు: **అనిల్ కుమార్ మోర్ల**

సేవాపథం

# మూగజీవాల అమ్మ




మనిషికి ఏదైనా అపాయం జరిగినా కన్నెత్తి చూడని, నోరెత్తి పలకరించని ఈ సమాజంలో మూగజీవాల గాయాలకు మందు రాసి, బలి కాబోయే జీవాలను రక్షించి ప్రేమగా అక్కున చేర్చుకుంటున్నారు ఢిల్లీ వాసి అంజలి గోపాలన్. 'ఆల్ క్రియేచర్స్ గ్రేట్ అండ్ స్మాల్' అనే పేరుతో మూగజీవాలకు ఆశ్రమం ఏర్పాటు చేసిన అంజలి ప్రతీ మూగజీవి ఆరోగ్యం, పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ఒక గేదె కాలి వెనుక భాగంలో గాయమై ఎటూ కదలక ఉండటం గమనించింది అంజలి గోపాల్. దాని కాలికి కట్టుకట్టి, మేత వేసింది. ఎంతకాలం ఎదురు చూసినా దాని సంబంధీకులు ఎవరూ రాలేదు. దాంతో తను స్థాపించిన షెల్టర్‌కి చేర్చింది అంజలి. దానికి భీమ్ అని పేరు పెట్టింది. భీమ్ 700 మూగజీవాల్లో ఒకటిగా చేరింది. అన్ని జీవాలకు ఒక్కో పేరు పెట్టి, తాను పెట్టిన పేరుతో వాటిని పిలుస్తూ బిడ్డల్లా సాకుతుంది అంజలి గోపాలన్.

ఈ ఆశ్రమంలో వందకు పైగా కన్ను, చెవులు పోయిన జీవాలున్నాయి. ఈ మూగజీవాల గురించి అంజలి మాట్లాడుతూ 'మానవ ప్రపంచంలో ఎందుకూ పనికి రావనుకున్న జీవాలను ఏదో విధంగా చంపేస్తుంటారు. అలాంటి దృశ్యాలను చూసి, మనసు చెదిరి ఈ షెల్టర్‌ను ఏర్పాటు చేశాను' అని చెబుతారు.





## గాయాలకు మందు

ఢిల్లీ కుతుబ్ మినార్ నుండి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫరీదాబాద్ జిల్లాలోని సిలఖారీ గ్రామంలో అంజలి గోపాలన్ ఈ మూగజీవాల ఆశ్రమం నడుపుతోంది. 1994లో ఢిల్లీలో హెచ్ఐవి బాధితుల కోసం ఆశ్రమాన్ని స్థాపించిన సామాజిక కార్యకర్త ఆమె. ఇప్పుడు ఈ ప్రాంతానికి సందర్శకులూ వచ్చి చూస్తుంటారు.



'2012లో ఈ షెల్టర్‌ను ప్రారంభించినప్పుడు చుట్టుపక్కల అంతా ఇదో 'పిచ్చి' ప్రయోగం అన్నారు. రాజధానిలో అంజలి ఒక జంతువుల ఆశ్రమాన్ని చూసినప్పుడు అక్కడ ఉంచిన జంతువుల స్థితిని చూసి భయపడ్డారు. జంతువులకు నరకంగా ఉన్న ఆ పరిస్థితులను చూసి మానవులుగా మనం మరింత పాపం చేస్తున్నట్టు భావించారు. కానీ, సరైన స్థలం ఎక్కడా దొరకలేదు. హెచ్ఐవి సోకిన వ్యక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమం అప్పటికే బాధితులతో నిండి ఉంది. అప్పుడే అంజలి ఫరీదాబాద్‌లో రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి, షెల్టర్ ఏర్పాటు చేశారు.. వృద్ధాప్యం, అనారోగ్యం, గాయాల కారణంగా బయట జీవించలేని కుక్కలను ఈ షెల్టర్‌లో ఉంచాలనుకుంది. ముందు 55 శునకాలతో ప్రారంభమైంది. ఇప్పుడు ఈ షెల్టర్‌లో 460 జీవాలు సేదతీరుతున్నాయి.

## రక్షణ కేంద్రం

మెల్ల మెల్లగా కొన్నాళ్లకు పెద్ద జంతువులు రావడం మొదలైంది. దీంతో ఒక్కోరకం జంతువులకు ఒక్కో తరహా స్థలం కేటాయించారు. ఈ షెల్టర్‌కి వచ్చిన ప్రతి జీవి వైద్యచికిత్స పూర్తయ్యాక గాని ఇక్కడ నుంచి బయటకు రాదు. 23 మంది సిబ్బంది వీటిని పర్యవేక్షిస్తుంటారు. 'ఈ జీవాలను చూస్తే మానవ క్రూరత్వం ఎంతటిదో అర్థమవుతుంది' అంటుంది అంజలి. 'జైపూర్ నుంచి ఒక యువకుడు ఒంటెను తీసుకొచ్చాడు. దానికి ఎలాంటి పోషణ లేదు. పైగా దాని తలమీద సుత్తితో తీవ్రంగా బాదిన గాయం. ఆ గాయం నయం కావడానికి ఐదేళ్లు పట్టింది. అలాగే కత్తికి బలికాబోయే సమయంలో రక్షించిన 20 మేకలు ఇక్కడ ఉన్నాయి. పొడవాటి జుట్టు, గడ్డం అంత పొడవుగా వేలాడే చెవులు ఉన్న ఓ పర్వత మేక, వైద్య పరిశోధన కోసం తీసుకెళ్లి కోయాలనుకున్న మేక.. ఇలా ఒక్కోటి రక్షింపబడి ఇక్కడకు చేరుకున్నవాటిలో ఉన్నాయి.

కుక్కలను, ఆవులను ప్రేమగా నిమిరి, గేదెలు, దూడలు సమూహంతో కాసేపు గడిపి ఈమూ పక్షులతో సంభాషించడంతో అంజలి గోపాలన్ రోజు గడుస్తుంది.

– ఆరెన్నార్

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

బుధవారం 18-12-2019


# జీతాల్లో పెరుగుదల భారత్‌లోనే ఎక్కువ!

» వచ్చే ఏడాది జీతాల్లో 9.2 శాతం వృద్ధి అంచనా
» ద్రవ్యోల్బణాన్ని మినహాయిస్తే వాస్తవ పెరుగుదల 5.1శాతం
» తాజా సర్వేలో వెల్లడి
» ప్రపంచ సగటు వాస్తవ జీతాల పెరుగుదల 2.1 శాతమే

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రభావం కనిపిస్తోంది. మాంద్యం పరిస్థితుల్లో.. కంపెనీలు వ్యయ నియంత్రణలో భాగంగా.. ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం.. జీతాలు పెంచకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం వంటి సర్వసాధారణమే! భారత్‌లోనూ వివిధ రంగాలపై మాంద్యం ప్రభావం మొదలైందనే వార్తల నేపథ్యంలో.. తాజా సర్వే ఓ ఆసక్తికర విషయం వెల్లడించింది. 2020లో ప్రపంచం మొత్తం మీద భారత్‌లోనే జీతాల్లో పెరుగుదల అధికంగా ఉంటుందని పేర్కొంది.



శాలరీ ట్రెండ్స్

భారతదేశంలో వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు 2020లో దాదాపు 9.2 శాతం మేర జీతాలు పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతోంది కోర్న్ ఫెర్రీ గ్లోబల్ సాలరీ ఫోర్‌క్యాస్ట్ అనే సంస్థ. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం దేశంలో జీతాల్లో వాస్తవ పెరుగుదల 5.1 శాతంగా ఉంటుందని తెలిపింది. దేశ వ్యాప్తంగా వివిధ సంస్థలతో తాము మాట్లాడినప్పుడు జీతాల పెంపుదలకు మొగ్గు చూపినట్లు పేర్కొంది.

### పనితీరు ఆధారంగానే

భారత్‌లో ఉద్యోగుల జీతాల్లో వృద్ధి అందరికీ ఒకే విధంగా కాకుండా.. ఆయా ఉద్యోగుల పనితీరు ఆధారంగా పెరుగుదలలో హెచ్చుతగ్గులు ఉంటాయని వెల్లడించింది. బాగా పనిచేసే వారు.. సగటు పనితీరు కనబరిచే వారు.. కీలకమైన విభాగాల్లో పనిచేసే వారు.. ఇలా ఉద్యోగులను వేర్వేరు కేటగిరీలుగా విభజించి జీతాలను పెంచే అవకాశముందని తెలిపింది. అలాగే స్థిర వేతనం(ఫిక్స్‌డ్ శాలరీ)లో పెరుగుదల నెమ్మదిగా ఉంటుందని పేర్కొంది. అయితే అత్యున్నత పనితీరు చూపే ఉద్యోగులు మాత్రం ప్రోత్సాహకాల(ఇన్‌సెంటివ్స్) కారణంగా భారీ మొత్తంలోనే జీతాలు అందుకుంటారని సర్వే వెల్లడించింది.

### ప్రపంచ వ్యాప్తంగా ఇలా

- 2020కి సంబంధించి భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లో ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల ఎలా ఉంటుంది అనే అంశంపై కోర్న్ ఫెర్రీ సర్వే చేసింది.
- ప్రపంచ వ్యాప్తంగా 2020లో సగటున 4.9 శాతం మేర జీతాలు పెరగనున్నట్లు సర్వే వెల్లడించింది. ప్రపంచ ద్రవ్యోల్బణం 2.8 శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం వాస్తవ జీతాల పెరుగుదల 2.1 శాతంగానే ఉంటుంది.
- మొత్తంగా చూస్తే ఆసియా దేశాల్లోనే జీతాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతాయని సర్వే అంచనా వేసింది. ఆసియాలో 2020లో 5.3 శాతం పెరుగుదల ఉంటే... అందులో ద్రవ్యోల్బణం 2.2 శాతం సర్దుబాటు చేస్తే.. వాస్తవ జీతాల వృద్ధి 3.1 శాతం మేర ఉండనుంది.
- ఆసియా దేశాలలో చేసిన అధ్యయనం ప్రకారం –ద్రవ్యోల్బణాన్ని పక్కన పెడితే ఇండోనేషియాలో 8.1 శాతం, మలేసియాలో 5శాతం, చైనాలో 6శాతం, కొరియాలో 4.1 శాతం మేర జీతాల్లో పెరుగుదల నమోదుకానున్నట్లు సర్వే పేర్కొంది. ఆసియా దేశాల్లో తక్కువగా జీతాల పెరుగుదల జపాన్‌లో 2 శాతం,తైవాన్‌లో 3.9 శాతం మేర ఉంటుందని కార్న్ ఫెర్రీ తన నివేదికలో పేర్కొంది.
- నార్త్ అమెరికాలో ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల 2020లో 2.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. గత ఏడాది వృద్ధి తిరిగి పునరావృతం అవుతుందని తెలిపింది. కానీ ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. ఇది 1.1 శాతంగా ఉంటుందని పేర్కొంది.
- అమెరికాలో గతేడాదిలాగే సగటున 3శాతం మేర జీతాల్లో వృద్ధి నమోదు కానుంది. 1.6 శాతం ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేస్తే యూఎస్ ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల 1.4 శాతం మాత్రమే.
- యునైటెడ్ కింగ్‌డమ్‌లోనూ ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల 2.5 శాతం ఉండగా.. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం వాస్తవ జీతాల పెరుగుదల 0.4 శాతమే.
- కెనడాలోనూ గతేడాదిలాగే 2.6 శాతం మేర జీతాల్లో పెరుగుదల ఉంటుంది. ఇక్కడ కూడా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం జీతాల్లో వాస్తవ వృద్ధి 0.7 శాతమే.
- ఈస్టర్న్ యూరప్ దేశాల్లో 2020లో ఉద్యోగుల జీతాల్లో పెరుగుదల 6.2 శాతంగా ఉండగా.. ద్రవ్యోల్బణాన్ని మినహాయిస్తే ఇది 2.6 శాతంగా ఉంటుందని అంచనా.
- వెస్టర్న్ యూరప్‌లోని ఉద్యోగుల జీతాల పెరుగుదల 2.5శాతంగా ఉండగా.. ద్రవోల్బణాన్ని మినహాయిస్తే 1.2శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది.

### అధ్యయనం ఇలా

ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 130 దేశాల్లో 25 వేల సంస్థల నుంచి దాదాపు 2 కోట్ల మంది ఉద్యోగుల డేటా ఆధారంగా కోర్న్ ఫెర్రీ తన నివేదికను రూపొందించినట్లు పేర్కొంది.




# కొత్తగా ప్రయత్నించండి

**చదువుల పట్టా చేతిలో ఉంది. ఉద్యోగం సంపాదించాలి. ఓవైపు కొలువుల కోత నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కోరుకున్న జాబ్ దక్కించుకోవడం అంత తేలిక కాదు. ఆల్ రౌండ్ ప్రతిభ ప్రదర్శిస్తే తప్ప.. ఆఫర్ లెటర్ అందే అవకాశం కనిపించడంలేదు. కాబట్టి అభ్యర్థులు రెజ్యూమె దగ్గర నుంచి ఇంటర్వ్యూ పూర్తయ్యే వరకూ.. అడుగడుగునా అప్రమత్తంగా ఉంటేనే ఉద్యోగం లభించే వీలుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న అభ్యర్థులు.. కృషి, పట్టుదల, ప్రణాళికతో ముందుకుసాగితే.. కోరుకున్న కొలువును సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో... ఉద్యోగాన్వేషణలో ఉపయోగపడే టిప్స్...**

> నచ్చే కొలువుపై స్పష్టత అవసరం
>
> వైఫల్యాలు ఎదురైనా బెదరొద్దు
>
> ఉద్యోగ సాధనలో సాఫ్ట్‌స్కిల్స్, ఇంగ్లిష్ నైపుణ్యాలు కీలకం

### వైఫల్యాలు సహజం

ఉద్యోగం పరంగా ఏ రంగం వైపు వెళ్లాలనుకుంటున్నారో ముందుగా నిర్ణయం తీసుకోండి. ఎంచుకునే రంగంలో అందుబాటులో ఉన్న విభిన్న అవకాశాల గురించి అధ్యయనం చేయండి. దీనివల్ల మనకు ఎలాంటి కొలువు సరిపోతుందో తెలుస్తుంది. ఉద్యోగ ప్రయత్నాల్లో వైఫల్యాలు సహజమేనని అంగీకరించాలి. ఒకట్రెండు అవకాశాలు చేజారినా.. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు. తొలుత మన ఉద్యోగ ప్రయత్నాలు ఫలించడంలేదనే ఆలోచన వదిలేయాలి. ఎక్కడ వైఫల్యం ఎదురవుతోంది.. మన లోపాలేంటో గుర్తించే ప్రయత్నం చేయాలి. ఎక్కడ పొరపాట్లు చేస్తున్నాం.. వాటిని సరిదిద్దుకోవడం ఎలాగో తెలుసుకోవాలి.మెరుగుపరచుకోవాల్సిన అంశాలను ఒక కాగితంపై రాసుకొని..తదుపరి ఇంటర్వ్యూలో అవే పొరపాట్లు మళ్లీ చేయకుండా జాగ్రత్తపడాలి.

### చదువుకు తగ్గ కొలువు

ఉన్నతస్థాయి విద్యార్హతలు ఉన్నాయి కదా..! అని పెద్ద పెద్ద ఉద్యోగాలకు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మొదట మన చదువుకు తగ్గ చిన్నస్థాయి ఉద్యోగమైనా సరే.. దానికే విలువ ఇవ్వండి. అనుభవం, నైపుణ్యం వచ్చే కొద్దీ పెద్ద ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా చాలామంది విషయంలో చదివిన చదువుకు దరఖాస్తు చేసే కొలువుకు పొంతన ఉండదు. ఒకవేళ ప్రయత్నాలు ఫలించి అవకాశం దక్కించుకున్నా.. భవిష్యత్‌లో కెరీర్ పరంగా ఇబ్బందులు ఎదురయ్యే ఆస్కారం ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు చదువుకు తగ్గ ఉద్యోగం ప్రయత్నం చేయడం మేలన్నది నిపుణుల సలహా! మీరు మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులైతే.. దానికి సంబంధించిన రంగంలో ఉద్యోగాన్వేషణ కొనసాగించడం మంచిది. సంబంధిత సబ్జెక్టుపై తగిన పట్టు లేదనిపిస్తే.. నిపుణులను సంప్రదించడం లేదా మూక్స్ ద్వారానో అవసరమైన పరిజ్ఞానం పెంచుకోవాలి.

### రెజ్యూమె ఇలా

అభ్యర్థులు రెజ్యూమె సిద్ధం చేస్తున్న సమయంలో కొన్ని ముఖ్య విషయాలను గుర్తుపెట్టుకోవాలి. విద్యార్థిగా చూపిన ప్రతిభాపాటవాలు, సాధించిన విజయాలు, నైపుణ్యాల వివరాలు రెజ్యూమెలో ప్రముఖంగా పేర్కొనాలి. ఫ్రెషర్స్‌కు ఉద్యోగానుభవం ఉండదు. కాబట్టి చేరాలనుకుంటున్న కొలువుపై తమకున్న ఆసక్తిని, విద్యార్హతలను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. అలాగే ఇంటర్వ్యూ సమయంలో రెజ్యూమెలో పేర్కొన్న అంశాలను మాత్రమే చెప్పాలి. అందుకోసం ఇంటర్వ్యూకు వెళ్లేముందు రెజ్యూమెలో పేర్కొన్న అంశాలను ఒకటికి రెండుసార్లు చూసుకొని వెళ్లాలి. అదేవిధంగా ఇంటర్వ్యూలో రెజ్యూమెలోని అంశాలపైనే ప్రశ్నలు అడగాలనే నియమం ఏమీలేదు. జనరల్ ప్రశ్నలు కూడా ఎదురయ్యే అవకాశముంది. అదే విధంగా గ్రూప్ డిస్కషన్‌లో సమాజంలోని ఏదైనా ఒక సమస్యను ఇచ్చి చర్చించమంటారు. ఉదాహరణకు యువతపై సోషల్ మీడియా ప్రభావం వంటివి. కాబట్టి తాజా పరిణామాలు, కరెంట్ అఫైర్స్‌పై నిత్యం అవగాహన పెంచుకోవాలి.

### ఆన్‌లైన్ వేదికలు

ప్రస్తుతం ఉద్యోగాలు, ఖాళీల సమాచారమంతా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటోంది. ఆయా కంపెనీల అధికారిక వెబ్‌సైట్‌లో విస్తృత సమాచారం లభిస్తోంది. కాబట్టి సదరు జాబ్ పోర్టల్స్‌లో, కంపెనీల కెరీర్ కాలమ్స్‌లో రెజ్యూమెను అప్‌లోడ్ చేస్తుండాలి. ఫలితంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్, మెయిల్స్, మెసేజ్‌ల రూపంలో ఖాళీల వివరాలు తెలుస్తాయి. ముఖ్యంగా లింక్డ్ఇన్, ఇండీడ్, మోన్‌స్టర్ వంటి జాబ్ పోర్టల్స్‌తోపాటు ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సోషల్ మీడియాలోనూ రెజ్యూమెను పెట్టొచ్చు.

### వేతనం తక్కువైనా

నచ్చిన కంపెనీలో మెచ్చిన కొలువు వస్తేనే చేస్తా.. లేకుంటే లేదు అనే పంతంతో చాలామంది ఖాళీగా ఉంటారు. చదువుకు, ఉద్యోగానికి మధ్య.. ఒక్క ఏడాది గ్యాప్ వచ్చినా.. ఎందుకు ఖాళీగా ఉన్నావనే ప్రశ్న ఎదురవుతుంది. అక్కడ మన ప్రతిభపై సందేహం తలెత్తే ఆస్కారం ఉంటుంది. కాబట్టి తొలి ఉద్యోగం విషయంలో భేషజాలకు పోకుండా ఏదో ఒక కంపెనీలో చేరి అనుభవం గడించే ప్రయత్నంచేయాలి. అలాగే జీతం విషయంలోనూ మొండి పట్టుదలతో వ్యవహరించొద్దు. మొదట తక్కువ వేతనం లభించినా.. పని నేర్చుకొని.. భవిష్యత్‌లో వేరే కంపెనీల్లో ఎక్కువ ప్యాకేజీలు డిమాండ్ చేసే అవకాశం ఉంటుంది.




### నైపుణ్యాలు ముఖ్యం

ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగానికి దరఖాస్తు చేసినా.. ఏ ఇంటర్వ్యూకు వెళ్లినా.. మన విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవం గురించి తప్పనిసరిగా అడుగుతారు. ప్రతి సంస్థ తమకు నైపుణ్యం కలిగిన అభ్యర్థులు కావాలని కోరుకుంటుంది. అందుకే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కొంత ప్రతిభ కనబర్చిన అభ్యర్థులు కూడా ఉద్యోగాలు పొందుతారు. మరికొంత మంది తమకు ప్రతిభ ఉన్నా.. ప్రదర్శన లోపం కారణంగా అవకాశం సంపాదించుకోలేరు. కాబట్టి అభ్యర్థులు నైపుణ్యాలపై ప్రధానంగా దృష్టిపెట్టాలి. ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగిస్తున్నవారు.. తాము చదివిన విభాగానికి సంబంధించిన కోర్ సబ్జెక్టులపై తాజా సమాచారంతో నిత్యం అవగాహన పెంచుకుంటుండాలి. అదే సమయంలో ఇంటర్వ్యూలో రాణించేలా.. సాఫ్ట్ స్కిల్స్, ఇంగ్లిష్‌లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి.

## ప్రవేశాలు

### ఎయిమ్స్ (బీఎస్సీ) 2020 ప్రవేశాలు

**న్యూఢిల్లీలోని** ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. వివిధ బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకై ఎయిమ్స్ (బీఎస్సీ)–2020 నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **కోర్సులు:** బీఎస్సీ (నర్సింగ్, పోస్ట్ బేసిక్, పారామెడికల్) కోర్సులు.
- **అర్హత:** ఇంటర్మీడియట్ (బైపీసీ)/10+2 ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **ముఖ్య తేదీలు:**
  - » **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** జనవరి 16, 2020.
  - » **దరఖాస్తుకు చివరితేదీ:** మే 4, 2020.
- **పరీక్ష తేదీలు:**
  - » **బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్):** జూన్ 6, 2020
  - » **బీఎస్సీ (పారామెడికల్ కోర్సులు):** జూన్ 20, 2020.
  - » **బీఎస్సీ (హెచ్) నర్సింగ్:** జూన్ 28, 2020.
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org




## జాబ్ పాయింట్




### యూపీఎస్సీ-30

**యూనియన్** పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 30 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్–1, డిప్యూటీ రిజిస్ట్రార్–3, ఆంత్రోపాలజిస్ట్–2, అసిస్టెంట్ కీపర్–2, సైంటిఫిక్ ఆఫీసర్–4, అసిస్టెంట్ డైరెక్టర్–5, ప్రిన్సిపల్–1, అసిస్టెంట్ ప్రొఫెసర్–3, ప్రొఫెసర్–1, సీనియర్ లెక్చరర్–5, అసిస్టెంట్ ఇంజనీర్–3.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ, బీటెక్, గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 2, 2020.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

### ఎస్‌పీఎంసీఐఎల్-30

**ముంబైలోని** సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 30 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** సూపర్‌వైజర్–1, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–6, సెక్రటేరియల్ అసిస్టెంట్–1, జూనియర్ బులియన్ అసిస్టెంట్–4, జూనియర్ టెక్నీషియన్–18.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత ట్రేడ్/సబ్జెక్టుల్లో ఐటీఐ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** 2020, జనవరి 3 నాటికి 25–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 3, 2020.
- **వెబ్‌సైట్:** http://igmmumbai.spmcil.com

### డీఎంఆర్‌సీ-1493

**భారత** ప్రభుత్వం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించిన ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్(డీఎంఆర్‌సీ)..వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 1493 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఇంజనీర్, ఫైర్ ఇన్‌స్పెక్టర్, ఆర్కిటెక్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామర్, లీగల్ అసిస్టెంట్ తదితర పోస్టులున్నాయి.
- **విభాగాలు:** ఎలక్ట్రికల్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సివిల్, ఆపరేషన్స్, ట్రాఫిక్, ఫైనాన్స్, లీగల్, ఎన్విరాన్‌మెంట్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, డిసెంబర్ 1 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 13, 2020.
- **వెబ్‌సైట్:** www.delhimetrorail.com

### సెంట్రల్ రైల్వే-21

**ముంబై** ప్రధాన కేంద్రంగా ఉన్న కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ రైల్వేలో ఖాళీగా ఉన్న 21 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి పురుషులు, మహిళల నుంచి రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** బాస్కెట్‌బాల్, క్రికెట్, హాకీ, రెజ్లింగ్,కబడ్డీ,వాలీబాల్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంటర్మీడియట్/10+2, ఐటీఐ, ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2020, జనవరి 1 నాటికి 18–25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** సంబంధిత క్రీడలో ట్రెయిల్స్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ, ఎక్స్–సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250).
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 17, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019.
- **వెబ్‌సైట్:** http://rrccr.gov.in

### ఎస్ఈసీఆర్-26

**బిలాస్‌పూర్** (ఛత్తీస్‌గఢ్) ప్రధాన కేంద్రంగా ఉన్న సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే (ఎస్ఈసీఆర్)లో ఖాళీగా ఉన్న 26 స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, క్రికెట్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంటర్మీడియట్, ఐటీఐ, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, సంబంధిత క్రీడలో జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి.
- **వయసు:** 2020, జనవరి 1 నాటికి 18–25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఫీల్డ్ ట్రయల్స్, సంబంధిత క్రీడలో విజయాలు, విద్యార్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 13, 2020.
- **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

### కోల్ ఇండియా-1326

**భారత** ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన కోల్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 1326 మేనేజ్‌మెంట్ ట్రెనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** మైనింగ్–288, ఎలక్ట్రికల్–218, మెకానికల్–258, సివిల్–68, కోల్ ప్రిపరేషన్–28, సిస్టమ్స్–46, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్–28, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్–254, పర్సనల్ అండ్ హెచ్ఆర్–89, మార్కెటింగ్ అండ్ సేల్స్–23, కమ్యూనిటీ డెవలప్‌మెంట్–26.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత.
- **వయసు:** 2020, ఏప్రిల్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీలు:** 2020, ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000.
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 21, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 19, 2020.
- **వెబ్‌సైట్:** www.coalindia.in


epaper.sakshi.com

# నిలవాలంటే గెలవాలి

**భారత జట్టు సొంతగడ్డపై ఎప్పుడో 15 ఏళ్ల క్రితం వరుసగా రెండు వన్డే సిరీస్‌లు ఓడిపోయింది. స్వదేశంలో గతంలో ఎప్పుడూ వరుసగా ఐదు వన్డేలు ఓడిన పరాభవం కూడా ఎప్పుడూ ఎదుర్కోలేదు. కానీ విశాఖ వేదికగా రెండో మ్యాచ్‌లో తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చకపోతే మాత్రం ఈ రెండు చెత్త రికార్డులు మన ఖాతాలో చేరతాయి. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా చేతిలో వరుసగా మూడు వన్డేలు ఓడి సిరీస్ కోల్పోయిన టీమిండియా... ఇప్పుడు వెస్టిండీస్‌కు ఆ అవకాశం ఇవ్వరాదని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య రెండో వన్డేకు రంగం సిద్ధమైంది. భారత్‌కు అచ్చొచ్చిన వేదికల్లో వైజాగ్ ఒకటి కాగా... ఇక్కడ ఎదురైన ఏకైక పరాజయం విండీస్ చేతిలోనే కావడం గమనార్హం.**

## సిరీస్ కాపాడుకునే ప్రయత్నంలో టీమిండియా

- నేడు వెస్టిండీస్‌తో రెండో వన్డే
- విశాఖపట్నం వేదికగా పోరు
- మరో విజయంపై విండీస్ కన్ను

**మధ్యాహ్నం గం. 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**సాక్షి, విశాఖపట్నం:** వెస్టిండీస్‌పై టి20 సిరీస్ గెలుచుకున్న తర్వాత చెన్నై వన్డేలో అనూహ్య పరాజయం భారత్‌ను నేలకు దించింది. గత మ్యాచ్‌లో టాపార్డర్ వైఫల్యంతో ఓటమిని ఎదుర్కొన్న కోహ్లి సేన ఇప్పుడు పట్టుదలగా తర్వాతి సమరానికి సిద్ధమైంది. డాక్టర్ వైఎస్ ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా నేడు జరిగే పోరులో ఇరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌లో నిలిచే స్థితిలో టీమిండియా ఉండగా... మరో దూకుడైన విజయంతో 2002 తర్వాత భారత గడ్డపై వన్డే సిరీస్‌ను అందుకోవాలని పొలార్డ్ బృందం పట్టుదలతో ఉంది.

### చహల్‌కు చోటు!

చెన్నైలాంటి నెమ్మదైన పిచ్‌పై 288 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత్ విఫలమైంది. భారత బ్యాటింగ్ పటిష్టంగానే ఉన్నా... బౌలింగ్ వైఫల్యం విండీస్ పనిని సులువు చేసింది. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్‌కంటే ఒక స్పెషలిస్ట్ బౌలర్ అదనంగా జట్టులో ఉంటే మంచిదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. భిన్నమైన బంతులతో ప్రత్యర్థిని దెబ్బ తీయగల యజువేంద్ర చహల్‌పై అందరి దృష్టి నిలిచింది. గత మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా కలిసి పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో ఈ లెగ్ స్పిన్నర్‌కు అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే శివమ్ దూబే, జడేజాలలో ఒకరిని పక్కన పెట్టే అవకాశం ఉంది. చెన్నై మ్యాచ్‌లో దూబే ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి విఫలమయ్యాడు. బౌలింగ్‌లోనూ రాణించలేకపోయాడు. ఇక షమీ, దీపక్ చాహర్ కూడా మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాల్సి ఉంది. బౌలింగ్‌లో కేదార్ జాదవ్ ప్రత్యేకత చూపించకపోయినా అతను చేసిన కీలక పరుగులు జట్టులో స్థానానికి ఢోకా లేకుండా చేశాయి. సుదీర్ఘ కాలం తర్వాత భారత టాప్-3 బ్యాట్స్‌మెన్ విఫలం కావడం చెన్నై మ్యాచ్‌లోనే జరిగింది. విశాఖలో అద్భుత రికార్డు ఉన్న కోహ్లి, రోహిత్‌లలో ఏ ఒక్కరు చెలరేగినా విండీస్‌కు కష్టాలు తప్పవు. రెండో ఓపెనర్‌గా రాహుల్ బాగా ఆడుతున్నాడు కాబట్టి మయాంక్ అగర్వాల్‌కు ప్రస్తుతానికి అవకాశం లేదు. యువ ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ రాణించడం భారత్‌కు శుభసూచకం. తొలి వన్డేలో ఓటమి పలకరించినా ఓవరాల్‌గా భారత జట్టు పటిష్టంగానే ఉంది. అందరూ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే గెలుపు కష్టం కాకపోవచ్చు.

### లూయిస్ పునరాగమనం!

సిరీస్‌లో శుభారంభం చేయడం వెస్టిండీస్ ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచిందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా హెట్‌మైర్, షై హోప్ బ్యాటింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కీలక సమయంలో ఒత్తిడిని తట్టుకొని వీరిద్దరు బాగా ఆడి 218 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడం అందరి ప్రశంసలకు కారణమైంది. సరిగ్గా ఏడాది క్రితం ఇదే వైజాగ్ వేదికపై వీరిద్దరు చక్కటి ఇన్నింగ్స్‌లతో తమ జట్టును ఓటమి నుంచి కాపాడి మ్యాచ్‌ను 'టై'గా ముగించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో చెలరేగితే భారత బౌలర్లు ఇబ్బంది పడాల్సిందే. పూరన్, పొలార్డ్‌లతో జట్టు బ్యాటింగ్ మరింత బలంగా కనిపిస్తోంది. మరో భారీ హిట్టర్ ఎవిన్ లూయిస్ గాయం నుంచి కోలుకుంటే అతను ఆంబ్రిస్ స్థానంలో జట్టులోకి వస్తాడు. బ్యాటింగ్‌కు అనుకూలమైన విశాఖ పిచ్‌పై పేసర్లు కాట్రెల్, జోసెఫ్, హోల్డర్ ఎలా ప్రత్యర్థిని నిలువరిస్తారనేది ఆసక్తికరం. స్పిన్నర్లు వాల్ష్, ఛేజ్ కూడా గత మ్యాచ్‌లో మెరుగ్గానే బౌలింగ్ చేశారు. అయితే మొత్తంగా చూస్తే విండీస్ విజయరహస్యం, బలమంతా ఆ జట్టు విధ్వంసక బ్యాటింగ్‌పైనే ఆధారపడి ఉంది. కాబట్టి బ్యాట్స్‌మెన్ చెలరేగితే చిరస్మరణీయ సిరీస్ వారి ఖాతాలో చేరవచ్చు. విండీస్ మాజీ క్రికెటర్ బాసిల్ బుచర్ (86 ఏళ్లు) మృతికి సంతాపంగా నేటి మ్యాచ్‌లో విండీస్ క్రికెటర్లు చేతికి నల్ల బ్యాడ్జిలు ధరించి ఆడతారు.



హెట్‌మైర్
షై హోప్

### తుది జట్ల వివరాలు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్, రాహుల్, అయ్యర్, పంత్, జాదవ్, జడేజా, దూబే/చహల్, చాహర్, షమీ, కుల్దీప్.

**విండీస్:** పొలార్డ్ (కెప్టెన్), షై హోప్, ఆంబ్రిస్/లూయిస్, హెట్‌మైర్, పూరన్, ఛేజ్, హోల్డర్, కీమో పాల్, వాల్ష్, జోసెఫ్, కాట్రెల్.

### పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలం. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. అయితే డిసెంబర్ మాసం కావడంతో రాత్రి మంచు ప్రభావంతో బౌలర్లకు పట్టు చిక్కడం కష్టంగా మారిపోవచ్చు. దీంతో పాటు ఛేదననే ఇరు జట్లు ఇష్టపడుతున్నాయి కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడం లాంఛనమే. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

**6**
ఈ మైదానంలో భారత్ 8 మ్యాచ్‌లు ఆడి 6 గెలవగా, 1 మ్యాచ్‌లో (వెస్టిండీస్ చేతిలోనే) ఓటమి పాలైంది. భారత్, విండీస్ జట్ల మధ్య గత ఏడాది ఇక్కడ జరిగిన మ్యాచ్ 'టై'గా ముగిసింది.

**556**
విశాఖలో కోహ్లి చేసిన పరుగులు. 5 ఇన్నింగ్స్‌లలో అతను ఏకంగా 139 సగటుతో ఈ పరుగులు సాధించడం విశేషం. ఇందులో 3 సెంచరీలు, 2 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

**400**
ఈ మ్యాచ్‌తో విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో 400 మ్యాచ్‌లు (మూడు ఫార్మాట్‌లలో కలిపి) పూర్తి చేసుకోనున్నాడు. ఇప్పటివరకు అతను 84 టెస్టులు, 240 వన్డేలు, 75 టి20 మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి కోహ్లి మొత్తం 21,359 పరుగులు చేశాడు. ఇందులో 70 సెంచరీలు, 100 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



పిచ్‌ను పరిశీలిస్తున్న జడేజా, ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్



నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో రిషభ్ పంత్

## ప్రపంచ ఉత్తమ జూనియర్ రెజ్లర్ దీపక్

యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ వార్షిక అవార్డులు



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రదర్శన చేసిన భారత యువ రెజ్లర్ దీపక్ పూనియాకు తగిన గుర్తింపు లభించింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) వార్షిక పురస్కారాల్లో 18 ఏళ్ల దీపక్ 'జూనియర్ ఫ్రీస్టయిల్ రెజ్లర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యాడు. ఈ సంవత్సరం దీపక్ జూనియర్‌తోపాటు సీనియర్ విభాగంలోనూ మెరిశాడు. ఆగస్టులో ఎస్తోనియాలో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో 86 కేజీల విభాగంలో దీపక్ విజేతగా నిలిచి స్వర్ణం సాధించాడు. ఈ క్రమంలో 18 ఏళ్ల తర్వాత జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తొలి భారత రెజ్లర్‌గా అతను ఘనత సాధించాడు. అనంతరం సెప్టెంబరులో కజకిస్తాన్ రాజధాని నూర్ సుల్తాన్‌లో జరిగిన ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో 86 కేజీల విభాగంలో రెండో స్థానంలో నిలిచి రజతం గెలిచాడు. దాంతోపాటు వచ్చే ఏడాది టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌నూ సొంతం చేసుకున్నాడు. 'చాలా సంతోషంగా ఉన్నాను. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జూనియర్ రెజ్లర్లలో నన్ను మేటి రెజ్లర్‌గా గుర్తించినందుకు గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ అవార్డు నాలో మరింత ఉత్సాహన్ని పెంచుతుంది' అని 2016లో క్యాడెట్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన దీపక్ వ్యాఖ్యానించాడు.

## బుమ్రా వచ్చేశాడు

### భారత జట్టుతో కలిసి సాధన



బుమ్రా

**సాక్షి, విశాఖపట్నం:** వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ముందు భారత జట్టు ప్రాక్టీస్ సెషన్‌లో ఒకే ఒక ఆటగాడు ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. అయితే అతను జట్టు సభ్యుడు కాదు, ఈ మ్యాచ్‌కు బరిలోకి దిగడం లేదు! ఆ వ్యక్తి స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా. వెన్ను గాయంతో కొంత కాలంగా జట్టుకు దూరమైన అతను తొలిసారి టీమిండియా సాధనలో భాగమయ్యాడు. గాయం నుంచి కోలుకుంటున్న సమయంలో గత కొంత కాలంగా బుమ్రా సొంతంగా నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ వచ్చాడు. కానీ మొదటిసారి అతను ఒక సిరీస్ సందర్భంగా జట్టుతో కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. మంగళవారం బుమ్రా బౌలింగ్‌ను కోచ్ రవిశాస్త్రి, సెలక్టర్ దేవాంగ్ గాంధీ పర్యవేక్షించారు. రిషభ్ పంత్, పాండే, మయాంక్‌లకు బుమ్రా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాడు. బంతులు విసిరే సమయంలో ఏ రకంగానూ అతను ఇబ్బంది పడినట్లు కనిపించలేదు. బుమ్రా ఫిట్‌నెస్ స్థాయిని బట్టి చూస్తే త్వరలోనే అతను జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. యువ ఆటగాడు పృథ్వీ షా కూడా ప్రాక్టీస్ సెషన్‌కు హాజరయ్యాడు. డోపింగ్ నిషేధం ముగిసిన తర్వాత దేశవాళీ క్రికెట్ బరిలో దిగిన షా త్వరలోనే పునరాగమనాన్ని ఆశిస్తున్నాడు. తన ఫిట్‌నెస్‌కు సంబంధించి ట్రైనర్ నిక్ వెబ్‌తో ఎక్కువ సేపు అతను సంభాషించాడు. ఆ తర్వాత ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్‌తో కలిసి అతను ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. మరోవైపు మంగళవారం ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్ కావడంతో భారత కెప్టెన్ కోహ్లి, వైస్ కెప్టెన్ రోహిత్, ఓపెనర్ రాహుల్ మాత్రం సాధనలో పాల్గొనలేదు.

## ఐసీసీ వన్డే, టి20 జట్లలో స్మృతి మంధాన

### ఆసీస్ క్రికెటర్ ఎలీస్ పెర్రీకి రెండు పురస్కారాలు



స్మృతి



పెర్రీ

**దుబాయ్:** భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధానకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన వార్షిక వన్డే, టి20 జట్లలో చోటు దక్కింది. ఈ ఏడాది కనబరిచిన ప్రదర్శన ఆధారంగా ఐసీసీ వార్షిక అవార్డులు, వుమెన్ టీమ్స్ ఆఫ్ ఇయర్‌ను ఎంపిక చేస్తారు. 23 ఏళ్ల ఈ భారత ఓపెనర్ రెండు టెస్టులతోపాటు 51 వన్డేలు, 66 టి20లు ఆడింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లలో ఆమె 3476 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో స్మృతి అద్భుతంగా రాణించింది. ఐసీసీ మహిళల వన్డే జట్టులో భారత్ నుంచి ఆమెతో పాటు బౌలర్లు జులన్ గోస్వామి, పూనమ్ యాదవ్, శిఖా పాండేలకు చోటు దక్కగా... టి20 జట్టులో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, స్పిన్నర్ రాధా యాదవ్ కూడా ఎంపికయ్యారు. ఐసీసీ ఇరు జట్లకు మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా) కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. కాగా... ఆస్ట్రేలియాకే చెందిన ఎలీస్ పెర్రీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'... 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైంది. ఎలిస్ పెర్రీ వన్డేల్లో ఈ సీజన్‌లో 73.50 సగటుతో 441 పరుగులు చేయడంతోపాటు 21 వికెట్లు తీసింది. ఈ ఏడాది ఆమె మూడు ఫార్మాట్‌లలోనూ నిలకడగా రాణించింది. మహిళల టి20 క్రికెట్‌లో 1000 పరుగులు చేయడంతోపాటు 100 వికెట్లు తీసిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. టి20 ఫార్మాట్‌లో ఆసీస్‌కే చెందిన అలీసా హీలీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు సొంతం చేసుకుంది.

## ఢిల్లీకి ఆంధ్ర పేసర్ల దెబ్బ

ఐదు వికెట్లతో మెరిసిన శశికాంత్ • ఢిల్లీ 216 ఆలౌట్



శశికాంత్

**సాక్షి, ఒంగోలు టౌన్:** బౌలర్లకు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఆంధ్ర పేసర్లు కేవీ శశికాంత్ (5/38), పైడికాల్వ విజయ్ కుమార్ (3/47), చీపురపల్లి స్టీఫెన్ (2/72) అదరగొట్టారు. ఢిల్లీ జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 70.5 ఓవర్లలో 216 పరుగులకే ఆలౌట్ చేశారు. ఫలితంగా మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ బాధ్యతాయుతంగా ఆడితే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించే అవకాశముంది. ఆట ముగిసే సమయానికి ఆంధ్ర 6 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 16 పరుగులు చేసింది. ఓపెనర్లు జ్ఞానేశ్వర్ (9), ప్రశాంత్ కుమార్ (0) అవుటవ్వగా... మనీశ్ (3 బ్యాటింగ్), కెప్టెన్ హనుమ విహారి (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. స్థానిక సీఎస్ఆర్ శర్మ కాలేజీ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఢిల్లీ జట్టు బ్యాట్స్‌మెన్‌ను ఆంధ్ర బౌలర్లు ఇబ్బంది పెట్టారు. ఓపెనర్ కునాల్ (0) ఖాతా తెరవకుండానే విజయ్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత ఢిల్లీ వికెట్ల పతనం కొనసాగింది. నితీశ్ రాణా (51 బంతుల్లో 51; 9 ఫోర్లు, సిక్స్), లలిత్ యాదవ్ (104 బంతుల్లో 50; 4 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలు చేసి ఢిల్లీని ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే శశికాంత్ ధాటికి ఢిల్లీ లోయర్ ఆర్డర్ క్రీజులో నిలబడలేకపోయింది.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో లక్ష్య సేన్



**న్యూఢిల్లీ:** గతవారం బంగ్లాదేశ్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువతార లక్ష్య సేన్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన 18 ఏళ్ల లక్ష్య సేన్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 32వ ర్యాంక్‌లో నిలిచాడు. సాయిప్రణీత్ 11వ స్థానంలో, కిడాంబి శ్రీకాంత్ 12వ స్థానంలో కొనసాగుతున్నారు. కశ్యప్ (23వ), ప్రణయ్ (26వ), సౌరభ్ వర్మ (28వ), సమీర్ వర్మ (33వ), శుభాంకర్ డే (44వ) ర్యాంకుల్లోనూ ఎలాంటి మార్పు లేదు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్ వరుసగా ఆరు, 11వ ర్యాంక్‌ల్లో నిలిచారు.

## భారత పర్యటనకు లబ్‌షేన్

### ఆస్ట్రేలియా వన్డే జట్టు ప్రకటన



**మెల్‌బోర్న్:** టెస్టుల్లో తన బ్యాటింగ్ జోరు కనబరుస్తున్న ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ లబ్‌షేన్ తాజాగా జాతీయ వన్డే జట్టులోకి ఎంపికయ్యాడు. భారత పర్యటన కోసం ప్రకటించిన ఆస్ట్రేలియా వన్డే జట్టులో అతనికి చోటు దక్కింది. గతేడాది టెస్టుల్లో అరంగేట్రం చేసిన లబ్‌షేన్ తాను ఆడిన గత మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో కదంతొక్కాడు. వచ్చే నెల భారత్‌కు రానున్న కంగారూ జట్టు జనవరి 14న ముంబైలో తొలి వన్డే, 17న రాజ్‌కోట్‌లో రెండో వన్డే, 19న బెంగళూరులో మూడో వన్డే ఆడుతుంది.

**ఆస్ట్రేలియా వన్డే క్రికెట్ జట్టు:** ఫించ్ (కెప్టెన్), వార్నర్, స్మిత్, లబ్‌షేన్, అబాట్, అగర్, క్యారీ, కమిన్స్, హ్యాండ్స్‌కోంబ్, హాజల్‌వుడ్, స్టార్క్, టర్నర్, రిచర్డ్‌సన్, ఆడమ్ జంపా.

## హైదరాబాద్ 242 ఆలౌట్

**పాటియాలా:** పంజాబ్‌తో మొదలైన రంజీ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. కొల్లా సుమంత్ (79; 8 ఫోర్లు), హిమాలయ్ (68; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు.

## కుర్రాళ్లు వెలుగులోకి వచ్చే మార్గమేదీ?

జూనియర్లకు స్పాన్సర్‌షిప్ కష్టాలు • టెన్నిస్ స్టార్ సాకేత్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్‌లో కొత్తగా కుర్రాళ్లు వెలుగులోకి వచ్చే మార్గమే లేదని తెలుగుతేజం సాకేత్ మైనేని అన్నాడు. దేశంలో ఇప్పటివరకూ యువ టెన్నిస్ ఆటగాళ్లు రాణించేందుకు అవసరమైన ప్రాథమిక చర్యలే లేవన్నాడు. ఓ వార్తాసంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడైన సాకేత్ నర్మగర్భమైన వ్యాఖ్యలు చేశాడు. 'ఎప్పటి నుంచో ఎంతో మంది ఎన్నోసార్లు అది చేస్తాం, ఇది చేస్తామన్నారు... కానీ ఆచరణలో అవేవీ చూడలేదు ఇప్పటివరకు! క్రీడావర్గాలకు అసలు ఆటగాళ్లు ఎలా తయారవుతారన్న ఆలోచనే లేదు. నిజానికి ఇదంతా ఓ నిర్ణీత కాలచక్రంగా ఓ పద్ధతి ప్రకారం జరగాలి కానీ... ఇక్కడ అలా లేదు. ఆటగాళ్లంతా తమ సొంతంగా ఎదగడమే తప్ప... క్రీడా సంఘాలు, ఆ శాఖ చేసేది కూడా ఏమీ ఉండదు. ఒక్కొక్కరిది ఒక్కోకథ. అందరివీ కష్టంతో కూడుకున్నవే! ఏ ఒక్కరూ నల్లేరుపై నడకలా వచ్చినట్లు, ఎదిగినట్లు ఉండదు. ముఖ్యంగా జూనియర్ ఆటగాళ్లను ఆర్థిక కష్టాలు వేధిస్తాయి. స్పాన్సర్‌షిప్ దొరకదు. అలాంటపుడు పెద్ద టోర్నీలు ఆడేలా, భవిష్యత్తు తీర్చిదిద్దుకునేలా చేయూత లభించదు' అని ముక్కుసూటిగా మాట్లాడాడు. అలాగే నేర్చుకోవాలన్నా... శిక్షణ పొందాలన్నా... మౌలిక సదుపాయాలు చాలా దూరంగా ఉంటాయని, 15 కిలోమీటర్లు వెళ్లి రావాల్సి ఉంటుందని ఆటగాళ్ల కష్టాలు వివరించాడు. 'ఇదంతా వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. కాబట్టే భారత టెన్నిస్‌లో స్టార్లు తక్కువ. ఐరోపా, అమెరికా దేశాల్లోలాగా ఇక్కడ క్రీడల సంస్కృతి లేదు. సమీప భవిష్యత్తులో రాదు కూడా! ఇక్కడ టెన్నిస్ కోర్టులో జరిగే పోటీలు, విజయాల కన్నా... కోర్టు వెలుపల జరిగే వివాదాలే హైలైట్ అవుతాయి. కొంతకాలంగా ప్రజ్నేశ్, సుమిత్ నాగల్, యూకీ బాంబ్రీలు బాగా ఆడారు. వాళ్ల ఫలితాలేవీ ప్రముఖంగా రావు. కానీ జట్టు ఎంపిక వివాదం, నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లాంటి విషయాలు ప్రముఖంగా ఉంటాయి' అని వైజాగ్‌కు చెందిన 32 ఏళ్ల సాకేత్ అన్నాడు.

## డివిలియర్స్‌ను పిలుస్తున్నాం: డు ప్లెసిస్



**జొహన్నెస్‌బర్గ్:** అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన విధ్వంసక బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్‌ను వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌లో మళ్లీ తమ జట్టు తరపున ఆడించాలని దక్షిణాఫ్రికా భావిస్తోంది. కొత్త కోచ్ బౌచర్ ఇప్పటికే దీని గురించి ప్రకటించగా... తాజాగా కెప్టెన్ డు ప్లెసిస్ కూడా అదే మాట వెల్లడించాడు. 'డివిలియర్స్ మళ్లీ ఆడాలని జనం కోరుకుంటున్నారు. అతని పునరాగమనానికి సంబంధించి గత రెండు మూడు నెలలుగా ఏబీతో నేను మాట్లాడుతూనే ఉన్నాను. డివిలియర్స్‌లో కూడా మళ్లీ రావాలనే ఆలోచన కనిపిస్తోంది. టి20 వరల్డ్ కప్ ఆడాలంటే ఎక్కువ సమయాన్ని అతను ఇంటికి దూరంగా గడపాల్సిన అవసరం కూడా రాదు' అని డు ప్లెసిస్ వ్యాఖ్యానించాడు.

## పురుషుల జట్టు కివీస్‌తో... మహిళల జట్టు నెదర్లాండ్స్‌తో...

- టోక్యో ఒలింపిక్స్ హాకీ షెడ్యూల్ విడుదల
- తొలి రోజే బరిలోకి దిగనున్న భారత జట్లు

**టోక్యో:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య టోక్యో ఒలింపిక్స్‌కు సంబంధించి ఈవెంట్ షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేసింది. వచ్చే ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు టోక్యో ఒలింపిక్స్ జరగనున్నాయి. జూలై 24న ప్రారంభోత్సవం తర్వాత ఈవెంట్స్ మొదలయ్యే తొలి రోజు 25న హాకీ మ్యాచ్‌లు మొదలవుతాయి. అదే రోజు తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత పురుషుల జట్టు... నెదర్లాండ్స్‌తో భారత మహిళల జట్టు ఆడతాయి. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత పురుషుల జట్టు తర్వాతి మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా (జూలై 26న), స్పెయిన్ (జూలై 28న), అర్జెంటీనా (జూలై 30న), జపాన్ (జూలై 31న) జట్లతో ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లోనే ఉన్న భారత మహిళల జట్టు తదుపరి మ్యాచ్‌ల్లో జర్మనీ (జూలై 27న), బ్రిటన్ (జూలై 29న), ఐర్లాండ్ (జూలై 31న), దక్షిణాఫ్రికా (ఆగస్టు 1న) జట్లతో తలపడుతుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
18-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 413 ▲ | 111 ▲ |
| 41,352 | 12,165 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,820 | ▲ 4 |
| డోజోన్స్ | 28,318 | ▲ 82 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,525 | ▲ 6 |
| డాక్స్ | 13,288 | ▼ 120 |
| షాంఘై | 3,022 | ▲ 38 |
| నికాయ్ | 24,066 | ▲ 114 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.24 | 71.88 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 93.27 | 96.57 |
| యూరో | ఎస్‌బీఐ | 77.44 | 80.33 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.60 | 65.98 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.74 | 49.93 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.55 | 53.36 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.14 | 19.74 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.86 | 19.86 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.52 | 10.93 |

# చౌక కాల్స్, డేటాకు చెల్లు!!




- కనీస చార్జీల విధింపుపై ట్రాయ్ చర్చాపత్రం
- అనుసరించాల్సిన విధానంపై అభిప్రాయ సేకరణ
- అభిప్రాయాలు తెలిపేందుకు జనవరి 17 దాకా గడువు

**న్యూఢిల్లీ:** చౌక మొబైల్ కాల్స్, డేటా విధానానికి స్వస్తి పలుకుతూ.. కనీస చార్జీలు వడ్డించే ప్రతిపాదనలపై టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ దృష్టి సారించింది. దీనిపై తాజాగా చర్చా పత్రాన్ని విడుదల చేసింది. ఇటు టెల్కోలు, అటు కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు టారిఫ్‌ల విషయంలో నియంత్రణ సంస్థ జోక్యం చేసుకోవాల్సిన అవసరంపైనా, మొబైల్ సర్వీసులకు కనీస చార్జీలను నిర్ణయించడంపైనా సంబంధిత వర్గాల అభిప్రాయాలు కోరింది. ఒకవేళ కనీస చార్జీలు నిర్ణయించాల్సి వస్తే కొత్త ఆపరేటర్లకు అకస్మాత్తుగా లాభాలు వచ్చి పడకుండా అనుసరించతగిన విధానాలపైనా అభిప్రాయాలను ఆహ్వానించింది. ఇందుకు వచ్చే ఏడాది జనవరి 17 దాకా గడువు ఉంటుంది. వీటిపై కౌంటర్–కామెంట్స్ సమర్పించడానికి జనవరి 31 ఆఖరు తేది. 'టెలికం రంగంలో శరవేగంగా మారే టెక్నాలజీలను అందుకోవాలంటే భారీ పెట్టుబడులు కావాలి. ఎకానమీలో వివిధ రంగాలకు కీలకంగా మారిన టెలికం రంగం ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. టెలికం రంగ సమస్యలు పరిష్కరించేందుకు, పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత వర్గాలంతా చర్చించాల్సిన అవసరం ఉంది' అని ట్రాయ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

**యూ టర్న్...**

టెలికం రంగంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తాజా ట్రాయ్ చర్చాపత్రం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. టారిఫ్‌ల విషయంలో టెల్కోలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. టారిఫ్ ప్లాన్లను ప్రకటించిన వారం రోజుల్లోగా ట్రాయ్‌కు తెలిపితే సరిపోతుంది. కాబట్టి యూజర్లను ఆకర్షించేందుకు టెల్కోలు పోటాపోటీగా ఉచిత, అత్యంత చౌక ప్లాన్స్ కూడా అందిస్తూ వచ్చాయి. ఒకవేళ కనీస చార్జీల విధానం గానీ అమల్లోకి వస్తే.. ఉచిత సర్వీసులకు ఇక కాలం చెల్లినట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ.. టెలికం రంగాన్ని గట్టెక్కించేందుకు పరిశీలించతగిన చర్యలంటూ అక్టోబర్‌లో చేసిన సిఫార్సుల్లో ఈ కనీస చార్జీల ప్రతిపాదన కూడా ఉంది. అటు పాత టెల్కోలు కూడా దీన్ని గట్టిగా కోరుతున్నాయి. రిలయన్స్ జియో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత రెండేళ్ల క్రితం టెల్కోలు ఇలాంటి ప్రతిపాదనే చేసినప్పటికీ.. ఇది సాధ్యపడే విషయం కాదని ట్రాయ్ తోసిపుచ్చింది. అయితే, తాజా పరిస్థితుల నేపథ్యంలో దీన్ని పరిశీలించాలని భావిస్తోంది. లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టులో ప్రతికూల ఆదేశాలు రావడంతో టెల్కోలు దాదాపు రూ. 1.4 లక్షల కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సెప్టెంబర్ క్వార్టర్‌లో వొడాఫోన్ ఐడియా రికార్డు స్థాయిలో రూ. 50,922 కోట్ల మేర నష్టాలు ప్రకటించింది. అటు ఎయిర్‌టెల్ కూడా రూ. 23,045 కోట్లు నష్టాలు ప్రకటించింది.

## 2021 దాకా ఐయూసీ కొనసాగింపు




**న్యూఢిల్లీ:** టెలికం సంస్థల ఇంటర్‌కనెక్ట్ యూసేజీ చార్జీల (ఐయూసీ) విధానాన్ని 2021 జనవరి 1 దాకా కొనసాగించాలని ట్రాయ్ నిర్ణయించింది. ఆ తర్వాత నుంచి ఈ చార్జీలు పూర్తిగా ఎత్తివేసేలా ప్రతిపాదనలు చేసింది. ఇతర నెట్‌వర్క్‌ల నుంచి కాల్స్ స్వీకరించినందుకు.. టెల్కోలు వసూలు చేసే చార్జీలను ఐయూసీగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఇది నిమిషానికి 6 పైసలుగా ఉంది. ఈ విధానాన్ని 2020 జనవరి 1 నుంచి ఎత్తివేసే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ.. దీన్ని 2021 దాకా కొనసాగించాలని ట్రాయ్ నిర్ణయం తీసుకుంది. తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ఉన్న టెలికం రంగానికి ఇది కాస్త ఊరటనిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. గతంలో 14 పైసలుగా ఉన్న ఐయూసీ చార్జీలను ట్రాయ్ 2017 అక్టోబర్‌లో 6 పైసలకు తగ్గించింది. దీంతో టెలికం సంస్థలు రూ. 11,000 కోట్ల మేర నష్టపోయాయని అంచనా. ఒకవేళ 6 పైసల ఐయూసీని కూడా ఎత్తివేసిన పక్షంలో పరిశ్రమపై మరో రూ. 3,672 కోట్ల మేర ప్రతికూల ప్రభావం పడేది. దీనితో పాటు వినియోగదారుల ప్రయోజనాలు, టెలికం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఐయూసీ స్థానంలో కొత్త బీఏకే (బిల్ అండ్ కీప్) విధానం అమలును ఏడాది పాటు వాయిదా వేసినట్లు ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ నిర్ణయాన్ని టెలికం సంస్థల సమాఖ్య సీవోఏఐ స్వాగతించింది. ఐయూసీని పరిగణనలోకి తీసుకునే టెల్కోలు ఇటీవల చార్జీలను పెంచినందున.. వినియోగదారులపై కొత్తగా దీని ప్రభావమేమీ ఉండబోదని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్ తెలిపారు.

## కార్వీ కేసులో సెబీకి శాట్ ఆదేశాలు




**న్యూఢిల్లీ:** బ్రోకింగ్ సంస్థ కార్వీ వివాదంలో యాక్సిస్ బ్యాంకు అభ్యర్థనపై 15 రోజుల్లోగా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) ఆదేశించింది. వివరాల్లోకి వెడితే.. క్లయింట్ల షేర్లను సొంతానికి వాడుకుందని కార్వీ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తనఖా పెట్టిన షేర్లకు ప్రతిగా కార్వీకి యాక్సిస్ బ్యాంకు రూ. 81 కోట్ల రుణం ఇచ్చింది. అయితే, తనఖా షేర్లను క్లయింట్లకు బదలాయించాలంటూ సెబీ గతంలో ఇచ్చిన ఆదేశాల కారణంగా.. ఈ షేర్లపై యాక్సిస్ బ్యాంకుకు హక్కులు లేకుండా పోయాయి. దీంతో వివాద పరిష్కారం కోసం శాట్‌ను ఆశ్రయించింది.

## బ్యాంకింగ్‌లో 20% పెరిగిన ఫిర్యాదులు

**ముంబై:** బ్యాంకింగ్ సేవల లోపాలకు సంబంధించి 2018–19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు 1.96 లక్షల పైచిలుకు ఫిర్యాదులు వచ్చాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన 1.63 లక్షలతో పోలిస్తే ఇవి 20% అధికం. వీటిలో అకౌంటింగ్‌పరంగా సముచిత విధానాలు పాటించడం లేదంటూ వచ్చిన ఫిర్యాదులు అత్యధికంగా 19% ఉన్నాయి. ఏటీఎం, డెబిట్ కార్డుల సమస్యలపై ఫిర్యాదులు 16%గా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ మంగళవారం విడుదల చేసిన డేటాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఫిర్యాదుల పరిష్కారాల రేటు 2017–18లో 96.46% ఉండగా.. 2018–19లో 94.03%కి తగ్గింది. ఫిర్యాదులు గణనీయంగా పెరగడం, పరిష్కారం చేసేందుకు వనరులు గత స్థాయిలో పరిమితంగానే ఉండటం ఇందుకు కారణమని ఆర్‌బీఐ పేర్కొంది.




## ఆర్థిక సేవల్లోకి రియల్‌మీ

- పైసా యాప్ ఆవిష్కరణ
- రూ.1 లక్ష దాకా వ్యక్తిగత రుణాలు,
- ఉచిత క్రెడిట్ రిపోర్ట్స్, ఇతర సేవలు




**న్యూఢిల్లీ:** స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ రియల్‌మీ తాజాగా ఆర్థిక సేవల విభాగంలోకి ప్రవేశించింది. రుణాలు, మ్యూచువల్ ఫండ్స్, క్రెడిట్ స్కోర్ రిపోర్టులు అందించేందుకు 'రియల్‌మీ పైసా' పేరిట ప్రత్యేక ప్లాట్‌ఫాం ప్రారంభించింది. స్మార్ట్‌ఫోన్స్ విభాగంలో ప్రత్యర్థి సంస్థ షావోమీ ఇటీవలే 'మి క్రెడిట్' పేరుతో ఇలాంటి ఫైనాన్షియల్ సర్వీసులే ప్రారంభించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. రియల్‌మీ పైసా బీటా యాప్ ద్వారా డిజిటల్ వ్యక్తిగత రుణాలు సుమారు రూ. 1 లక్ష దాకా, చిన్న.. మధ్యతరహా సంస్థలు రూ.5 లక్షల దాకా రుణాలు పొందవచ్చు. తక్షణ ఉచిత క్రెడిట్ రిపోర్టులు, మూడు నెలల పాటు ఉచిత అప్‌డేట్స్, పాత.. కొత్త ఫోన్లకు స్క్రీన్ డ్యామేజ్ బీమా సర్వీసులు ఈ యాప్ ద్వారా రియల్‌మీ అందించనుంది. 2020లో ఈ ప్లాట్‌ఫాం ద్వారా రూ. 1,000 కోట్ల దాకా రుణ వితరణ, 30–50 లక్షల మంది కొత్త కస్టమర్లకు చేరువ కావాలనేది తమ లక్ష్యమని రియల్‌మీ పైసా లీడ్ వరుణ్ శ్రీధర్ తెలిపారు. 'మూడేళ్లలో బ్రేక్ ఈవెన్ వస్తుందని అంచనా వేస్తున్నాం. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న రియల్‌మీ పైసా యాప్.. గూగుల్ ప్లేస్టోర్‌తో పాటు రియల్‌మీ యాప్‌స్టోర్‌లో లభిస్తుంది. రానున్న 6–12 నెలల్లో పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తాం' అని శ్రీధర్ తెలిపారు.

# కోటక్ ఖాతాలో యస్ బ్యాంక్!

- యస్ బ్యాంక్ విలీనానికి కోటక్ బ్యాంకే కరెక్టన్న ఎస్‌బీఐ అధిపతి
- ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన యాక్సిస్ బ్యాంక్ చీఫ్
- విలీన వ్యాఖ్యలను కొట్టిపారేసిన కోటక్, యస్ బ్యాంక్‌లు




**ముంబై:** యస్ బ్యాంక్‌ను విలీనం చేసుకోవడానికి కోటక్ మహీంద్రా బ్యాంకే కరెక్టని ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ చీఫ్‌లు అభిప్రాయపడ్డారు. అయితే విలీన ప్రయత్నాలు లేవని యస్‌బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు స్పష్టం చేశాయి.

**కోటక్‌కే ఆ సత్తా...**

యస్‌బ్యాంక్‌ను కొనుగోలు చేయగల సత్తా ఉదయ్ కోటక్‌కే ఉందని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. యస్‌బ్యాంక్‌ను టేకోవర్ చేయడానికి భారీగా నిధులు అవసరమని, ఆ సత్తా కోటక్ మహీంద్రా బ్యాంక్‌కే ఉందని వివరించారు. ఇక్కడ జరిగిన టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా ఎకనామిక్ కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడారు. కాగా ఇదే అభిప్రాయాన్ని యాక్సిస్ బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ అమితాబ్ చౌధురి వ్యక్తం చేశారు. తమ బ్యాంక్ ఇప్పటికింకా చిన్నదేనని, పెద్ద బ్యాంక్‌గా వృద్ధి చెందే ప్రయత్నాలు చేస్తున్నామని, పెద్ద బ్యాంక్‌గా మారినప్పుడే ఇతర బ్యాంక్‌లను కొనుగోలు చేయగలమని ఆయన పేర్కొన్నారు.

**ఊసుపోని ఊహాగానాలు...**

ఈ కొనుగోలు వార్తలు ఊసుపోని ఊహాగానాలని యస్ బ్యాంక్ చీఫ్ రవ్‌నీత్ గిల్ కొట్టిపడేశారు. విలీనప్రయత్నాలు ఏమీ లేవని తెగేసి చెప్పారు. కాగా విలీన వ్యాఖ్యలు ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమేనని, తమకెలాంటి సంబంధం లేదని కోటక్ మహీంద్రా గ్రూప్ చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ రోహిత్ రావు పేర్కొన్నారు. యస్‌బ్యాంక్ చీఫ్‌గా రవ్‌నీత్ గిల్ పగ్గాలు చేపట్టి మొండి బకాయిల గుర్తింపు ప్రక్రియను మరింత వేగిరం చేశారు. మరోవైపు నిధుల సమీకరణ ప్రయత్నాలు ఫలప్రదం కావడం లేదు. దీంతో ఈ బ్యాంక్‌ను చేజిక్కించుకోనే యత్నాలు ఊపందుకుంటున్నాయని ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఇక, పుష్కలమైన నిధులతో పటిష్టంగా ఉన్న కోటక్ బ్యాంక్... చిన్న బ్యాంక్‌లను టేకోవర్ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

### బలమైన బ్యాంకులే నిలుస్తాయ్



బలమైన బ్యాంక్‌లే నిలబడగలుగుతాయని ఉదయ్ కోటక్ వ్యాఖ్యానించారు. బలం ఉన్న జీవులే మనగలుగుతాయని చార్లెస్ డార్విన్ పేర్కొన్నారని, ఈ సిద్ధాంతం ఇప్పుడు భారత్ బ్యాంకులకూ వర్తిస్తుందని వివరించారు. బలహీనమైన కంపెనీలను బలమైన కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయని, వివిధ రంగాల్లో విలీనాల జోరు పెరుగుతోందని పేర్కొన్నారు. సమస్యల్లో ఉన్న ప్రైవేట్ బ్యాంక్‌లు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో విలీనమైన దృష్టాంతాలు గతంలో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.




- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- బడ్జెట్లో ఉద్దీపన ప్రతిపాదనలు
- మన మార్కెట్లోకి మరిన్ని విదేశీ నిధులు
- ఇంట్రాడేలో కొత్త శిఖరాలకు సెన్సెక్స్, నిఫ్టీలు
- ముగింపులోనూ రికార్డ్‌ల హోరు...

ఆర్థిక గణాంకాలు అంతంతమాత్రంగానే ఉన్నా, స్టాక్ మార్కెట్లో మాత్రం సూచీలు రికార్డ్‌ల మోత మోగిస్తున్నాయి. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం తొలి దశ ఒప్పందం కుదరడం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటంతో మంగళవారం స్టాక్ మార్కెట్ భారీగా లాభపడింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ జీవిత కాల గరిష్ట స్థాయి రికార్డ్‌లను సృష్టించాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ పుంజుకోవడం కలసివచ్చింది. ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, 41,402 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరకు 413 పాయింట్ల లాభంతో 41,352 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, 12,183 పాయింట్లను తాకి 111 పాయింట్ల లాభంతో 12,165 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయిని తాకింది. లోహ, టెలికం, ఫైనాన్షియల్, ఐటీ షేర్లు లాభపడ్డాయి. ఈ ఏడాది కొత్త శిఖరాలకు చేరడం సెన్సెక్స్‌కు ఇరవయ్యోసారి కాగా, నిఫ్టీకి తొమ్మిదవసారి.

**రోజంతా లాభాలే...**

స్వల్ప లాభాలతో సెన్సెక్స్ ఆరంభమైంది. మెల్లమెల్లగా ఈ లాభాలు పుంజుకున్నాయి. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ సెన్సెక్స్, నిఫ్టీల జోరు పెరుగుతూనే ఉంది. నేడు (గురువారం) జీఎస్‌టీ మండలి సమావేశం జరగనుండటం, జీఎస్‌టీ కనీస స్లాబ్‌ను 5% నుంచి 9 శాతానికి పెంచే అవకాశాలున్నాయన్న వార్తలు వచ్చినప్పటికీ, ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మొగ్గు చూపారు. ఇక ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, లాభాల స్వీకరణ కారణంగా యూరప్ మార్కెట్లు నష్టపోయాయి.

**లోహ షేర్లు మెరుపులు...**

అమెరికా–చైనాల మధ్య వాణిజ్య పోరు కారణంగా చైనాలో వినియోగం, తయారీ రంగాలు మందగించాయి. దీంతో మన లోహ షేర్లు బాగా తగ్గాయి. ఇప్పుడు వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం ఈ దేశాల మధ్య ఒప్పందం కుదరడంతో లోహ షేర్లు జోరుగా పెరిగాయి. మరోవైపు చైనా నుంచే కాకుండా అంతర్జాతీయంగా డిమాండ్ పెరగగలదని, రానున్న మూడు నెలల్లో దేశీయంగా ఉక్కు ధరలు పెరుగుతాయని జేపీ మోర్గాన్ సంస్థ అంచనా వేయడంతో ఉక్కు షేర్లు లాభపడ్డాయి. జిందాల్ స్టీల్ అండ్ పవర్, టాటా స్టీల్, సెయిల్, వేదాంత, హిందాల్కో, హిందుస్తాన్ కాపర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌ఎమ్‌డీసీ, హిందుస్తాన్ జింక్, నాల్కో షేర్లు 0.3%–6.5 శాతం వరకూ పెరిగాయి.

**మరిన్ని విశేషాలు...**

- యస్ బ్యాంక్ షేర్ 1.7% లాభంతో రూ. 47.60 వద్ద ముగిసింది. ఈ షేర్ పెరగడం ఇది వరుసగా నాలుగోరోజు. 4 రోజుల్లో 11 శాతం లాభపడింది.
- హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, అబాట్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్ఐఐటీ టెక్నలజీస్ తదితర షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి.
- కాగితం పరిశ్రమకు రానున్న బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు ఉంటాయన్న అంచనాలతో పేపర్ షేర్లు రెపరెపలాడాయి.

### రూ.1.26 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ భారీ లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.1.26 లక్షల కోట్లు పెరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) రూ.1.26 లక్షల కోట్లు పెరిగి రూ. 154.28 లక్షల కోట్లకు చేరుకుంది.

### ఫిబ్రవరి 1న ట్రేడింగ్

వచ్చే ఆర్థిక సంవత్సరం (2020–21) బడ్జెట్‌ను వచ్చే ఏడాది 2020, ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఆరోజు శనివారం అయినప్పటికీ, స్టాక్ మార్కెట్ పనిచేస్తుందని, ట్రేడింగ్ జరుగుతుందని బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు వెల్లడించాయి.

### బడ్జెట్‌పై అంచనాలతో..



అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడం అంతర్జాతీయంగా సానుకూల ప్రభావం చూపించింది. మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు జోష్‌నివ్వడానికి, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి రానున్న బడ్జెట్‌లో కేంద్రం మరిన్ని చర్యలు తీసుకోగలదన్న అంచనాలతో సెంటిమెంట్ మరింతగా మెరుగుపడింది.

*–వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్*

### పైస్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి..



లాభాలు రానున్న సెషన్లలో కూడా కొనసాగవచ్చు. పై స్థాయిల్లో లాభాల స్వీకరణ జరిగే అవకాశమున్నందున ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్న, ఆకర్షణీయ ధరల్లో లభ్యమవుతున్న షేర్లను కొనుగోలు చేయాలి.

*–అజిత్ మిశ్రా, రెలిగేర్ బ్రోకింగ్ ఎనలిస్ట్*

### లాభాలు ఎందుకంటే..

**● అమెరికా–చైనాల మధ్య వాణిజ్య డీల్**

దాదాపు 17 నెలలుగా కొనసాగుతూ అంతర్జాతీయ వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిన అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలకు శుభం కార్డ్ పడింది. తొలి దశ ఒప్పందం ఈ వారంలోనే కుదరడంతో ప్రపంచ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. ఈ ప్రభావం మన మార్కెట్‌పై బాగానే ప్రభావం చూపించింది. ఈ డీల్ జరిగినప్పటి నుంచి చూస్తే, సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 2 శాతం మేర పెరిగాయి.

**● బడ్జెట్ తాయిలాలు...**

మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడానికి వినియోగం పెంపు,దేశంలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే చర్యలను ఈ బడ్జెట్‌లో కేంద్రం తీసుకోగలదన్న అంచనాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి.

**● మన మార్కెట్లోకి మరిన్ని విదేశీ నిధులు....**

ఒక కంపెనీలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ పరిమితిని 24 శాతం నుంచి పెంచే ప్రతిపాదన వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్నదని సోమవారం నాడే ఆర్థిక మంత్రి నిర్ధారించారు. ఫలితంగా ఎమ్‌ఎస్‌సీఐ ఎమర్జింగ్ మార్కెట్ ఇండెక్స్‌లో భారత వెయిటేజీ 8.9% నుంచి 9.6%కి పెరగనున్నది. ఫలితంగా 250 కోట్ల డాలర్ల విదేశీ నిధులు మన మార్కెట్లోకి వస్తాయని అంచనా. మరోవైపు బ్రెగ్జిట్ అనిశ్చితి తొలగడం, అమెరికా–చైనాల మధ్య తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదరడంతో గత రెండు ట్రేడింగ్ సెషన్లలో విదేశీ ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరుపుతున్నారు.

**● ఆర్‌బీఐ వ్యాఖ్యలు...**

అవసరమైనప్పుడు వడ్డీ రేట్లను తగ్గించే ఆస్కారం ఉందంటూ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అభయమివ్వడం సానుకూల ప్రభావం చూపించింది.

epaper.sakshi.com

## కార్పొరేట్ బ్రీఫ్స్...

**పెన్నార్:** నాణ్యత ప్రమాణాలు పాటించినందుకు గాను కంపెనీకి చెందిన ఏరోస్పేస్ ఫెసిలిటీకి ఏఎస్9100 రివిజన్ డి సర్టిఫికెట్ లభించింది.

**లింక్2 గ్రూప్:** న్యూజిలాండ్‌లో ఇండియన్ న్యూస్ లింక్ 20వ వార్షికోత్సవం సందర్భంగా బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును కంపెనీ డైరెక్టర్లు మానస, ఇంద్ర సిరిగిరి అందుకున్నారు.

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,900 | ▲ | 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,050 | ▲ | 150 |
| వెండి (కిలో) | 47,700 | ▲ | 300 |
| **చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,060 | ▲ | 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,250 | ▲ | 100 |
| వెండి (కిలో) | 47,700 | ▲ | 300 |
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,060 | ▲ | 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,250 | ▲ | 100 |
| వెండి (కిలో) | 47,700 | ▲ | 300 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,800 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,970 | ▲ | 10 |
| వెండి (కిలో) | 45,500 | ▲ | 100 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,940 | ▲ | 70 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,220 | ▲ | 70 |
| వెండి (కిలో) | 45,000 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,220 | ▲ | 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,270 | ▲ | 50 |
| వెండి (కిలో) | 47,700 | ▲ | 200 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.91 (రాత్రి 11.30కు) | $60.14 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 66.17 (రాత్రి 11.30కు) | $65.34 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 18-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 436-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| **17-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 433-00 |

# నెలకు రూ.1.1 లక్షల కోట్లు!

- డిసెంబర్–మార్చి మధ్య జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యం
- లక్ష్య సాధనకు అధికారులకు సూచనలు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నుంచీ మార్చి మధ్య వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు నెలకు రూ.1.10 లక్షల కోట్ల చొప్పున వసూళ్లు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక మందగమన పరిస్థితుల నేపథ్యంలో 2019–2020లో పన్ను వసూళ్లలో కేంద్రం వెనుకబడుతుందన్న అంచనాలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం జీఎస్‌టీ వసూళ్లకు సంబంధించి తాజా లక్ష్యాలను నిర్దేశించుకుంది. రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే ప్రత్యక్ష, పరోక్ష పన్ను శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**నిజాయితీగా చెల్లింపుదారులను వేధించొద్దు..**
వసూళ్ల క్రమంలో... నిజాయితీగా పన్ను చెల్లించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వేధించకూడదని




రెవెన్యూ కార్యదర్శి పన్ను శాఖ అధికారులకు స్పష్టం చేశారు. 2019– 20 అక్టోబర్ వరకూ సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ.3.26 లక్షల కోట్లు. అంటే బడ్జెట్ అంచనాలు రూ.6,63,343 కోట్లలో అక్టోబర్ ముగిసే నాటికి దాదాపు సగం వసూళ్లు జరిగాయి. కాగా ప్రత్యక్ష పన్నుల వసూళ్ల బడ్జెట్ లక్ష్యం రూ.13,35,000 కోట్లయితే, అక్టోబర్ ముగిసే నాటికి నికర వసూళ్లు రూ.5,18,084 కోట్లు. ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు ఇప్పటికే కట్టుతప్పడం గమనార్హం. 2019– 20 ఆర్థిక సంవత్సరం మొత్తంలో ద్రవ్యలోటు పరిమాణం రూ.7.03 లక్షల కోట్లుగా ఉండాలన్నది (జీడీపీలో 3.3 శాతం) బడ్జెట్ లక్ష్యం.

## ద్రవ్యలోటుపై అప్రమత్తత అవసరం

### దువ్వూరి సుబ్బారావు



**ముంబై:** ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటుపై జాగరూకత అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మంగళవారం పేర్కొన్నారు. ఈ అంశంపై నిర్లక్ష్యం వహిస్తే, అది తీవ్ర ప్రతికూల పరిస్థితులకు దారితీస్తుందని ఆయన అన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థపై టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న ఒక సదస్సు సందర్భంగా ఆయన ఒక వీడియో సందేశం ఇచ్చారు. అధిక ద్రవ్యలోటు వల్ల ప్రతికూలతలను ఆయన వివరిస్తూ, ద్రవ్యోల్బణం పెరుగుదల, ప్రైవేటు పెట్టుబడులు తగ్గడం, చెల్లింపుల సమతౌల్యత దెబ్బతినడం, కరెంట్ అకౌంట్ లోటు సమస్యలు, వెరసి రూపాయి భారీ క్షీణత వంటి అంశాలను ప్రస్తావించారు.

## హెటెరో నుంచి హెచ్‌ఐవీ ఔషధం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీలో ఉన్న హెటెరో.. టాఫిక్ పేరుతో హెచ్‌ఐవీ–1 చికిత్సలో వాడే మందును భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. మూడు రకాల మందులతో కూడిన ఈ కాంబినేషన్ మెడిసిన్.. గిలీడ్ తయారీ బిక్టార్వీ ఔషధానికి జనరిక్ రూపం. ఈ ఔషధానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి అనుమతి ఉందని కంపెనీ తెలిపింది. నియంత్రణ సంస్థల నుంచి అనుమతి పొందిన తర్వాత 116 దేశాల్లో ఈ మందును ప్రవేశపెట్టనుంది.

## మజగావ్ డాక్ ఐపీఓకు సెబీ ఓకే



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ 13 శాతం వాటాకు సమానమైన 2.8 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది. ఈ ఇష్యూ సైజు రూ.700–800 కోట్ల రేంజ్‌లో ఉండొచ్చని అంచనా. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా యెస్ సెక్యూరిటీస్, ఐడీఎఫ్‌సీ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, జేఎమ్ ఫైనాన్షియల్, ఎడెల్వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లు వ్యవహరిస్తున్నాయి. కాగా ఈ ఏడాది సెబీ ఆమోదం తెలిపిన 27వ ఐపీఓ ఇది. భారత నావికాదళం ఉపయోగించే యుద్ధ నౌకలు, జలాంతర్గామిల తయారీ, రిపేర్ల కార్యకలాపాలను ఈ కంపెనీ నిర్వహిస్తోంది. వాణిజ్య సంస్థల కోసం నౌకల తయారీ, రిపేర్లను కూడా ఈ కంపెనీ చూస్తోంది.

## ఐదవసారి... సీఆర్‌ఐకి ప్రతిష్టాత్మక అవార్డు

ప్రతిష్ట ఇంధన సామర్థ్యంతో పంపుల తయారీకి సంబంధించి ప్రఖ్యాతి పొందిన తమ సంస్థకు– మరోసారి ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు 2019 లభించినట్లు సీఆర్‌ఐ పంప్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదుసార్లు సంస్థ ఈ అవార్డును దక్కించుకుంది. తాజాగా వరుసగా మూడవసారి సంస్థకు ఈ గుర్తింపు లభించినట్లు ప్రకటన పేర్కొంది.



కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయమంత్రి ఆర్‌కే సింగ్ నుంచి అవార్డును స్వీకరిస్తున్న సీఆర్‌ఐ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జీ సెల్వరాజ్‌ను చిత్రంలో తిలకించవచ్చు.

## జెట్ ప్రణాళికలు సానుకూలంగా పరిశీలిస్తాం



**న్యూఢిల్లీ:** మూతబడిన ప్రైవేట్ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌ను పునరుద్ధరించే దిశగా బిడ్డర్లు సమర్పించే వ్యాపార ప్రణాళిక ఏదైనా నిర్మాణాత్మకంగా ఉన్న పక్షంలో సానుకూలంగా పరిశీలిస్తామని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి కేంద్రం తెలియజేసింది. తదుపరి రౌండు ఎయిర్‌పోర్ట్ స్లాట్స్ వేలానికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చేనెల 15 ఆఖరు తేదీ అని కేంద్ర పౌర విమానయాన శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తరపున న్యాయవాది తెలియజేశారు.

## హైదరాబాద్‌లో వుయ్‌వర్క్ సేవలు ప్రారంభం




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** అమెరికాకు చెందిన కో–వర్కింగ్ స్పేస్ కంపెనీ వుయ్‌వర్క్.. హైదరాబాద్‌లో సేవలను ప్రారంభించింది. కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల్లో రెండు లక్షల చ.అ.ల్లో రెండు కో–వర్కింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం వీటిలో 15 వేల డెస్కులు, 7 వేల సీట్లున్నాయి. అద్దె ఒక్క సీట్‌కు నెలకు రూ.7–8 వేలు. ఎంబసీ గ్రూప్‌తో ఒప్పందంతో 2017లో దేశీయ కో–వర్కింగ్ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన వుయ్‌వర్క్‌కు ప్రస్తుతం బెంగళూరు, ముంబై, ఎన్‌సీఆర్, గుర్గావ్, పుణే నగరాల్లో 32 ప్రాంతాల్లో 55 వేల డెస్కులు అందుబాటులో ఉన్నాయి.

## స్త్రీ, పురుషుల మధ్య అసమానతల భారత్!

### ప్రపంచ వ్యాప్తంగా 112వ స్థానం



**న్యూఢిల్లీ:** స్త్రీ, పురుషుల విషయంలో అసమానతల్లేని తటస్థ దేశంగా ఐస్‌లాండ్ ప్రపంచంలో ప్రథమ స్థానంలో నిలవగా.. భారత్ గతేడాదితో పోలిస్తే 108వ స్థానం నుంచి 112కు దిగిపోయింది. మహిళల ఆరోగ్యం, మనుగడ, ఆర్థిక భాగస్వామ్యం పరంగా అసమానతలు మన దేశంలో మరింత పెరిగిపోయినట్టు 'ప్రపంచ ఆర్థిక వేదిక జెండర్‌గ్యాప్ నివేదిక' తెలియజేసింది. ఈ రెండు అంశాల్లో మన దేశం కింద నుంచి ఐదు స్థానాల పైన నిలిచింది. స్త్రీ, పురుషుల మధ్య అసమానతల విషయంలో చైనా 106, శ్రీలంక 102, నేపాల్ 101, బ్రెజిల్ 92, ఇండోనేషియా 85, బంగ్లాదేశ్ 50 మన కంటే మెరుగ్గా ముందున్నాయి. 153 దేశాల జాబితాలో స్త్రీ, పురుషుల మధ్య అత్యంత అసమానతలతో యెమన్ అట్టడుగున నిలిచింది. ఇరాక్ 152, పాకిస్తాన్ 151వ స్థానంలో ఉన్నాయి. ''ప్రపంచవ్యాప్తంగా స్త్రీ పురుషుల మధ్య అసమానతలు రూపు మాపేందుకు 99.5 సంవత్సరాలు పడుతుంది. 2018లో అంచనా వేసిన 108 సంవత్సరాలతో పోలిస్తే మెరుగుదల ఉంది. పురుషులు, మహిళల మధ్య విద్య, ఆరోగ్యం, పని ప్రదేశాలు, రాజకీయాల్లో సమానత్వాన్ని సాధించేందుకు ఇప్పటికీ జీవిత కాలం కంటే ఎక్కువే పడుతుంది'' అని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) తెలిపింది. ముఖ్యంగా వీటిల్లో ఆర్థిక సమానత్వం సాధించేందుకు 257 సంవత్సరాలు పడుతుందని ఈ నివేదిక తేల్చడం గమనార్హం.

## 5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యం: నితిన్ గడ్కరీ

### వచ్చే 5 ఏళ్లలో రూ. 17 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు



**న్యూఢిల్లీ:** ఆర్థిక వ్యవస్థ పురోగతికి ఊతం ఇవ్వడం ద్వారా ఉద్యోగ కల్పన లక్ష్యాలను చేరుకోనున్నామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మౌలిక సదుపాయాలు, గ్రామీణ వ్యవసాయం, గిరిజన అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా 5 కోట్ల ఉద్యోగ కల్పన లక్ష్యాన్ని చేరుకోనున్నట్లు చెప్పారు. రహదారుల అభివృద్ధి పరంగా రూ. 17 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను వచ్చే ఐదేళ్లలో పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ. లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయనున్నట్లు ఇక్కడ జరిగిన అజెండా ఆజ్ తక్ 2019 కార్యక్రమంలో వివరించారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో కీలకంగా ఉన్న లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి పరచడం కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. రహదారులపై ప్రమాదాలను తగ్గించడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## యాక్సిస్ బ్యాంక్, ఐఓసీ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) భాగస్వామ్యంతో యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డును విడుదలచేసింది. కస్టమర్లు తొలి 30 రోజుల్లో రూ. 250 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చని బ్యాంక్ ప్రకటించింది. ఐఓసీ బంకుల్లో ఇంధనాన్ని కొనుగోలు చేసేవారికి రివార్డ్ పాయింట్లలో 20 రెట్లు అధిక ప్రయోజనం ఉంటుంది.

## 2022 కల్లా అన్ని గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్

**న్యూఢిల్లీ:** వచ్చే రెండేళ్లలో .. 2022 నాటికి దేశవ్యాప్తంగా గ్రామాలన్నింటికీ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి రాగలవని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం 5.65 లక్షలుగా ఉన్న టవర్ల సంఖ్యను 10 లక్షలకు పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్‌ను



ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. రూ. 7 లక్షల కోట్ల పెట్టుబడుల అంచనాలతో తలపెట్టిన ఈ మిషన్ కింద.. కొత్తగా 30 లక్షల రూట్ కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేయనున్నారు. టవర్ల సాంద్రతను 2024 కల్లా 1 టవర్ స్థాయికి పెంచనున్నారు. విద్య, వైద్యం వంటి అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను మరింత పటిష్టం చేసేందుకు ఈ మిషన్ తోడ్పడగలదని మంత్రి చెప్పారు.

**రాష్ట్రీయం**

## క్లుప్తంగా...

### మైనర్‌పై 'పోక్సో' కేసు

**హసన్‌పర్తి:** ఓ బాలికను వేధిస్తున్న కేసులో బాలుడిపై పోక్సో చట్టం కింద మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడు (16), అదే గ్రామానికి చెందిన బాలిక స్థానికంగా ఒకే పాఠశాలలో చదువుతున్నారు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. కొంతకాలంగా బాలికను బాలుడు వేధిస్తుండగా ఆమె తల్లిదండ్రులు మందలించారు. మరోసారి హెచ్చరించారు. అయినా ఆ బాలుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇదిలా ఉండగా సోమవారం బాలిక పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్తుండగా మరోసారి వేధించడంతో బాలిక తల్లిదండ్రులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు.

### ప్రిన్సిపాల్‌పై కూడా..

**ఇద్దరు విద్యార్థినులపై లైంగిక వేధింపులు కేసు**

**ఆదిలాబాద్ టౌన్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీసెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్ రఫీ కొద్ది రోజులుగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులపై లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో విద్యార్థినుల కుటుంబ సభ్యులు వేర్వేరుగా మంగళవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. కాగా, ముగ్గురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు.

# పనుల ఎంపికలో ఇష్టారాజ్యానికి చెక్

**ఎక్కువ మంది ప్రయాణించే రోడ్లకు ప్రాధాన్యం..**

- పీఎంజీఎస్‌వై–3 అమలుకు కొత్త మార్గదర్శకాలు
- కసరత్తు చేస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ విభాగం

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై (ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన) పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటి వరకు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు చెప్పిన రోడ్లనే పథకం కింద ఎంపిక చేసేవారు. దీంతో ప్రజాప్రయోజనాల కంటే., రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత దక్కుతోందనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై మూడో విడత అమలుకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆయా గ్రామాల జనాభా, ఎక్కువ మంది వినియోగించే రోడ్లను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలని ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. అధికారులు ఆయా రోడ్ల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రోడ్డు నిర్మాణంతో లబ్ధిపొందే గ్రామాల జనాభాను పొందుపర్చాలి. గ్రామాల్లో హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్కెట్ యార్డులు, ఆగ్రో పరిశ్రమలు, ఇతర పరిశ్రమలు, ఇలాంటివి ఉంటే ఆ రోడ్లపై ఎక్కువ మంది ప్రయాణిస్తారని, వాటిని అనుసంధానించే రోడ్లకే ప్రథమ ప్రాధాన్యత వచ్చేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది.

**జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో డీపీఆర్‌ల పరిశీలన**
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఆయా రోడ్లకు సంబంధించిన అంచనాలు, డీపీఆర్‌లను ముందుగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లతో స్క్రూటినీ చేయించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాతే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. దీంతో ఎమ్మెల్యేలు, జిల్లాల్లోని ఇతర కీలక నేతల ఇష్టారాజ్యానికి చాలా మట్టుకు చెక్ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నూతన మార్గదర్శకాలను ఎమ్మెల్యేలందరికి చెప్పామని, ఈ విడతలో పనుల ఎంపిక చేసిన మార్గదర్శకాల ప్రకారమే జరుగుతాయని వివరించామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.



**రాష్ట్రం వాటా 40 శాతం**

పీఎంజీఎస్‌వై తొలి రెండు విడుతల్లో చేపట్టిన రోడ్లకు 100 శాతం నిధులను కేంద్రమే మంజూరు చేసింది. మూడో విడతలో అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

**రెండు వేల కోట్లతో పనులు**
పీఎంజీఎస్‌వై మూడో విడత అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.రెండు వేల కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించింది.

## జైపూర్‌లో పామాయిల్ ఫ్యాక్టరీ

### అక్టోబరు నాటికి ఫ్యాక్టరీ పనులు: బాల్క సుమన్

**అశ్వారావుపేట:** వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి మంచిర్యాల జిల్లా జైపూర్‌లో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు చేపడతామని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు మంచిర్యాల, నిర్మల్, చెన్నూరు ప్రాంతాల రైతులు బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత ఆధ్వర్యంలో తరలివచ్చారు. వారికి స్థానికంగా ఉన్న పామాయిల్ తోటలు, నర్సరీలు, ఫ్యాక్టరీలను చూపించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం వల్లే తెలంగాణలో వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 7 వేల ఎకరాల్లో పామాయిల్ సాగుకు రైతులు ముందుకొచ్చారని, తాను కూడా ఈ పంట సాగు చేస్తానని చెప్పారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో ఏటా రూ.75 వేల కోట్ల విలువైన వంట నూనెలు దిగుమతి అవుతుండగా, పామాయిలే రూ.50 వేల కోట్లు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
S.E.T.W.C వరంగల్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయం
NIT No.SE/TW/WGL/NIT/200 to 217/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది:16.12.2019
పనుల సంఖ్య: (18), పనుల పేర్లు: ఇంటర్నల్ CC పేవ్‌మెంట్ నిర్మాణం, సైడ్ డ్రెయిన్ నిర్మాణం, కంకర రోడ్ వేయుట, ఇంటర్నల్ CC రోడ్ నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు దిగువ సంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: రూ.3.40 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు సమయం: 21.12.2019 సా.5 గం. తరువాత. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 30.12.2019 మ.3.00 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది మరియు సమయం: 30.12.2019 సా.5.00 గం.కు. కమర్షియల్ బిడ్ తెరుచు తేది మరియు సమయం: 30.12.2019 సా.5.30 గం.కు. తదుపరి వివరాలను TWED శాఖ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.e.procurement.gov.in లో చూడండి. ఇ-మెయిల్ ఐడి: setwwgl7@gmail.com, ఫోన్ నం.0870-2567645.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR RO.No.1982-DP/CL/Advt/1/2019-20, Dt: 17.12.2019

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
Rc.No.2174/2019/A3 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 16.12.2019
CCF/CF and DFO, Khammam Sanction Order No.: CCF/CF, S.O.No.09 to13, 142/2019-20, తేది: 26.11.2019.
పనుల సంఖ్య: (6), పనుల పేర్లు: తల్లాడ రేంజ్‌లోని BC-I లోకారం నుండి పొడవైన వెదురు ఎక్స్‌ట్రాక్షన్ కోసం అంచనా, పొడవైన వెదురు రవాణా కోసం అంచనా, పొడవైన వెదురు ఎక్స్‌ట్రాక్షన్ కోసం అంచనా మరియు ఇతర పనులు దిగువ సంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: రూ.97.30 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ మరియు ముగింపు తేది: 18.12.2019 ఉ.10.30 గం. బిడ్ దాఖలుకు చివరి తేది మరియు సమయం: 05.01.2020 సా.4 గం.వరకు. తెరుచు తేది: 05.01.2020 సా.4.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.inలో చూడవచ్చును ఫోన్ నం.9347777705
DIPR Ro.No.1984-DP/CL/Advt/1/2019-20, Dt: 17.12.2019 సం/- జిల్లా అటవీ అధికారి, ఖమ్మం జిల్లా

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, మెదక్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.HD/189 to 199/2019-20 తేది: 16.12.2019 (1వ పిలుపు)
పనుల సంఖ్య: (11), పనుల పేర్లు: కొత్త ZPP భవనానికి మౌలికవసతుల సౌకర్యాలు ఏర్పాటు చేయుట, డంప్‌షెడ్ల నిర్మాణం, ప్యాకేజ్ 1 నుండి 8, కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు దిగువ సంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: రూ.6.38 కోట్లు. టెండరు షెడ్యూళ్లను 19.12.2019 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి పొందవచ్చును. టెండర్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ మరియు అప్‌లోడింగ్ కోసం చివరి తేది 28.12.2019. ఇతర వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఇ-మెయిల్ ఐడి: se.pr.mdk@gmail.com. సంప్రదించు ఫోన్ నం:08452-295457
DIPR RO.No.1987-DP/CL/Advt/1/2019-20, Dt: 17.12.2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, మెదక్

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04
టెండరు ప్రకటన

| టెండరు నం. & తేదీ | పని రకం | ECV (రూ.) |
|---|---|---|
| EP - 114/ CGM(E)/ Rev.Circle/ MS Line /2019-20, Dtd: 16.12.2019 | ఫైల్ నం.2019-2-4363 ప్రకారం O&M డివిజన్-XXI లోని సైనిక్‌పురి సెక్షన్, SD-III క్రింద బయాలాజికల్ ఇ.లిమిటెడ్ నుండి 509/510, 5వ అంతస్తు, క్యాపిటల్, ఎ-వింగ్, తుర్కపల్లి, శామీర్‌పేట్ వద్దగల ఫెరారి లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వరకు నీటి కనెక్షన్ ఏర్పాటుచేయుటకు 300mm dia MS నీటి సరఫరా లైన్ వేయుట. | రూ. 1,42,13,203/- |

1. బిడ్ వివరాలు మరియు డాక్యుమెంట్ 17.12.2019 ఉ.10.30 గం. నుండి వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో ఆన్‌లైన్ ద్వారా లభ్యమగును.
2. టెండరు కోరే అధికారి పేరు మరియు చిరునామా: చీఫ్ జనరల్ మేనేజర్ (E), రెవెన్యూ సర్కిల్, HMWSSB, ఖైరతాబాద్, హైదరాబాద్-04, ఫోన్ నం. (ల్యాండ్‌లైన్): 040-23442834 (ఎక్స్‌టెన్షన్ నం: 600).

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004


## 'సమత' కేసు నిందితుల తరఫు న్యాయవాది రహీం

**కోర్టు ఆదేశం మేరకు వాదించేందుకు అంగీకారం**

**ఆదిలాబాద్ టౌన్:** సంచలనం రేపిన సమత కేసు విషయంలో నిందితుల తరపున వాదించేందుకు సీనియర్ న్యాయవాది రహీంను నియమించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును వాదించేందుకు ఆయన అంగీకరించారు. ఈ నేపథ్యంలో నిందితుల కేసు పత్రాలను స్వీకరించారు. కేసుపై అధ్యయనం చేశారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులు షేక్ బాబు, షేక్ షాబొద్దీన్, షేక్ ముఖ్దూమ్‌లను బుధవారం మరోసారి కోర్టు ఎదుట హాజరు పర్చనున్నారు. కాగా, ఈ కేసులో పోలీసులు 44 మంది సాక్షులను విచారించారు. ఈ నెల 19 నుంచి కేసు కోర్టులో ట్రయల్‌కు వచ్చే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, నిందితుల తరపు న్యాయవాది రహీం తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న న్యాయవాది రహీం

## మహిళా ఉపాధ్యాయులపై అసభ్య ప్రవర్తన

**విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయులు**

శాలిగౌరారం

మహిళా ఉపాధ్యాయుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆరుగురు విద్యార్థులను ఉపాధ్యాయులు చితకబాదారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ప్రస్తుతం 708 మంది విద్యార్థులున్నారు. వారిలో 500 మంది పాఠశాల స్థాయిలో ఉండగా, మరో 208 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులు చదువుతున్నారు. మోడల్ స్కూల్‌లో మొత్తం 23 మంది ఉపాధ్యాయులు ఉండగా వారిలో 8 మంది మహిళా టీచర్లు ఉన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఆరుగురు విద్యార్థులు మహిళా ఉపాధ్యాయుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు సోమవారం ప్రిన్సిపాల్ చాంబర్‌లోకి పిలిపించి విచారించారు. ఆ సమయంలో చాంబర్‌లోని సీసీ కెమెరాలను నిలిపివేసి తొమ్మిది మంది ఉపాధ్యాయులు విద్యార్థులను కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో నడవలేని స్థితికి చేరుకున్నాడు. ప్రస్తుతం ఆ విద్యార్థి నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో విషయం వెలుగులోకి రావడంతో పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళనకు దిగి ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, ఎస్‌ఐ రాజులు పాఠశాలను సందర్శించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

## నదీజలాల వినియోగంపై అధికారుల బృందం పరిశీలన

**గద్వాల రూరల్:** రాష్ట్రంలో కృష్ణా, తుంగభద్ర నదుల పరిధిలో నిర్మించిన జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్టులతో పాటు నెట్టెంపాడు ఎత్తిపోతల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ఎంత మేర నీటిని వినియోగించారనేది సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణానది జలాల యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) అధికారుల బృందం సంయుక్తంగా పరిశీలించింది. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించింది. ఈ సందర్భంగా సాగునీటి ప్రాజెక్టుల అధికారులతో చర్చించింది. వరదలు వచ్చే సమయంలో నీటి నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో ఆరా తీసింది. నీటి లెక్కలకు సంబంధించిన టెలిమెట్రీ యంత్రాల పరిశీలనతో పాటు రికార్డులను తనిఖీ చేసింది. కార్యక్రమంలో కేఆర్‌ఎంబీ ఈఈలు రఘునాథ్‌రావు, శివశంకర్, ఇందిర పాల్గొన్నారు.

# 3 రంగాలే కీలకం

- ఉపాధి కల్పన లక్ష్యంగా టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై దృష్టి
- టీఎస్ఐపాస్ ద్వారా ఇప్పటికే 11,569 కంపెనీల రాక, 13 లక్షల మందికి ఉద్యోగాలు
- పెట్టుబడులు లక్ష్యంగా ప్రత్యేక వ్యూహం అమలుకు కేటీఆర్ ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భవిష్యత్తులో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పారిశ్రామిక పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు వెల్లడించారు. తెలంగాణ పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్, ఇతర ప్రభుత్వ పాలసీల మూలంగా గత ఐదేళ్లలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివచ్చాయన్నారు. మంగళవారం ప్రగతి భవన్‌లో పరిశ్రమలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. టీఎస్ఐపాస్ ద్వారా ఇప్పటివరకు 11,569 కంపెనీలకు అనుమతులు ఇవ్వగా, ఇందులో 80 శాతం కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు. తద్వారా సుమారు 13 లక్షల మందికి ఉపాధి లభించిందని కేటీఆర్ వెల్లడించారు.

### ఆ మూడు రంగాలకు ప్రాధాన్యత

రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమకు ఉన్న అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని టెక్స్‌టైల్ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేటీఆర్ వెల్లడించారు. దేశంలోనే అతి పెద్దదైన వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో కొరియా దిగ్గజ కంపెనీ యంగ్వాన్ భారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నదన్నారు. మరోవైపు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కూడా ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయని, ఇటీవల బెంగళూరులో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ప్రతినిధులతో నిర్వహించిన భేటీ తరహాలో వివిధ నగరాల్లో మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. వన్‌ప్లస్, స్కైవర్త్ తదితర కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ముందుకు వచ్చిన విషయాన్ని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. సాగునీటి ప్రాజెక్టు పనుల పూర్తి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యత తదితరాల నేపథ్యంలో వ్యవసాయ దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రైతులకు భరోసా దక్కడంతో పాటు, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేటీఆర్ అన్నారు.

**పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక వ్యూహం**

టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు తెచ్చేందుకు ఆయా రంగాలకు చెందిన కంపెనీలతో ప్రత్యేకంగా చర్చిస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఈ మూడు రంగాల్లో పెట్టుబడులతో దేశంలోకి కొత్తగా వచ్చే అంతర్జాతీయ కంపెనీలు, తమ కార్యకలాపాల విస్తరణకు సిద్ధంగా ఉన్న దేశీయ కంపెనీలు లక్ష్యంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక వ్యూహం అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ మూడు రంగాల పరిశ్రమల కోసం రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ల్యాండ్ బ్యాంక్, ఇండస్ట్రియల్ పార్కుల సమగ్ర సమాచారాన్ని పెట్టుబడులతో వచ్చే వారి కోసం సిద్ధం చేయాలన్నారు. పారిశ్రామిక, ఐటీ రంగాల్లో భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యంగా పనిచేయడంతో పాటు, రాష్ట్రంలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కంపెనీలకు 'టాస్క్'తరహా సంస్థలతో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, వివిధ విభాగాల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎంట్రీ సూపర్

**1.54 లక్షల మందికి ఉద్యోగాలు**

- ఈ ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులకు భారీగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు
- సిటీలోని టయర్–1, టయర్–2 కాలేజీల్లోని 8 వేల మందికి ప్లేస్‌మెంట్
- ఐఐటీ, నిట్స్, బిట్స్ పిలానీ విద్యార్థులకు విదేశీ సంస్థల భారీ ఆఫర్లు

**సాక్షి ప్రత్యేక ప్రతినిధి:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు ఈ ఏడాది ఉద్యోగాల పంట పండుతోంది. ప్రముఖ ఐటీ కంపెనీలు ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల కోసం నిర్వహించే క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 1.80 లక్షల మందికి ప్లేస్‌మెంట్స్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీలు ఇప్పటికే 1.54 లక్షల మంది బీటెక్ విద్యార్థులను తమ కంపెనీల్లో ఉద్యోగులుగా చేర్చుకున్నాయి. అయితే ఈ ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల్లో 94 శాతం మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చేరుతుండగా, 6 శాతం మంది బీఎస్సీ (కంప్యూటర్స్) విద్యార్థులున్నారు. ఈ రెండు కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్న ఐటీ కంపెనీలు ఎంటెక్ చదువుతున్న వారికి ఉద్యోగం ఇచ్చేందుకు మాత్రం ఆసక్తి చూపకపోవటం గమనార్హం.

### ఈ ఏడాది టయర్-1, టయర్-2కే పరిమితం

టీసీఎల్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, ఆక్సెంచర్, విప్రోలాంటి టాప్ కంపెనీలు దేశవ్యాప్తంగా డిసెంబర్ 10 నాటికి 65 వేల మందికి ఉద్యోగాలు కల్పించాయి. ఈ ఏడాది ఇప్పటివరకు హైదరాబాద్‌లోని టయర్–1, టయర్–2 ఇంజనీరింగ్ కాలేజీల్లో దాదాపు 8 వేల మందిని 5 టాప్ ఐటీ కంపెనీలు ఉద్యోగులుగా నియమించుకున్నాయి. మైక్రోసాఫ్ట్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఒరాకిల్, అమెజాన్, డెలాయిట్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు టయర్–1 కాలేజీలకు మాత్రమే పరిమితమయ్యాయి. హైదరాబాద్‌లో టయర్–1 కేటగిరీకి చెందిన 12 ఇంజనీరింగ్ కళాశాలల మొత్తం విద్యార్థుల్లో 92 శాతం మందికి ఉద్యోగాలు లభించాయి. అలాగే ఐఐటీ హైదరాబాద్, నిట్ వరంగల్, బిట్స్ శామీర్‌పేట్స్ కళాశాలల నుంచి ప్లేస్‌మెంట్‌కు హాజరైన ప్రతి విద్యార్థికి ఉద్యోగం లభించగా, ఐఐటీ, నిట్ విద్యార్థులకు విదేశీ సంస్థలు భారీగా ఆఫర్లు ఇచ్చాయి. అయితే, వచ్చే ఏడాది హైదరాబాద్‌లోని టయర్–3 కళాశాలల్లో



నియామకాలు చేపడతామని టీసీఎస్, ఇన్ఫోసిస్, ఆక్సెంచర్ లాంటి కంపెనీలు ప్రకటించడం మంచి పరిణామంగా కనిపిస్తోంది. అదే జరిగితే దాదాపు 60 ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు అవకాశం ఉంటుంది.

### విదేశాల నుంచి భారీగా ఆర్డర్లు..

ఇప్పటివరకు దేశీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఉత్తర అమెరికా నుంచి భారీగా ఆర్డర్లు వచ్చేవి. ఇప్పుడు యూరప్, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియాతో పాటు గల్ఫ్ దేశాలు, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి భారీగా ఆర్డర్లు వచ్చిపడుతున్నాయి. ఇక గడచిన ఆరు మాసాల్లో 100 బిలియన్ డాలర్ల మేర ఆర్డర్లు వచ్చాయని నాస్కామ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది చివరి నాటికి టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంది. కాగ్నిజెంట్, ఆక్సెంచర్ వంటి విదేశీ కంపెనీలు ఇక్కడ ఉద్యోగులను నియమించుకుని శిక్షణ అనంతరం ఆస్ట్రేలియా, అమెరికా, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్ వంటి దేశాలకు బదిలీ చేస్తున్నాయి. హెచ్1బీ వీసాల కారణంగా అమెరికా బదులు కెనడా, యూరప్ దేశాల్లోని కార్యాలయాల్లో ఎక్కువగా ఉద్యోగులను నియమించుకుంటున్నాయి.

**వచ్చే ఏడాది 2 లక్షల ఉద్యోగాలు**

నాస్కామ్ అంచనా ప్రకారం వచ్చే ఏడాది ఎంట్రీ లెవెల్‌లో 2 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అదే జరిగితే తెలంగాణ, ఏపీలోని టయర్–1, 2, 3 కాలేజీల్లో దాదాపు 25 వేల మంది బీటెక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీ ప్లేస్‌మెంట్ అధికారి చెప్పారు. ఈ ఏడాది ముందుగా అనుకున్న దానికంటే ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు లభించాయని, వచ్చే ఏడాదికి ఇప్పటినుంచే కంపెనీల నుంచి లేఖలు అందుతున్నాయని ఆ అధికారి వెల్లడించారు. హైదరాబాద్, విశాఖపట్నంలో ఐటీ కంపెనీల కార్యకలాపాలు పెరుగుతున్న దృష్ట్యా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఐటీ విశ్లేషకులు అంటున్నారు.

# పంచాయతీరాజ్‌లో బాధ్యతల పునఃపంపిణీ

**ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్**

**సాక్షి, హైదరాబాద్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఇంజనీరింగ్ విభాగపు ఉన్నతాధికారులకు శాఖాపరమైన బాధ్యతలను పునఃపంపిణీ చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా పనిచేస్తున్న ఎం.సత్యనారాయణరెడ్డికి పరిపాలన, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లతో వేసే రోడ్లు (సీఆర్ఆర్, ఎంఆర్ఆర్, ఎస్టీఎస్డీఎఫ్), ప్లానింగ్ విభాగం, క్లాస్–1, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ల వ్యవహారాలను అప్పగించారు. చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఎం.రవీంద్రకు విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, ఎస్‌క్యూసీ ఆఫ్ పీఎంజీఎస్‌వై, ఎంఐఎస్, ఈజీఎస్, క్లాస్ కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్, పీఆర్ ఈఎన్‌సీ అప్పగించే ఇతర విధులు అప్పగించారు. ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరిస్తున్న ఎం.రాజశేఖర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పనులు (సీఎస్ఎస్, పీఎంజీఎస్‌వై), డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం, హరితహారం, రోడ్డు భద్రత, ఈఎన్‌సీ అప్పగించే ఇతర బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.మృత్యుంజయంకు నాబార్డు, వివిధ పద్దుల కింద చేపట్టే భవన నిర్మాణాలు, టెక్నికల్, సీఎస్‌టీ సెక్షన్లు, రోడ్డు కటింగ్, ఎన్‌జీటీ, ఎంపీ ల్యాడ్స్, ఏసీడీపీ నిధులతో చేపట్టే పనులను కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

**మిషన్ భగీరథకు ఐదుగురు సీఈలు..**

మిషన్ భగీరథ విభాగానికి అదనంగా ఐదుగురు చీఫ్ ఇంజనీర్ల (సీఈ)ను కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న నలుగురు సీఈలతో కలిపి మొత్తం 9 మంది సీఈలు మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు కొత్తగా ఐదు పోస్టులను కలిపిస్తూ ఆర్థికశాఖ ఆదేశాలిచ్చింది. వీరందరికీ మూడు, నాలుగేసి జిల్లాల చొప్పున బాధ్యతలు అప్పగించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

# పింఛనుదారుల సమస్యల సాధనకు త్వరలో కార్యాచరణ

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ పింఛనుదారుల దినోత్సవాలు మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ పింఛనుదారుల ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) నిర్వహించిన ఈ వేడుకలకు లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారుల పితామహుడు డీఎస్ నఖారాకు ఘనంగా నివాళులర్పించారు. పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అఖిల భారత పింఛన్‌దారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్ రావు, సహ అధ్యక్షుడు సుధాకర్‌లు ప్రస్తావించారు. సమస్యల సాధనకు ఆందోళనల బాట పట్టాలని, త్వరలో సమావేశమై కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ సూర్యనారాయణ, తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల సంఘం నేతలు నారాయణరావు, ఎ.రాజేంద్రబాబు, ఎంవీ నర్సింగరావు, భరత్ రెడ్డి, మదన్మోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.




# కార్మిక సంఘాల ఏర్పాటు ప్రజాస్వామిక హక్కు

- సమ్మెకాలంలో మృతి చెందిన ఆర్టీసీ కార్మికులకు యూనియన్ అండగా ఉంటుంది: అశ్వత్థామరెడ్డి
- కార్మికులపై కక్ష సాధింపులకు పాల్పడితే సహించేది లేదు



**హైదరాబాద్:** కార్మికుల సంక్షేమం కోసం సంఘాలు, యూనియన్‌ల ఏర్పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన హక్కని, వాటిని కాలరాయాలని చూస్తే సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి హెచ్చరించారు. చంపాపేట డివిజన్ పరిధిలోని చంద్రాగార్డెన్‌లో మంగళవారం ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు తిరుపతి ఏర్పాటు చేసిన కేంద్రకమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ.. సమ్మెకాలంలో ఆర్టీసీ సొత్తును యాజమాన్యంతో కలిసి దోచుకున్నారని, వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె విరమణ అనంతరం ఆర్టీసీ యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపులకు దిగుతున్నారని, ఆవిధానం మానుకోకపోతే మళ్లీ ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు. బస్సుల సంఖ్యను కుదించటం వల్ల కార్మికులు డ్యూటీల కోసం బస్‌డిపోల ముందు రాత్రింబవళ్లు పడిగాపులు కాయటమే కాకుండా ఓవర్‌లోడ్ ప్యాసింజర్‌తో కార్మికులు పని ఒత్తిడికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి బస్ డిపోలో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల సమస్యలపై అవగాహన లేని వ్యక్తులను కార్మిక సంక్షేమ సభ్యులుగా నియమించటం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమ్మె విరమణ అనంతరం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు పరచకుండా ఉద్యోగులను పొమ్మనలేక పొగ పెట్టేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఇబ్బందులను లేబర్ కోర్టు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు బీవీరెడ్డి, మారయ్య, వీఎస్‌రెడ్డి, రాజలింగం, శంకర్, 97 బస్‌డిపోల కార్మికులు పాల్గొన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.